

RNI NO. TELTEL/2014/61071

జన తెలంగాణ

తెలుగు దిన పత్రిక

PUBLISHED PROM:HYDARABAD,KARIMNAGAR,KAMMAM,V IZAYAWADA,KADAPA,THIRUPATHI

సంపుటి : 14 సంచిక :206 | మంగళవారం నవంబర్ 24, 2026 | ఎడిటర్ - ఆర్. చైతన్య | పేజీలు 8 | వెల-5

గ్లోబల్ సమిట్

ఏర్పాట్లపై సీఎం రేవంత్‌రెడ్డి సమీక్ష

- సమిట్ ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలి.
- నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదు.
- ఫేసియల్ రికగ్నిషన్‌తో ప్రతినిధులకు ప్రవేశం.
- అతిథులతో మర్యాదగా వ్యవహరించాలి.
- ఫుడ్‌కోర్టులు, మెరుగైన ఇంటర్నెట్ సదుపాయాలు.
- విమానాశ్రయం నుంచి ప్రత్యేక లైజనింగ్ అధికారులు.



హైదరాబాద్: తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న గ్లోబల్ సమిట్‌కు రానున్న ప్రతినిధుల కోసం పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశించారు. గ్లోబల్ సమిట్ ఏర్పాట్లలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదన్నారు. గ్లోబల్ సమిట్ ఏర్పాట్లపై బోధి పెవిలియన్‌లో సీఎం రేవంత్‌రెడ్డి సమీక్ష నిర్వహించారు. ఫేసియల్ రికగ్నిషన్ ద్వారా గ్లోబల్ సమిట్ ప్రతినిధులకు ప్రవేశం కల్పించాలని తెలిపారు.

2లో

నేపాల్‌కు రూ.15 వేల కోట్ల ప్యాకేజీ:

ప్రధాని మోదీ

- నేపాల్‌కు భారీ అభివృద్ధి ప్యాకేజీ ప్రకటన.
- 24 వేల కోట్ల నేపాలీ రూపాయల సాయం.
- నేపాల్ ప్రధాని బాలేంద్ర షాతో మోదీ భేటీ.
- పలు అభివృద్ధి ప్రాజెక్టులకు వర్చువల్ శంకుస్థాపన.
- అయోధ్య--జనక్‌పుర్ మధ్య రైలు ప్రారంభం.



2లో

సముద్రంలో గల్లంతైన విద్యార్థి మృతి



2లో

ఏపీలో మరో భారీ రైల్వే ప్రాజెక్ట్‌కు టెండర్ల ఆహ్వానం

2లో

కర్రెగుట్టల్లోకి పర్యాటకులను అనుమతిస్తే ప్రమాదాలు జరిగే అవకాశం: డీజీపీ

2లో

ఆదాయం లేకపోవడమే పేదరికం కాదు:

నిర్మలా సీతారామన్

- కనీస అవసరాలు అందకపోయినా పేదరికమే.
- ఇల్లు, తాగునీరు, వైద్యం అందుబాటులో ఉండాలి.
- తీవ్రమైన అనారోగ్యంతో కుటుంబం పేదరికంలోకి.
- 2011--23 మధ్య 50 కోట్ల మంది పేదరికం నుంచి బయటపడ్డారు.
- మోదీ ప్రభుత్వ సంక్షేమ పథకాలతో మార్పు.
- స్వచ్ఛ భారత్, జల్ జీవన్, ఉజ్వల పథకాలతో లబ్ధి.
- ఆయుష్మాన్ భారత్, ముద్ర రుణాలతో పేదలకు చేయూత.
- 2047 నాటికి వికసిత్ భారత్ లక్ష్యం.



పేదరికంపై కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఇల్లు, తాగునీరు, వైద్యం వంటి కనీస అవసరాలకు కూడా నోచుకోలేకపోవడం పేదరికం కిందకే వస్తుందని పేర్కొన్నారు. ఈ మేరకు లింక్డిన్‌లో సుదీర్ఘ పోస్టు రాసుకొచ్చారు. భారత్‌లో 50 కోట్ల మంది కటిక పేదరికాన్ని జయించారంటూ ప్రపంచబ్యాంక్ నివేదిక వెలువరించిన నేపథ్యంలో ఈ పోస్ట్ పెట్టారు.

2లో



ఏ నిర్ణయం తీసుకోకుండానే ముగిసిన కేఆర్ఎంబీ సమావేశం

జలసౌధలో భేటీ అయిన కృష్ణా నదీ యాజమాన్య బోర్డు (ఖ=వీదీ) త్రిసభ్య కమిటీ ఎలాంటి నిర్ణయం తీసుకోకుండానే సమావేశాన్ని ముగించింది.

2లో



ప్రేమ, సేవ, మానవత్వమే నిజమైన ఆధ్యాత్మికత:

- సత్యసాయి బాబా సేవలు చిరస్మరణీయం.
- విద్య, వైద్యం, తాగునీటికి విశేష సేవలు.
- నిస్వార్థ సేవే నిజమైన ఆధ్యాత్మికత.

2లో



మారిటైం, ఇండస్ట్రియల్ గేట్ వేగా ఏపీ:



- ఏపీని అంతర్జాతీయ మారిటైం హబ్‌గా తీర్చిదిద్దుతాం.
- రాష్ట్రానికి 1,053 కి.మీ. సముద్ర తీరం.
- నాలుగు కొత్త పోర్టుల నిర్మాణం.
- విశాఖ పోర్టులో 91.17 మిలియన్ టన్నుల సరకు నిర్వహణ.
- దుగరాజపట్నంలో రూ.30 వేల కోట్లతో షిప్ బిల్డింగ్ క్లస్టర్ ప్రతిపాదన.

2లో

హైదరాబాద్ మెట్రోకు రుణం.. నా పరిధిలో లేదు: అశ్వినీ వైష్ణవ్



- మెట్రో ఫేజ్-2 ఆర్థిక సాయం తన పరిధిలో లేదన్న మంత్రి.
- ఐఆర్ఎఫ్‌సీ రుణాల విషయం తెలియదని వెల్లడి.
- మెట్రో నిధుల కోసం సీఎం రేవంత్ పలుమార్లు విజ్ఞప్తి.
- వచ్చే ఏడాది మేలో బుల్లెట్ రైలు ట్రయల్ రన్.
- గంటకు 250 కి.మీ. వేగంతో బుల్లెట్ రైలు.

2లో

విజయవాడ మేయర్‌గా వంగవీటి రాధా ప్రమాణ స్వీకారం



విజయవాడ: విజయవాడ నగరపాలక సంస్థలో కొత్త పాలకవర్గం కొలువుదీరింది. నగరంలోని అంబేడ్కర్ కళావేదికలో మేయర్, కార్పొరేటర్ల ప్రమాణస్వీకారం జరిగింది. తొలుత మేయర్‌గా వంగవీటి రాధాకృష్ణ ప్రమాణస్వీకారం చేశారు. ఆ తర్వాత నగరంలోని 86 వార్డుల కార్పొరేటర్ల ప్రమాణస్వీకారోత్సవం జరిగింది. నగరంలో 86 డివిజన్లలో తెదేపా 53, జనసేన 19, వైకాపా 8, భాజపా 4, సీపీఎం ఒక డివిజన్‌లో గెలిచిన విషయం తెలిసిందే.

RNI NO. TELTEL/2014/61071
జన తెలంగాణ
తెలుగు దిన పత్రిక
మంగళవారం నవంబర్ 24, 2026

సంపాదకీయం

సముద్రం మీద చెరగని సంతకం

చేరన్ రుద్రమూర్తి గారి 'టెలిఫోన్ కాల్' కవితలోని ఈ చివరి పంక్తులు ఇప్పుడు చదువుతుంటే మనసు కలచివేస్తోంది. యుద్ధం, నిర్వాసితత్వం, ప్రేమ, జ్ఞాపకాల మధ్య ఒక కవి సృజనాత్మక...

చేరన్ రుద్రమూర్తి గారి 'టెలిఫోన్ కాల్' కవితలోని ఈ చివరి పంక్తులు ఇప్పుడు చదువుతుంటే మనసు కలచివేస్తోంది. యుద్ధం, నిర్వాసితత్వం, ప్రేమ, జ్ఞాపకాల మధ్య ఒక కవి సృజనాత్మక ప్రయాణం వారి జీవితం.

చేరన్ జాఫ్నా విశ్వవిద్యాలయంలో జీవశాస్త్రం అభ్యసించారు. ఒక కెనడా విశ్వవిద్యాలయంలో అధ్యాపకుడిగా, పరిశోధకుడిగా పనిచేశారు. మనదేశ కాలమానం ప్రకారం ఈ నెల 19న తొలిగడియల్లో కెనడాలో వారి చివరి శ్వాస గాలిలో కలిసిపోయిందని తెలిసినప్పటి నుంచి నా మనసంతా దిగులు. వారి కవిత్వంతో నాకు ప్రత్యేకమైన సాహిత్యానుబంధం ఉంది. వారి కవితలను తెలుగులోకి అనువాదం చేసాను. 1960లో శ్రీలంకలోని జాఫ్నా ప్రాంతానికి సమీపంలోని అలవెట్టి గ్రామంలో జన్మించిన చేరన్ రుద్రమూర్తి, ఆధునిక తమిళ సాహిత్యంలో విశిష్ట కవిగా ఎదిగారు. తండ్రి టి. రుద్రమూర్తి తమిళ సాహిత్యంలో 'మహాకవి'గా ప్రసిద్ధులు. అలా సాహిత్య వాతావరణంలో పెరిగిన చేరన్‌కు చిన్ననాటి నుంచే తమిళ సంప్రదాయ కవిత్వంతోపాటు ఆధునిక సాహిత్య ధోరణులతో పరిచయం ఏర్పడింది. కవిగా మాత్రమే గాక పాత్రికేయుడిగా, నాటక రచయితగా, సామాజిక పరిశోధకుడిగానూ వారికి ప్రత్యేక గుర్తింపు ఉంది. జాతి అస్తిత్వం, వలసలు, నిర్వాసితత్వం, జాతీయవాదం, సాంస్కృతిక జ్ఞాపకాలు ఆయన పరిశోధనల్లో ముఖ్యమైన అంశాలు. వారి సాహిత్య జీవితాన్నీ, పరిశోధనా జీవితాన్నీ విడివిడిగా చూడలేం. రెండింటిలోనూ మనిషి అస్తిత్వం, చరిత్ర, అధికార సంబంధాలు, జ్ఞాపకాల పట్ల ఒక నిరంతర అన్వేషణ కనిపిస్తుంది.

చేరన్ కవిత్వంలో సముద్రం ఒక ముఖ్యమైన ప్రతీక. ఆయన బాల్యం గడిచిన నేలకు సముద్రంతో ఉన్న అనుబంధం ఆయన సృజనాత్మక ఊహాశక్తిని ప్రభావితం చేసింది. సముద్రం ఆయన కవిత్వంలో ప్రకృతి సౌందర్యానికి మాత్రమే ప్రతీక కాదు. అది జ్ఞాపకం. ప్రయాణం. వియోగం. దూరం. ఒక్కోసారి మాతృభూమికీ, నిర్వాసిత జీవితానికీ మధ్య నిలిచిన భౌగోళిక సరిహద్దు. మొదట్లో రాసిన కవిత్వంలోని సముద్ర సౌందర్యం-- తరువాతి కవిత్వంలో యుద్ధం, హింస, నిర్వాసితత్వం వంటి అనుభవాలతో కొత్త అర్థాలను సంతరించుకుంది. తమిళంలో పదిహేనుకుపైగా పుస్తకాలను వెలువరించిన చేరన్ రచనలు దాదాపు ఇరవై భాషల్లోకి అనువాదమైయ్యాయి. లక్ష్మీ హామ్‌స్ట్రోమ్ అనువదించిన 'ఎ సెకెండ్ సన్‌రైస్' వారి కవిత్వాన్ని అంతర్జాతీయ పాఠకులకు పరిచయం చేసింది. కవిత్వంతోపాటు ఆయన చేసిన పరిశోధనలు కూడా ముఖ్యమైనవి. 'హిస్టరి అండ్ ద తమిళ్ డయస్పోర ఇమేజినేషన్', 'తమిళ్ కల్చర్ ఇన్ ద గ్లోబల్ కాంటెక్స్‌ట్' మొదలైన ఎన్నో రచనలు, సంపాదకత్వ గ్రంథాలు వారి మేధో ప్రయాణంలోని ముఖ్యమైనవి. ఈ రచనలను చూసినప్పుడు చేరన్ కవిత్వంలో వ్యక్తం చేసిన ప్రశ్నలనే సామాజిక పరిశోధనలో మరొక విధంగా అన్వేషించారని అనిపిస్తుంది. ఒకవైపు కవిత్వంలో మానవ విషాదాన్ని అనుభూతి స్థాయిలో వ్యక్తం చేయటం, మరొకవైపు పరిశోధనతో ఆ విషాదానికి కారణమైన చారిత్రక, సామాజిక పరిస్థితులను అర్థం చేసుకోవటం ఈ రెండు ప్రక్రియలూ ఆయన సృజనాత్మక జీవితంలో పరస్పరం సంభాషించుకున్నాయి.

శ్రీలంక తమిళుల చరిత్రలోని యుద్ధం, హింస, నిర్వాసితత్వం చేరన్ కవిత్వానికి ముఖ్యమైన చారిత్రక నేపథ్యం. అయితే వారి కవిత్వంలో యుద్ధం కేవలం ఒక రాజకీయ సంఘటన కాదు. అది మనిషి జీవితాన్ని, భాషను, జ్ఞాపకాలను, సంబంధాలను, అస్తిత్వాన్ని సమూలంగా మార్చివేసే అనుభవం. యుద్ధం గురించి రాయటమంటే కేవలం విధ్వంసాన్ని వర్ణించటం కాదు. ఆ విధ్వంసంలో కనిపించకుండా పోయిన మనుషులను తిరిగి గుర్తించటం. చరిత్ర నమోదు చేయని వారి జీవితాలను జ్ఞాపకాల్లో నిలబెట్టటం. నేను తెలుగులోకి స్వేచ్ఛానువాదం చేసిన వారి కవిత 'పిల్లలు స్త్రీలు పురుషుల ఛాయాచిత్రాలు' ఈ దృక్పథానికి ఒక ముఖ్యమైన ఉదాహరణ:

"ప్రతి హత్యకి వొక కథ వుంది
ప్రతి కథకి జ్ఞాపకాలు వున్నాయి
ప్రతి హత్య చరిత్రా తాజాగానే వుంది
కానీ వారి గొంతులు వినపడవ్." -- యుద్ధంలో మరణించినవారు చరిత్రకు సంఖ్యలు కావచ్చు. ఛాయాచిత్రాలు కావచ్చు. అధికారిక నివేదికలకు గణాంకాలు కావచ్చు. కానీ వాళ్లు ఒకప్పుడు జీవించిన మనుషులు. వాళ్లకు పేర్లు ఊర్లు ఉన్నాయి, కలలు, ప్రేమలు ఉన్నాయి. భవిష్యత్తుపై ఆశలున్నాయి. ఆ జీవితాలన్నీ ఒక హింసాత్మక చారిత్రక సందర్భంలో అంతమైపోయాయి. అయితే వారి మరణంతోపాటు వారి జీవితాల జ్ఞాపకాలు కూడా అంతమైపోవాలా? చేరన్ ఈ ప్రశ్నను అత్యంత మానవీయంగా మన ముందుంచుతారు.

మరణానికి ముందు ఫోన్ కాల్‌లో సంభాషణగా సాగే 'టెలిఫోన్ కాల్' కవితను శ్రీలంక అంతర్యుద్ధం చివరి దశలోని మానవ విషాదాన్ని గుర్తుచేసే చారిత్రక సందర్భం నేపథ్యంగా చదవాలి.

"మేం తెల్ల జెండాలని యెగరవేసాం.
వాగ్ధత్త సందేశం కోసం
యెదురు చూస్తున్నాం.
దాని జాడే లేదు." తెల్లజెండా ఇక్కడ ఒక సాధారణ దృశ్యం కాదు. అది ప్రాణరక్షణ కోసం చేసే అభ్యర్థన. మరణానికి అతిసమీపంలో ఉన్న మనుషులు ఒక సందేశం కోసం ఎదురు చూస్తున్నారు. ఆ సందేశం రాకపోవటంలోని నిశ్శబ్దమే కవితలో భయంకరవిషాదంగా మారుతుంది. ఆఖరి ఫోన్ కాల్ అంటే కేవలం ఒక సంభాషణ ముగియటం కాదు. ప్రపంచంతో మనిషికి మిగిలిన చివరి సంబంధం కూడా తెగిపోవటం. ఇక్కడ శాటిలైట్ టెలిఫోన్ ఒక సాంకేతిక పరికరం మాత్రమే కాదు. జీవితానికీ మరణానికీ మధ్య మిగిలిన చివరి సంభాషణ దారం. ఆ దారం కూడా తెగిపోయిన తర్వాత మిగిలేది నిశ్శబ్దమే. చేరన్ కవిత్వం ఆ నిశ్శబ్దానికి గొంతునిస్తుంది.

చేరన్ కవిత్వంలో మరో ముఖ్య అనుభవం నిర్వాసితత్వం. యుద్ధం మనుషులను వారి మాతృభూమి నుంచి దూరం చేస్తుంది. కానీ ఒక మనిషి తన నేలను విడిచి వెళ్లినప్పుడు కోల్పోయేది కేవలం భౌగోళిక ప్రదేశాన్ని మాత్రమే కాదు.

ఎడిటర్ చైతన్య

ఏ నిర్ణయం తీసుకోకుండానే ముగిసిన కేఆర్ఎంబీ సమావేశం

మొదటిపేజీ తరువాయి

హైదరాబాద్: జలసౌధలో భేటీ అయిన కృష్ణా నదీ యాజమాన్య బోర్డు త్రిసభ్య కమిటీ ఎలాంటి నిర్ణయం తీసుకోకుండానే సమావేశాన్ని ముగించింది. చర్చలో భాగంగా మొత్తం 19 టీఎంసీలు కావాలని ఏపీ కోరగా.. ఫిబ్రవరి వరకు 21 టీఎంసీలు కావాలని తెలంగాణ అడిగింది. ఈనేపథ్యంలో పూర్తిస్థాయి బోర్డు సమావేశంలో మరోసారి చర్చించాలని యాజమాన్య బోర్డు నిర్ణయించింది. పల్నాడు వాటర్ గ్రిడ్ అంశాన్ని తెలంగాణ లేవనెత్తగా.. గ్రామీణ నీటి సరఫరా శాఖ ఆ పనులు చేస్తోందని, ఆ విషయాలు తమకు తెలియవని ఏపీ జలవనరుల శాఖ అధికారులు పేర్కొన్నారు.

సమావేశం అనంతరం తెలంగాణ ఇంజినీర్ ఇన్ చీఫ్ రమేశ్‌బాబు మీడియాతో మాట్లాడుతూ.. సాగర్‌లో మొత్తం 45 టీఎంసీల నీరు ఉందన్నారు. వచ్చే జులై వరకు సాగర్ నీటిని జాగ్రత్తగా వాడుకోవాలన్నారు. హైదరాబాద్ తాగునీటి కోసమే జులై వరకు 15 టీఎంసీలు అవసరమవుతాయన్నారు. " సాగర్ నీళ్లు తాగునీరు, కుడి, ఎడమ కాల్వల కోసమే వాడాలని చెప్పాం. కృష్ణా డెల్టాకు చుక్క నీరు కూడా ఇచ్చే అవకాశం లేదని చెప్పాం. హైదరాబాద్ తాగునీరు పోను.. మిగిలిన 25 టీఎంసీలపై చర్చిద్దామని చెప్పాం. ఏపీకి పులిచింతలలో 42 టీఎంసీలు ఉన్నాయి. పట్టిసీమ నుంచి కూడా కృష్ణా డెల్టాకు నీళ్లు వస్తున్నాయి. సాగర్‌లో ఉన్న 45 టీఎంసీల్లో 5 టీఎంసీలు ఆవిరయ్యే అవకాశం ఉంది" అని రమేశ్ బాబు అన్నారు. కాగా, కృష్ణా డెల్టాకు నీరు ఇవ్వాలని ఒత్తిడి చేసినట్లు ఆంధ్రప్రదేశ్ ఇంజినీర్ ఇన్ చీఫ్ నరసింహమూర్తి తెలిపారు. దీనిపై 10 రోజుల క్రితమే బోర్డుకు లేఖలు రాసినట్లు చెప్పారు. పల్నాడు వాటర్ గ్రిడ్ గురించి ఈ సమావేశంలో చర్చకు రాలేదన్నారు.

కర్రెగుట్టల్లోకి పర్యాటకులను అనుమతిస్తే ప్రమాదాలు జరిగే అవకాశం: డీజీపీ

మొదటిపేజీ తరువాయి

హైదరాబాద్: కర్రెగుట్టల్లోకి పర్యాటకులను అనుమతిస్తే ప్రమాదాలు జరిగే అవకాశముందని తెలంగాణ డీజీపీ సీవీ ఆనంద్ అన్నారు. లొంగిపోయిన మావోయిస్టులకు పునరావాస ప్యాకేజీ అందజేత కార్యక్రమంలో ఆయన మాట్లాడారు.

"కర్రెగుట్టల ప్రాంతాన్ని అభివృద్ధి చేస్తున్నాం. అక్కడ మావోయిస్టులు పెద్ద సంఖ్యలో వివిధ రకాల మైన్స్ ఏర్పాటు చేశారు. ప్రెషర్ మైన్స్ ఎక్కువగా ఉన్నట్లు అనుమానముంది. అవి ఎక్కడెక్కడ ఏర్పాటు చేశారో స్పష్టమైన సమాచారం లేదు. కొంతమంది మావోయిస్టులను విచారించడంతో 9 డంప్‌లను గుర్తించాం. కర్రెగుట్టల్లోకి పర్యాటకులను అనుమతిస్తే ప్రమాదాలు జరిగి ఇబ్బందులు ఎదురవుతాయి. ఆ ప్రాంతంలో మైన్స్‌ను పూర్తిగా క్లియర్ చేసి భద్రతా చర్యలు చేపట్టిన తర్వాతే పర్యాటకులు వెళ్లేందుకు అనుమతిస్తాం"అని డీజీపీ తెలిపారు.

నిస్వార్థ సేవే నిజమైన ఆధ్యాత్మికత అని సత్యసాయి చాటిచెప్పారు: సీఎం చంద్రబాబు

మొదటిపేజీ తరువాయి

అమరావతి: ప్రేమ, సేవ, మానవత్వమే ఆధ్యాత్మికతకు అసలైన అర్థమని ప్రపంచానికి చాటిన మహనీయుడు భగవాన్ సత్యసాయి బాబా అని సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్ అన్నారు. సత్యసాయి బాబా జయంతి సందర్భంగా ఆయన అందించిన ఆధ్యాత్మిక సందేశం, సమాజ సేవలను స్మరించుకున్నారు. విద్య, వైద్యం, తాగునీటి రంగాల్లో సత్యసాయి అందించిన సేవలు చిరస్మరణీయమని చంద్రబాబు కొనియాడారు. నిస్వార్థ సేవే నిజమైన ఆధ్యాత్మికత అని ఆయన చాటిచెప్పారని గుర్తుచేశారు. సత్యం, ధర్మం, శాంతి, ప్రేమ, అహింస బోధనలు ఎప్పటికీ ఆచరణీయమన్నారు. అందరినీ ప్రేమించు.. అందరినీ సేవించు అనే సాయి సందేశాన్ని ఆచరణలో పెట్టాలని పిలుపునిచ్చారు.

సత్యసాయి బాబా జయంతిని రాష్ట్ర పండుగగా నిర్వహించాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించిందని మంత్రి నారా లోకేశ్ తెలిపారు. భారతీయ ఆధ్యాత్మికతను, సంస్కృతిని ప్రపంచానికి చాటిన మహనీయుడు సత్యసాయి అని కొనియాడారు. విద్యాలయాలు, ఆసుపత్రులు, తాగునీటి పథకాలతో ఆయన చేసిన సేవలు ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయాయని అన్నారు. సత్యసాయి సేవా మార్గాన్ని, బోధనలను భావితరాలకు అందించాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. మానవ సేవే పరమావధిగా జీవించిన సత్యసాయి ఆశయాలను ప్రతి ఒక్కరూ అనుసరించాలని పిలుపునిచ్చారు.

మారిటైం, ఇండస్ట్రియల్ గేట్‌వేగా ఏపీ: నారా లోకేశ్

మొదటిపేజీ తరువాయి

విశాఖ(వన్‌టౌన్): మారిటైం రంగంలో ఆగ్నేయాసియా దేశాలతో బలమైన, శాశ్వతమైన భాగస్వామ్యాలు కోరుకుంటున్నామని ఏపీ మంత్రి నారా లోకేశ్ (చీఝీఝీ ూశీఎవంష్ట్ర) అన్నారు. సముద్ర అనుసంధానం, సాంకేతికత, స్వచ్ఛ ఇంధనం, నైపుణ్యాభివృద్ధి రంగాల్లో కలిసి పనిచేసేందుకు తమ ప్రభుత్వం సిద్ధంగా ఉందని చెప్పారు. ఇండియా ఫౌండేషన్, విదేశాంగ శాఖ సంయుక్త భాగస్వామ్యంతో విశాఖలో నిర్వహించిన ఏషియన్- ఇండియా మారిటైం కాంక్లేవ్‌లో లోకేశ్ మాట్లాడారు.

నాలుగు కొత్త పోర్టుల నిర్మాణం జరుగుతోంది

"విశాఖపట్నానికి గొప్ప సముద్ర చరిత్ర ఉంది. తూర్పు నౌకాదళ ప్రధాన కేంద్రానికి ఈ నగరం నిలయం. నేడు వాణిజ్యం, సాంకేతిక రంగాల్లో ముఖ్యమైన కేంద్రంగా అభివృద్ధి చెందుతోంది. దేశంలోనే అత్యంత పొడవైన తీర ప్రాంతాల్లో ఒకటైన ఏపీకి దాదాపు 1,053 కి.మీల సముద్ర తీరం ఉంది. సీఎం చంద్రబాబు నేతృత్వంలో రాష్ట్రాన్ని మేజర్ మారిటైం, ఇండస్ట్రియల్ గేట్ వేగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నాం. గత ఆర్థిక సంవత్సరంలో విశాఖపట్నం పోర్టు రికార్డు స్థాయిలో 91.17 మిలియన్ టన్నుల సరకును నిర్వహించింది. ఈ విషయంలో దాదాపు 10 శాతం వృద్ధి నమోదైంది. రామాయపట్నం, మూలపేట, మచిలీపట్నం, కాకినాడలో 4 నూతన పోర్టుల నిర్మాణ పనులు జరుగుతున్నాయి. ఈ పోర్టులు రవాణా అనుసంధానాన్ని మెరుగుపరచడంతో పాటు ఏపీ, పొరుగు రాష్ట్రాల్లోని పరిశ్రమలకు తోడ్పాటునందిస్తాయి. దుగరాజపట్నంలో దాదాపు రూ.30వేల కోట్ల పెట్టుబడితో మేజర్ షిప్ బిల్డింగ్ క్లస్టర్‌ను ఏర్పాటు చేయాలని ప్రతిపాదించాం. గత వారమే విశాఖపట్నంలో పోర్టుల విస్తరణ, లాజిస్టిక్స్, ప్రత్యేక టెర్మినల్స్, నౌకల మరమ్మతులు వంటి రంగాలకు సంబంధించి దాదాపు రూ.7,500 కోట్ల విలువైన అవగాహన ఒప్పందాలు కుదిరాయి. పోర్టులను పరిశ్రమలతో, పరిశ్రమలను అంతర్జాతీయ మార్కెట్లతో అనుసంధానించడమే మా ప్రధాన లక్ష్యం.

సముద్ర ఆధారిత ఆర్థిక వ్యవస్థకు కేంద్రం ప్రాధాన్యత

ప్రధాని మోదీ నాయకత్వంలో సముద్ర ఆధారిత ఆర్థిక వ్యవస్థకు కేంద్ర ప్రభుత్వం కొత్త ప్రాధాన్యతను ఇస్తోంది. సాగరమాల, మారిటైమ్ ఇండియా విజన్ 2030, మారిటైమ్ అమృత్ కాల్ విజన్ 2047 కార్యక్రమాల ద్వారా మెరుగైన నౌకాశ్రయాలు, నౌకా నిర్మాణం, రవాణా, సరకు నిర్వహణ, మౌలిక సదుపాయాల అభివృద్ధికి పెట్టుబడులు పెడుతున్నాం. భారత నౌకా నిర్మాణం, సముద్ర రంగాన్ని బలోపేతం చేసేందుకు దాదాపు రూ.70,000 కోట్లతో కూడిన ప్యాకేజీకి కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. ఇందులో రూ.25,000 కోట్ల మారిటైమ్ డెవలప్‌మెంట్ ఫండ్ కూడా ఉంది. భారతదేశ వాణిజ్యంలో దాదాపు 95 శాతం సరకు రవాణా సముద్ర మార్గం ద్వారానే జరుగుతోంది. మన ఆర్థిక అభివృద్ధికి మెరుగైన నౌకాశ్రయాలు, నౌకాయాన మౌలిక సదుపాయాలు అత్యంత అవసరం. ప్రతి నూతన నౌకాశ్రయం పరిశ్రమలకు, వ్యాపారాలకు, యువతకు కొత్త అవకాశాలను సృష్టిస్తుంది"అని లోకేశ్ అన్నారు.

హైదరాబాద్ మెట్రోకు రుణం.. నా పరిధిలో లేదు: అశ్వినీ వైష్ణవ్

మొదటిపేజీ తరువాయి

దిల్లీ: హైదరాబాద్ మెట్రో రెండోదశ విస్తరణకు ఆర్థిక సాయం తన పరిధిలో లేని అంశమని రైల్వేశాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ అన్నారు. రెండోదశ నిర్మాణానికి ఇండియన్ రైల్వే ఫైనాన్స్ కార్పొరేషన్ (ఐఆర్ఎఫ్‌సీ) ఇస్తానన్న రుణం సంగతి కూడా తనకు తెలియదని చెప్పారు. మెట్రో ఫేజ్-2 రుణాల కోసం పలుమార్లు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి.. అశ్వినీ వైష్ణవ్‌ను కలిసి మెమొరాండం సమర్పించారు. రెండోదశకు అనుమతులు, నిధులు ఇవ్వాలని ప్రత్యేకంగా విజ్ఞప్తి చేశారు. ఐఆర్ఎఫ్‌సీ నిధుల వ్యవహారంలో గతంలో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, సీఎం రేవంత్‌రెడ్డి కలిసి అశ్వినీ వైష్ణవ్‌తో చర్చించారు. కానీ, సోమవారం ఆయన మీడియాతో ఇష్టాగోష్టిగా మాట్లాడుతూ హైదరాబాద్ మెట్రో, ఐఆర్ఎఫ్‌సీ ఆర్థిక సహకారం విషయాలేవీ తనకు తెలియదని చెప్పడం గమనార్హం.

మే నెలలో బుల్లెట్ రైలు ట్రయల్ రన్

మరోవైపు వచ్చే ఏడాది మేలో బుల్లెట్ రైలు ట్రయల్ రన్ నిర్వహించనున్నట్లు రైల్వేశాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ తెలిపారు. ఈ రైలు 250 కి.మీ వేగంతో నడుస్తుందన్నారు. అహ్మదాబాద్- ముంబయి మధ్య బుల్లెట్ ట్రైన్ కారిడార్ నిర్మాణం వేగంగా జరుగుతోందన్నారు. సూరత్ - బిలిమొరా సెక్షన్‌లో 50 కి.మీ మేర రైలు కారిడార్ పూర్తయిందని, ఇదే వేగంతో అన్ని సెక్షన్లలో నిర్మాణం చేపడుతున్నామని అన్నారు. ఏప్రిల్ నాటికి బుల్లెట్ ట్రైన్ కోచ్‌లు అందుబాటులోకి వస్తాయన్న ఆయన.. 2029 నాటికి బుల్లెట్ ట్రైన్ థానే వరకు చేరుతుందని చెప్పారు.

"సరకు రవాణాలో అనేక సంస్కరణలు తెచ్చాం. దీంతో రూ.1,078 కోట్ల అదనపు ఆదాయం సమకూరింది. మరోవైపు ఈ ఏడాది రైళ్లలో ఇప్పటికే 800 కోట్ల మంది ప్రయాణాలు చేశారు. 1980 నాటి టికెట్ వ్యవస్థను పూర్తి స్థాయిలో ప్రక్షాళన చేశాం" అని అశ్వినీ వైష్ణవ్ తెలిపారు.

గ్లోబల్ సమిట్ ఏర్పాట్లలో నిర్లక్ష్యం సహించం: సీఎం రేవంత్

మొదటిపేజీ తరువాయి

అతిథులతో అత్యంత మర్యాదగా వ్యవహరించేలా విధుల్లో ఉన్న అధికారులకు శిక్షణ ఇవ్వాలని సీఎం సూచించారు. ప్రతినిధుల కోసం ఫుడ్ కోర్టులు, మెరుగైన ఇంటర్నెట్ నెట్‌వర్క్ సదుపాయం ఏర్పాటు చేయాలని ఆదేశించారు.

విమానాశ్రయంలో దిగినప్పటి నుంచి తిరిగి వెళ్లే వరకు అతిథుల కోసం ప్రత్యేక లైజనింగ్ ఆఫీసర్ వ్యవస్థ ఉండాలన్నారు. సమ్మక్క సారలమ్మ ఆలయంలోని తోరణాల నమూనాలను గ్లోబల్ సమిట్‌లో ఉపయోగించాలని సీఎం రేవంత్‌రెడ్డి సూచించారు. గ్లోబల్ సమిట్‌లో భాగంగా నిర్వహించే ఎయిర్ షోతో పాటు ఇతర కార్యక్రమాలను వీక్షించేందుకు ప్రభుత్వ పాఠశాలలు, సంక్షేమ హాస్టళ్ల విద్యార్థులకు అవకాశం కల్పించాలని తెలిపారు. ప్రతినిధులకు ఆహ్వానాలు పంపే విషయంలో జాగ్రత్తగా వ్యవహరించాలన్న సీఎం.. ముఖ్యమైన వారికి ఆహ్వానాలు పంపే బాధ్యతను డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, శ్రీధర్ బాబుకు అప్పగించాలని అధికారులకు సూచించారు. దేశ, విదేశాల్లో ప్రసిద్ధి చెందిన యూనివర్సిటీలు సమిట్‌లోని ఎడ్యుకేషన్ పెవిలియన్‌లో పాల్గొనేలా చూడాలన్నారు.

ఆదాయం లేకపోవడం మాత్రమే పేదరికం కాదు: నిర్మలా సీతారామన్

మొదటిపేజీ తరువాయి

"డబ్బు లేకపోవడం ఒక్కటే పేదరికం కాదు. ఇల్లు, నీరు వంటి ప్రాథమిక అవసరాలు కూడా అందుబాటులో ఉండాలి. ఒక్క తీవ్రమైన అనారోగ్యం కుటుంబాన్ని కటిక పేదరికంలోకి నెట్టేస్తుంది" అని నిర్మలా సీతారామన్ పేర్కొన్నారు. దశాబ్దకాలంలో భారత్ పేదరికాన్ని అధిగమించిందని గుర్తు చేశారు. మోదీ సర్కారు చేపట్టిన సంక్షేమ కార్యక్రమాలు, చొరవతోనే ఇది సాధ్యమైందన్నారు. 2011-23లో దేశంలో దాదాపు 50 కోట్ల మంది పేదరికాన్ని జయించారంటూ ప్రపంచబ్యాంక్ నివేదిక ఇవ్వడం ఇందుకు నిదర్శనమని పేర్కొన్నారు.

ప్రజల అవసరాలకు అనుగుణంగా ప్రభుత్వం తీసుకొచ్చే పథకాలు.. చివరి వ్యక్తికి చేరే వరకు ప్రధాని మోదీ స్వయంగా పర్యవేక్షిస్తారని నిర్మలా పేర్కొన్నారు. అంత్యోదయ లక్ష్యంతో స్వచ్ఛ భారత్, జల్ జీవన్ మిషన్, ఉజ్వల యోజన, ఆయుష్మాన్ భారత్, ముద్ర రుణాలు వంటి పథకాలు లబ్ధిదారులకు చేరేలా చర్యలు తీసుకున్నట్లు వివరించారు. ఇలానే.. 2047 నాటికి వికసిత్ భారత్ లక్ష్యంగా మోదీ సర్కారు పనిచేస్తుందన్నారు. ఈ సందర్భంగా నాగాలాండ్‌లోని కిఫిరే జిల్లాలో చిరుధాన్యాల ఉత్పత్తులను ఆన్‌లైన్‌లో విక్రయిస్తున్న లఖ్‌పతి దీదీ ఎస్థర్, పశ్చిమ బెంగాల్‌కు చెందిన సుష్మితా ఘరాయ్ ముద్ర రుణంతో తమ కుటుంబ ప్రింటింగ్ వ్యాపారాన్ని తిరిగి నిలబెట్టుకున్న సంఘటనలను ప్రత్యేకంగా ప్రస్తావించారు.

నేపాల్‌కు రూ.15,109 కోట్ల అభివృద్ధి ప్యాకేజీ: మోదీ

మొదటిపేజీ తరువాయి

నేపాల్‌కు ప్రధాని నరేంద్ర మోదీ 24,000 కోట్ల నేపాలీ రూపాయల (భారత కరెన్సీలో రూ.15,109 కోట్లు) అభివృద్ధి ప్యాకేజీని ప్రకటించారు. భారత పర్యటనలో భాగంగా నేపాల్ ప్రధాని బాలేంద్ర షా సోమవారం ప్రధాని మోదీతో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా విస్తృత చర్చలు నిర్వహించారు. ఈ క్రమంలోనే ఇరువురు నేతలు నేపాల్‌లో భారత్ సాయంతో చేపట్టే పలు ప్రాజెక్టులకు వర్చువల్‌గా శంకుస్థాపన చేశారు. అదేవిధంగా ఉత్తర్‌ప్రదేశ్‌లోని అయోధ్య నుంచి నేపాల్‌లోని జనక్‌పుర్ ధామ్ మధ్య రైలును జెండా ఊపి ప్రారంభించారు.

"భారత్, నేపాల్ మధ్య సంబంధం.. బంధుత్వం వంటిది. రెండు దేశాల మధ్య చెక్కుచెదరని విశ్వాసం ఉంది. ఒకరి పురోగతిలో ఒకరం భాగస్వాములం. కష్ట సమయాల్లో అండగా ఉంటాం. ఈ ఏడాది చమురు సరఫరాకు సంబంధించి తీవ్ర సవాళ్లు ఎదురైనప్పటికీ.. నేపాల్‌కు ఇంధనం, ఎరువులు, ఇతర నిత్యావసర వస్తువుల సరఫరా కొనసాగించాం. నేపాల్ పునర్నిర్మాణానికి, దీర్ఘకాలిక అభివృద్ధికి నేడు 24 వేల కోట్ల నేపాలీ రూపాయల అభివృద్ధి ప్యాకేజీని ప్రకటించాం" అని ప్రధాని మోదీ తెలిపారు. ఆగస్టులో నేపాల్‌లో సంభవించిన ఆకస్మిక వరదల (అవజూఝశ్రీ టశ్రీశీశీఎం) వల్ల కలిగిన ప్రాణనష్టంపై భారత్ తరఫున సంతాపం ప్రకటించారు.

"భారత్- నేపాల్ మధ్య సంబంధాలు హిమాలయాలంత దృఢంగా, సముద్రాలంత విశాలంగా ఉన్నాయి. భారత్ మాకు నమ్మకమైన పొరుగు దేశం. కష్టకాలంతోపాటు ప్రకృతి వైపరీత్యాల వంటి విపత్కర పరిస్థితుల్లో ఎల్లప్పుడూ అండగా నిలిచింది. పరస్పర గౌరవం, దృఢమైన విశ్వాసాలనేవి ఇరు దేశాల మధ్య సంబంధాలకు పునాది" అని బాలేంద్ర షా అన్నారు. శతాబ్దాల నాటి నేపాల్-భారత్ సంబంధాలను మరింత బలోపేతం చేయడమే లక్ష్యంగా ప్రధాని మోదీతో చర్చలు జరిపినట్లు చెప్పారు.

సముద్రంలో గల్లంతైన విద్యార్థి మృతి

మొదటిపేజీ తరువాయి

పీఎంపాలెం, సాగర్‌నగర్: రుషికొండ తీరంలో శనివారం గల్లంతైన డిగ్రీ విద్యార్థి సయ్యద్ జాహిద్ రజా (19) మృతదేహం సోమవారం ఉదయం ఒడ్డుకు చేరింది. విశాఖలోని కోటవీధికి చెందిన జాహిద్ రజా బుల్లయ్య కళాశాలలో బీకాం మొదటి ఏడాది చదువుతున్నాడు. శనివారం కళాశాలకు వెళ్తున్నానని ఇంట్లో చెప్పి, తోటి విద్యార్థులతో కలిసి రుషికొండ బీచ్‌కు వచ్చి సముద్ర స్నానానికి దిగి గల్లంతయ్యాడు. ఆరిలోవ సీఐ ఎస్.శ్రీనివాస్, మెరైన్ సీఐ అశోక్‌కుమార్ పర్యవేక్షణలో రెండు రోజులుగా సముద్రంలో గాలింపు చర్యలు చేపట్టగా, సాయిప్రియ రిసార్ట్స్ ఎదురుగా రాళ్ల వద్ద వలలు వేస్తున్న మత్స్యకారులకు నీళ్లలో మృతదేహం కనిపించింది. విగతజీవిగా ఒడ్డుకు చేరిన కుమారుడిని చూసి తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు, బంధువులు గుండెలవిసేలా రోదించడంతో తీరంలో విషాదఛాయలు అలుముకున్నాయి

ఏపీలో మరో భారీ రైల్వే ప్రాజెక్ట్‌కు టెండర్ల ఆహ్వానం

మొదటిపేజీ తరువాయి

విశాఖపట్నం: ఏపీలో మరో భారీ రైల్వే ప్రాజెక్ట్‌కు దక్షిణ కోస్తా రైల్వే టెండర్లు ఆహ్వానించింది. రూ.4,299 కోట్లకు పైగా విలువైన బిక్కవోలు- దువ్వాడ మధ్య 3, 4 లేన్ల నిర్మాణానికి టెండర్లు పిలిచింది. మొత్తం 151 కి.మీ పొడవున రైల్వే ట్రాక్ నిర్మాణానికి ప్రతిపాదనలు తీసుకొచ్చింది. సామర్లకోట మీదుగా దీనిని మ్యాపింగ్ చేశారు. తుని, అనకాపల్లి స్టేషన్లను ఈ ట్రాక్ బైపాస్ చేస్తుంది. అనకాపల్లి జిల్లా కొత్తవలస వద్ద కొత్త బ్రాడ్ గేజ్ లైన్‌కు ఈ ట్రాక్‌ను అనుసంధానం చేస్తారు. నిర్మాణాలను 45 నెలల్లో పూర్తి చేయాలనే లక్ష్యంతో దక్షిణ కోస్తా రైల్వే ముందుకెళ్తోంది. విజయవాడ, విశాఖపట్నం మధ్య ప్రధాన మార్గంలో రద్దీని తగ్గించేందుకు ఇది ఎంతో సహకరిస్తుందని రైల్వేశాఖ వర్గాలు చెబుతున్నాయి. ప్రి బిడ్ కాన్ఫరెన్స్‌ను డిసెంబర్ 23న నిర్వహించాలని రైల్వే అధికారులు నిర్ణయించారు. ప్రస్తుత నిబంధనల ప్రకారం వచ్చే ఏడాది ఫిబ్రవరి 15 వరకు టెండర్లు దాఖలు చేసుకునేందుకు అవకాశం కల్పించారు.

RN NO. TELTEL/2014/61071
జన తెలంగాణ
తెలుగు దిన పత్రిక
మంగళవారం నవంబర్ 24, 2026

దేశంలోనే అతిపెద్ద బహుళ-రంగ ప్రదర్శనగా 'ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్'

రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో నిర్వహించే సమ్మిట్ లలో 80 వేల చదరపు మీటర్ల విస్తీర్ణంలో అతిపెద్ద బహుళ-రంగ ఎక్స్ పో

సమ్మిట్‌లో భాగంగా రక్షా ఎక్స్‌పో, ఇండియా జాయ్, స్టార్టప్ పెవిలియన్, ట్రైబల్ సమ్మిట్, తెలంగాణ పెవిలియన్, ఎడ్యుకేషన్ ఎక్స్‌పో, క్లైమేట్ కాంక్లేవ్

ప్రపంచ స్థాయి విద్యావేత్తలతో ప్రత్యేక చర్చలో పాల్గొననున్న సీఎం

ప్రతినిధుల కోసం పకడ్బందీ ఏర్పాట్లు, ఫేషియల్ రికగ్నిషన్ ద్వారా సునాయాసంగా ప్రవేశం

ప్రపంచం నలుమూలల నుంచి వెయ్యికి పైగా కంపెనీల ప్రతినిధుల రాక కోసం రంగం సిద్ధం

హైదరాబాద్ నవంబర్ 23 జన తెలంగాణ

ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ 2026 కోసం పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని, రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో నిర్వహించే సమ్మిట్ లలో 80 వేల చదరపు మీటర్ల విస్తీర్ణంలో అతిపెద్ద బహుళ-రంగ ఎక్స్ పో గా ఈ సమ్మిట్ ను చేపడుతున్నట్టు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. సమ్మిట్ ఏర్పాట్లపై సోమవారం ఎంసీఆర్ హెచ్ఆర్‌డీలో మంత్రి డి. శ్రీధర్ బాబు, ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు.

డిసెంబర్ 7 నుంచి 9వ తేదీ వరకు భారత్ ఫ్యూచర్ సిటీలోని యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ ప్రాంగణంలో నిర్వహించనున్న సమ్మిట్ ఏర్పాట్ల పురోగతిని అధికారులను అడిగి తెలుసుకున్నారు. సమ్మిట్ వేదిక, వివిధ హాల్స్, అంతర్జాతీయ ప్రతినిధుల ఆహ్వానాలు, కార్యక్రమాల నిర్వహణపై చర్చించారు. సమ్మిట్‌లో భాగంగా రక్షా ఎక్స్‌పో, ఇండియా జాయ్, స్టార్టప్ పెవిలియన్, ఫార్మా అండ్ లైఫ్ సైన్సెస్ ఎక్స్‌పో, వ్యవసాయ అనుబంధ రంగాల ప్రదర్శన, తెలంగాణ పెవిలియన్, ఎడ్యుకేషన్ ఎక్స్‌పో, క్లైమేట్ కాంక్లేవ్‌ల నిర్వహణపై ఈ సందర్భంగా ముఖ్యమంత్రి అధికారులకు పలు సూచనలు చేశారు.

పెట్టుబడులు, పరిశ్రమలు, ఆధునిక సాంకేతికత, ఆవిష్కరణలు, ఉపాధి అవకాశాలకు ప్రాధాన్యమిస్తూ సమ్మిట్ నిర్వహిస్తున్నారు. అన్ని రంగాలనుంచి వెయ్యికి పైగా కంపెనీలు పాల్గొననున్నాయి. సమ్మిట్‌కు పెద్ద ఎత్తున ప్రతినిధులు హాజరయ్యే అవకాశమున్నందున ప్రతినిధులకు ఎక్కడా ఇబ్బంది లేకుండా సునాయాసంగా ప్రవేశం కోసం ఫేషియల్ రికగ్నిషన్ టెక్నాలజీ వాడాలన్నారు. ఆహ్వానాలు పంపే విషయంలో జాగ్రత్తగా వ్యవహరించాలని, ప్రతినిధులతో అత్యంత మర్యాదగా వ్యవహరించేలా విధుల్లో ఉన్న అధికారులకు శిక్షణ ఇవ్వాలన్నారు.

తెలంగాణ చరిత్ర, సంస్కృతి, కాకతీయుల శిల్పకళ, సమ్మక్క సారలమ్మ ఆలయంలో ఉన్న తోరణాల నమూనాలు, సోమశిల ఆలయం, నిర్మల్ పెయింటింగ్స్, రాష్ట్రానికి చెందిన భౌగోళిక గుర్తింపు ఉన్న ఉత్పత్తులు, చేనేత, రాష్ట్ర అభివృద్ధి, గాంధీ సరోవర్ ప్రాజెక్టు తదితర భవిష్యత్ ప్రణాళికలను ప్రతిబింబించేలా ఏర్పాట్లు చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు.

ముఖ్యమైన ప్రతినిధులకు ఆహ్వానాలు పంపే బాధ్యతను డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, శ్రీధర్ బాబులకు అప్పగించాలని ఆదేశించారు. గ్లోబల్ సమ్మిట్‌కు పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ఇతర రాష్ట్రాల ముఖ్యమంత్రులను కూడా సమ్మిట్‌కు ఆహ్వానించాలని సూచించారు.

సమ్మిట్‌కు విస్తృతంగా ఏర్పాట్లు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. 30 ఫుడ్ స్టాల్స్, వివిధ చేనేత వస్త్రాల ప్రదర్శనకు ప్రత్యేక స్టాల్స్ ఏర్పాటు చేయనున్నారు. రక్షా ఎక్స్ పో లో భాగంగా డిసెంబర్ 7 వ తేదీన ఆర్మ్ ఫోర్సెస్ ఫ్లాగ్ డే ను పురస్కరించుకుని ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఎయిర్ షోతో పాటు ఇతర కార్యక్రమాలను వీక్షించేందుకు ప్రభుత్వ పాఠశాలలు, సంక్షేమ హాస్టళ్ల విద్యార్థులకు అవకాశం కల్పించాలని సీఎం సూచించారు.

ట్రైబల్ సమ్మిట్ లో భాగంగా భారతీయ, వివిధ దేశాల్లోని తెగలకు సంబంధించిన బృందాలు సాంస్కృతిక ప్రదర్శనలు చేయనున్నారు.

క్లైమేట్ కాంక్లేవ్ లో భాగంగా సద్గురు జగ్గి వాసుదేవ్, ఐక్యరాజ్య సమితి ప్రతినిధులు, వివిధ ప్రపంచ స్థాయి నిపుణులు ప్రసంగించనున్నారు. స్థానికంగా ఉన్న ఇక్రిశాట్ వంటి సంస్థల నుంచి శాస్త్రవేత్తలు, స్టార్ట్ అప్స్, స్వచ్ఛంద సంస్థలను కూడా భాగస్వాములను చేయనున్నారు. గ్రీన్ ఎకానమీకి సంబంధించిన పెట్టుబడులపై రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించనున్నారు.

ఎడ్యుకేషన్ కాంక్లేవ్ లో భాగంగా యూకే పెవిలియన్, యూరోపియాన్ పెవిలియన్ లతో పాటు ఆక్స్ ఫర్డ్ యూనివర్సిటీ వంటి ప్రతిష్టాత్మక విశ్వవిద్యాలయాల ప్రదర్శనలు ఉండనున్నాయి. అలాగే ఇండియన్ స్కూల్ అఫ్ బిజినెస్, ఐఐటీ హైదరాబాద్, నల్సార్ యూనివర్సిటీ, యూనివర్సిటీ అఫ్ హైదరాబాద్ సహా తెలంగాణలోని ప్రతిష్టాత్మక విద్యా సంస్థల ప్రతినిధులు అంతర్జాతీయ అతిధులతో మాట్లాడుకునే విధంగా స్టాల్స్ ఏర్పాట్లు చేస్తున్నారు.

దీంట్లో భాగంగా సీఎం రేవంత్ రెడ్డి డిసెంబర్ 7న అంతర్జాతీయ విద్యావేత్తలు, నిపుణులతో "ఎఎష్ట్రశీశీశ్రీం శీట ్ష్ట్రవ ఖీబ్‌బతీవ" అనే అంశంపై ప్రత్యేక చర్చలో పాల్గొంటారు. అదే విధంగా డిసెంబర్ 8న "=వటశీతీఎం టశీతీ వసబఝు-ఱశీఱుశ్రీ ఱఅర్ఱ్బ్ఱశీఅం" అనే అంశంపై చర్చలో పాల్గొంటారు.

ఇండియా జాయ్ కాంక్లేవ్ లో భాగంగా దాదాపు 150 యానిమేషన్, విజువల్ ఎఫెక్ట్స్, గేమింగ్, కామిక్స్ రంగాల కంపెనీలు పాల్గొననున్నాయి. ఇందులో అడోబ్, సోనీ, ఉబిసాఫ్ట్ వంటి ప్రముఖ సంస్థలు ప్రదర్శనలు చేయబోతున్నారు.

ఇప్పటికే ప్రపంచం నలుమూలల నుంచి దాదాపు 1,500 మంది కంపెనీల సీఈవోలు, ఎండీలు, పెట్టుబడిదారులు, వివిధ దేశాలకు సంబంధించిన రాయబారులు వచ్చేందుకు సుముఖత వ్యక్తం చేశారు. అదే విధంగా మరో 1,500 మంది పరిశ్రమల వర్గాల నుంచి ప్రతినిధులు రానున్నారు. సాధారణ పౌరులు, ఔత్సాహికులు సైతం గ్లోబల్ సమ్మిట్ కు డిసెంబర్ 10-13 తేదీల్లో వచ్చే విధంగా ఏర్పాట్లు జరుగుతున్నాయి.

ఈ సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, స్పెషల్ చీఫ్ సెక్రటరీలు జయేష్ రంజన్, నవీన్ మిత్తల్, హోమ్ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శిఖా గోయల్, ఫ్యూచర్ సిటీ పోలీస్ కమిషనర్ తరుణ్ జోషి, గ్లోబల్ సమ్మిట్ అధికారుల కమిటీల సభ్యులు, వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు

సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో 'లిసనింగ్ టు చిల్డ్రన్' కార్యక్రమం -- పట్టణ పాలనపై తమ అభిప్రాయాలను పంచుకున్న 4,122 మందికి పైగా చిన్నారులు

సైబరాబాద్, నవంబర్ 23, జన తెలంగాణ

సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జవీజ) ఆధ్వర్యంలో, ఖచీ×జజుఖీ సాంకేతిక సహకారంతో చేపట్టిన ప్రతిష్టాత్మక లిసనింగ్ టు చిల్డ్రన్ -- చైల్డ్ ఫ్రెండ్లీ జవీజ'లి కార్యక్రమంలో భాగంగా, ఆదివారం, నవంబర్ 22, 2026న కార్పొరేషన్ పరిధిలోని అన్ని వార్డుల్లో విస్తృత స్థాయిలో క్షేత్రస్థాయి సంప్రదింపుల కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించింది.

ఈ కార్యక్రమంలో కార్పొరేషన్ పరిధిలోని మొత్తం 3 జోన్లు, 16 సర్కిళ్లు, 76 వార్డుల నుంచి 4,122 మంది చిన్నారుల అభిప్రాయాలు, సూచనలను సేకరించడం జరిగింది.

అన్ని ప్రాంతాల్లోని చిన్నారులకు సమాన అవకాశాలు కల్పించేందుకు, వార్డుల భౌగోళిక విస్తీర్ణాన్ని బట్టి ప్రతి వార్డుకు ఇద్దరు నుంచి ముగ్గురు శిక్షణ పొందిన రిసోర్స్ పర్సన్లను (ఛాం) నియమించారు. ప్రతి వార్డులో కనీసం 50 మంది చిన్నారులతో అభిప్రాయాలను సేకరించడం లక్ష్యంగా నిర్దేశించారు. ఇందులో భాగంగా రిసోర్స్ పర్సన్లు చిన్నారులు సహజంగా కలుసుకునే పార్కులు, ఆటస్థలాలు, పాఠశాలలు, నివాస ప్రాంతాల వీధులు, స్థానిక కమ్యూనిటీ కేంద్రాలను సందర్శించి వారి అభిప్రాయాలను సేకరించారు.

క్షేత్రస్థాయి కార్యక్రమంలోని ముఖ్యాంశాలు:

1. సమగ్ర అంచనా (టూల్--1):

ఖచీ×జజుఖీ బృందం రూపొందించిన ప్రత్యేకమైన 'చైల్డ్ ఫ్రెండ్లీ వార్డ్ చెక్‌లిస్ట్' ద్వారా చిన్నారులతో సంప్రదింపులు నిర్వహించారు. ఇందులో చిన్నారుల నిత్యజీవితం, భద్రత, పర్యావరణం, పట్టణ మౌలిక సదుపాయాలకు సంబంధించిన 12 ప్రధాన అంశాలను చేర్చారు.

2. ద్విభాషా సౌకర్యం:

చిన్నారులు తమ అభిప్రాయాలను స్వేచ్ఛగా, స్పష్టంగా వ్యక్తపరిచేందుకు వారి అభిరుచికి అనుగుణంగా తెలుగు, ఆంగ్ల భాషల్లో ప్రశ్నావళిని అందించి, సమాధానాలను సేకరించారు.

3. ప్రజల భాగస్వామ్యం -- చిన్నారుల ఉత్సాహభరిత పాల్గొనడం:

కార్పొరేషన్ పరిధిలోని మొత్తం 76 వార్డుల చిన్నారులు ఎంతో ఆసక్తితో ఈ కార్యక్రమంలో పాల్గొని, తమ నివాస ప్రాంతాల్లోని సమస్యలు, అవసరాలు, అభివృద్ధికి సంబంధించిన విలువైన అభిప్రాయాలు, సూచనలను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో చిన్నారులు చురుకుగా పాల్గొన్న దృశ్యాలు, ఫోటోలు, వీడియోలను జవీజ అధికారిక సోషల్ మీడియా ఖాతాల ద్వారా కూడా పంచుకున్నారు.

భవిష్యత్ కార్యాచరణ:

మొదటి దశ క్షేత్రస్థాయి సమాచార సేకరణ విజయవంతంగా పూర్తయిన నేపథ్యంలో, తదుపరి దశల్లో భాగంగా ఫేజ్--2, ఫేజ్--3 ప్రశ్నావళి ఆధారిత సంప్రదింపులు, గ్రూప్ డిస్కషన్ కార్యక్రమాల నిర్వహణకు జవీజ అధికారులు, సాంకేతిక బృందాలు త్వరలో ప్రణాళికలు రూపొందించనున్నాయి.

చిన్నారుల నుంచి అందిన సమస్యలు, అభిప్రాయాలు, సూచనలను వివిధ అంశాల వారీగా వర్గీకరించి, సైబరాబాద్ పరిధిలో చేపట్టే పట్టణ ప్రణాళికలు, మౌలిక సదుపాయాల అభివృద్ధి కార్యక్రమాల్లో వాటిని కార్యాచరణ రూపంలో అమలు చేయడానికి చర్యలు తీసుకోనున్నారు.

'టూల్--1' ద్వారా నిర్వహించిన సంప్రదింపుల మొదటి దశ విజయవంతంగా పూర్తయిందని, తదుపరి దశల కార్యక్రమాలను కూడా త్వరలో చేపట్టనున్నట్లు జవీజ అధికారులు తెలిపారు. చిన్నారుల అభిప్రాయాలకు ప్రాధాన్యతనిస్తూ, వారి అవసరాలకు అనుగుణంగా స్పందించే బాలల స్నేహపూర్వక నగరంగా సైబరాబాద్‌ను తీర్చిదిద్దడమే ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యం.

యాంటీమైక్రోబియల్ రెసిస్టెన్స్ (ఖావీ=)పై అవగాహన కల్పించేందుకు 'వన్ హెల్త్' విధానాన్ని అవలంబిస్తున్న జవీజ

సైబరాబాద్ నవంబర్ 23 జన తెలంగాణ

ప్రపంచ యాంటీమైక్రోబియల్ రెసిస్టెన్స్ (ఖావీ=) అవగాహన వారోత్సవం (నవంబర్ 18--24) సందర్భంగా, యాంటీబయాటిక్స్‌ను బాధ్యతాయుతంగా వినియోగించడాన్ని ప్రోత్సహిస్తూ, యాంటీమైక్రోబియల్ రెసిస్టెన్స్ (ఖావీ=)పై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జవీజ) మూడు జోన్ల పరిధిలో అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తోంది.

ఈ కార్యక్రమాల్లో భాగంగా:

- డెయిరీ ఫారాలు: మొత్తం 64 డెయిరీ ఫారాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. పశువులకు పశువైద్యుల సలహా మేరకు మాత్రమే యాంటీబయాటిక్స్ వినియోగించడం, మందులను బాధ్యతాయుతంగా ఉపయోగించడం మరియు పశువుల పరిశుభ్రతను పాటించడం వంటి అంశాలపై అవగాహన కల్పించారు.
- ఆసుపత్రులు: కూకట్‌పల్లి జోన్ పరిధిలోని 48 ఆసుపత్రుల్లో



×జుజ అవగాహన ప్రచార సామగ్రిని ప్రదర్శించారు. యాంటీబయాటిక్స్‌ను సరైన పద్ధతిలో వినియోగించడం, ఇన్ఫెక్షన్ల నివారణ మరియు నియంత్రణ చర్యలపై అవగాహన కల్పించారు.

- పాఠశాలలు: మూడు జోన్ల పరిధిలోని 54 పాఠశాలల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. వైద్యుల సలహా లేకుండా సొంతంగా మందులు వాడటం వల్ల కలిగే ప్రమాదాలు, వైద్యులు సూచించిన చికిత్సను పూర్తిగా పాటించడం మరియు వ్యక్తిగత పరిశుభ్రతను పాటించడం యొక్క ప్రాముఖ్యతను విద్యార్థులకు వివరించారు.

'వన్ హెల్త్' విధానం ద్వారా మానవ ఆరోగ్యం, జంతు ఆరోగ్యం మరియు పర్యావరణ ఆరోగ్య రంగాల మధ్య సమన్వయంతో కూడిన చర్యలు చేపట్టడం ద్వారా యాంటీమైక్రోబియల్ రెసిస్టెన్స్ (ఖావీ=)ను నివారించి, నియంత్రించాల్సిన అవసరాన్ని జవీజ నొక్కిచెబుతోంది.

యాంటీబయాటిక్స్‌ను అనవసరంగా వినియోగించకుండా, అర్హత కలిగిన వైద్య నిపుణుల సూచనల మేరకే మందులు తీసుకోవాలని జవీజ ప్రజలకు విజ్ఞప్తి చేస్తోంది. భవిష్యత్ తరాలకు కూడా యాంటీబయాటిక్స్ సమర్థవంతంగా అందుబాటులో ఉండేలా ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని కోరుతోంది.

బండి....గ్రాండ్ సక్సెస్

3 రోజుల్లోనే మహా పాదయాత్రను సూపర్ హిట్ చేసినవ్

మర్చిపోలేని అనుభూతి కలిగింది

సంతోషంతో బండి సంజయ్ ను ఆలింగనం చేసుకున్న బీజేపీ చీఫ్ నితిన్ నబిన్

కరీంనగర్ నవంబర్ 23 జన తెలంగాణ

కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ ఆధ్వర్యంలో ఈరోజు కరీంనగర్ లో నిర్వహించిన 'మహా పాదయాత్ర' ఊహించని రీతిలో విజయవంతం కావడంతో బీజేపీ జాతీయ అధ్యక్షులు నితిన్ నబిన్ సంతోషం వ్యక్తం చేశారు. మహా పాదయాత్ర అనంతరం కరీంనగర్ ఆర్ అండ్ బి గెస్ట్ హౌజ్ కు వెళ్లి కాసేపు సేద తీరిన నితిన్ నబిన్ సాయంత్రం 4.45 గంటలకు కరీంనగర్ కలెక్టరేట్ హెలిప్యాడ్ వద్దకు వచ్చారు. హైదరాబాద్ మీదుగా ఢిల్లీకి తిరుగు పయనమయ్యారు. హెలికాప్టర్ ఎక్కే



ముందు ఆనందంతో నితిన్ నబిన్ బండి సంజయ్ చేయి పట్టుకుని 'బండి జీ.... 'మహా పాదయాత్ర' గ్రాండ్ సక్సెస్ చేసినవ్. 3 రోజుల ముందే షెడ్యూల్ ఫిక్స్ చేసినప్పటికీ ఇంత పెద్దగా సక్సెస్ చేసినవ్. తక్కువ టైంలోనే చాలా చాలా బాగా ప్లాన్ చేసినవ్. మర్చిపోలేని అనుభూతి కలిగింది. మీ కష్టపడే పనితనం నాకు తెలుసు. కరీంనగర్ రావాలని మొదటి నుండి నా మనసులో ఉండేది. అందుకే వచ్చిన. ప్రజా స్పందన బ్రహ్మాండంగా ఉంది. నేనెక్కడా చూడని విధంగా కరీంనగర్ కార్యకర్తల్లో విపరీతమైన జోష్ కన్పించింది. ఆనందంతో వెళుతున్నా"అని పేర్కొంటూ బండి సంజయ్ ను ఆనందంతో ఆలింగనం చేసుకున్నారు. బీజేపీ సీనియర్ నాయకులు, పార్టీ పరిశీలకులు సైతం 'మహా పాదయాత్ర'కు వచ్చిన కార్యకర్తలు, జనాన్ని చూసి ఆశ్చర్యపోయారు. ఇంత పెద్ద సంఖ్యలో తరలి వస్తారని ఊహించలేదని, దేశవ్యాప్తంగా ఇప్పటి వరకు జరిగిన మహా పాదయాత్రల్లో ఇదే 'టాప్' అని పేర్కొనడం గమనార్హం.

అన్నోజిగూడలో మిరాలం చెరువును కాపాడిన హైడ్రా

ఫిర్యాదు చేసిన వారం రోజుల్లోనే చర్యలు

ప్లాట్ల హద్దులు, ప్రహరీలు తొలగించి హైడ్రా ఫెన్సింగ్

4.12 ఎకరాల చెరువును కాపాడడంతో స్థానికులు హర్షం

హైదరాబాద్, నవంబర్ 23: జన తెలంగాణ

మేడ్చల్ -- మల్కాజిగిరి జిల్లా ఘట్‌కేసర్ మండలం అన్నోజిగూడ గ్రామంలో మిరాలం చెరువును హైడ్రా సోమవారం కాపాడింది. మిరాలం కుంట మొత్తం 4.12 ఎకరాలుండగా.. ఒక పక్క నుంచి ప్లాట్లు వేసుకుంటూ.. ప్రహరీలు నిర్మిస్తూ.... కబ్జాలకు పాల్పడుతున్నారు. ఈ కబ్జాలను ఆపేందుకు అక్కడ ఎంత ప్రయత్నం చేసినా.. సంబంధిత శాఖలకు ఫిర్యాదు చేసినా ఆక్రమణలు ఆగలేదని స్థానికులు వాపోయారు. హైడ్రా ప్రజావాణిలో ఫిర్యాదు చేసిన వారం రోజులలో క్షేత్రస్థాయిలో పరిశీలించడం.. వెనువెంటనే 4.12 ఎకరాల చెరువును కాపాడడం జరిగిందని అక్కడి స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. గతంలో మున్సిపల్ పాలకులుగా ఉండి కాపాడేందుకు చర్యలు తీసుకున్నా ఫలితం లేకపోయిందని.. హైడ్రాకు ఫిర్యాదు చేయగానే ఫలితం లభించిందని పేర్కొన్నారు. చెరువుల పరిరక్షణలో హైడ్రా పనితనాన్ని చూసే తాము ఫిర్యాదు చేశామని.. మా నమ్మకం వృథా కాలేదని హర్షం వ్యక్తం చేశారు. ఇదిలా ఉంటే.. చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలో వరుసగా ప్లాట్లు వేశారు. మరి కొంత చెరువులోపలకి జరిగి ప్రహరీలు నిర్మించారు. చెరువు భూమి కూడా తమదే అని లే ఔట్ వేయడానికి కబ్జాదారులు ప్రయత్నించారు. ఇలాంటి తరుణంలో క్షేత్రస్థాయిలో పరిశీలించిన హైడ్రా అధికారులు.. సర్వే ఆఫ్ ఇండియా, శాటిలైట్ చిత్రాలతో పాటు.. గ్రామ రికార్డుల ప్రకారం చెరువు పరిరక్షణకు చర్యలు తీసుకుంది. సోమవారం ఈ మేరకు చెరువు చుట్టూ ఫెన్సింగ్ వేసింది. 4.12 ఎకరాల చెరువును భద్రంగా నీటి వనరుగా కాపాడింది.

కబ్జాలో పార్కులు.. ప్రజావసరాల స్థలాలు

హైడ్రా ప్రజావాణికి 51 ఫిర్యాదులు

హైదరాబాద్, నవంబర్ 23: జన తెలంగాణ



ఇప్పటికే కాంక్రీట్ జంగిల్‌గా మారుతున్న నగరంలో పార్కులు, ప్రజావసరాలకు ఉద్దేశించిన ఖాళీ స్థలాలను కబ్జాదారులు మాయం చేస్తున్నారని హైడ్రా ప్రజావాణిలో పలువురు ఫిర్యాదు చేశారు. ప్రాణవాయువును అందించే పార్కులను కబ్జా చేసి నగర ప్రజలు ఊపిరితీసుకోడానికి వీలు లేకుండా చేస్తున్నారని వాపోయారు. పాఠశాలలు, కమ్యూనిటీహాళ్లు ఇలా ప్రజావసరాలకు ఉద్దేశించిన స్థలాలు కూడా కబ్జాకు గురౌతున్నాయని.. వాటిని మున్సిపల్ కార్పొరేషన్లకు గిఫ్ట్ డీడ్ రాసినా ప్రయోజనం లేకపోతోందని వాపోయారు. పార్కులుగా అభివృద్ధి చేయడానికి నిధులు కరువైనా.. చుట్టూ ప్రహరీలు నిర్మించి పార్కు స్థలంగా పేర్కొంటూ బోర్డులు ఏర్పాటు చేస్తే ప్రజలే వాటిని కాపాడుకుని మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు పాటుపడతారని ఫిర్యాదులలో పేర్కొన్నారు. లే ఔట్ వేసినప్పుడు పార్కులకోసం, ప్రజావసరాలకోసం కేటాయించిన స్థలాలుగా స్పష్టంగా పేర్కొని బోర్డులు పెట్టి.. హద్దులు నిర్ణయించకపోవడంతో ఈ ఆక్రమణలు జరుగుతున్నాయని పలువురు వాపోయారు. పార్కులు, ప్రజావసరాలకు ఉద్దేశించిన స్థలాలు, చెరువులు, నాలాలు కాపాడాలని కోరుతూ సోమవారం హైడ్రా ప్రజావాణికి మొత్తం 51 ఫిర్యాదులందాయి. వాటిని హైడ్రా అడిషనల్ కమిషనర్ శ్రీ డి. ఆనంద్‌కుమార్ పరిశీలించి పరిష్కార బాధ్యతలను సంబంధిత అధికారులకు అప్పగించారు.

ఫిర్యాదులు ఇలా..

రంగారెడ్డి జిల్లా, ఉప్పల్‌మండలం కొత్తపేటలోని మారుతీనగర్‌లో 600ల వరకూ ఇళ్లుండగా.. 667 గజాలను ప్రజావసరాలకు కేటాయించారు. ఆ భూమి ఆక్రమణకు గురౌతోంది. ఇందులో ఓ గదిని నిర్మించడానికి ఆక్రమణదారులు పలుమార్లు ప్రయత్నించగా.. మారుతీనగర్ డెవలప్‌మెంట్ సొసైటీ ప్రతినిధులుగా అడ్డుకున్నాం. ఇలా ప్రతి సారీ జరుగుతోంది. ఈ భూమిని హైడ్రా కాపాడాలని.. హైడ్రా ప్రజావాణిలో అక్కడి నివాసితులు విజ్ఞప్తి చేశారు. ప్రజావసరాలకు ఉద్దేశించిన స్థలంగా పేర్కొంటూ బోర్డులు ఏర్పాటు చేయాలని కోరారు.

లి సంగారెడ్డి జిల్లా, జిన్నారం మండలం, ఐడీఏ బొల్లారం, పరిధిలోని కొమిటి కుంట చెరువులో కొంతమంది మట్టిపోసి ఆక్రమణలకు పాల్పడుతున్నారని స్థానికులు ఫిర్యాదు చేశారు. చెరువు పక్కనే ఉన్న 50 అడుగుల రహదారిని ఆనుకుని ఆక్రమణలకు పాల్పడుతున్నారని.. దీంతో 50 అడుగుల రహదారి 30 అడుగులకు పరిమితమైందని వాపోయారు. దీంతో ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తుతున్నాయని.. వెంటనే చెరువుతో పాటు.. రహదారి ఆక్రమణలు తొలగించాలని హైడ్రా ప్రజావాణిలో కోరారు. చెరువు ఎఫ్‌టీఎల్ హద్దుల ప్రకారం కంచె ఏర్పాటు చేసి, భవిష్యత్తులో ఆక్రమణలు జరగకుండా చూడాలని కోరారు.

లి మియాపూర్ ప్రశాంత్‌నగర్ కాలనీలో ప్రజావసరాలకు ఉద్దేశించిన ఖాళీ స్థలాలు, పార్కులను హైడ్రా కాపాడింది. అయితే మరో ఖాళీ స్థలంలో ఒక నిర్మాణం మాత్రం ఇంకా అలాగే ఉంది. దీనిని కొందరు మాజీ సంక్షేమ సంఘం ప్రతినిధులు కార్యాలయంగా ఉపయోగించుకుంటున్నారు. ఖాళీ స్థలాన్ని తమ ఆధీనంలోకి తీసుకునే ప్రయత్నం చేస్తున్నారని ఫిర్యాదు చేశారు. ఆ స్థలాన్ని పూర్తిగా కంచెతో రక్షించి, అనధికార నిర్మాణాన్ని తొలగించాలని ప్రశాంత్‌నగర్ రెగ్యులరైజేషన్ కో ఆర్డినేషన్ కమిటీ హైడ్రా ప్రజావాణిలో విజ్ఞప్తి చేసింది. తుర్కయంజాల్ మున్సిపాలిటీ పరిధిలోని సర్వే నంబర్ 338లో రోడ్లు, పార్కు స్థలాలను ఆక్రమిస్తూ ప్రహరీ గోడలు నిర్మిస్తున్నారని అక్క్షిఫిర్యాదు చేశారు. గతంలో మున్సిపల్ అధికారులు పరిశీలించి గోడలను తొలగించినా, మళ్లీ అదే ప్రాంతంలో నిర్మాణాలు చేపడుతున్నారని తెలిపారు. ప్రజల రాకపోకలకు ఇబ్బందులు కలగకుండా రోడ్లు, పార్కు స్థలాలను సర్వే చేసి ఆక్రమణలు తొలగించాలని కోరారు. రాజేంద్రనగర్ మండలం మైలార్‌దేవ్‌పల్లి గ్రామంలోని శాస్త్రిపురం హౌసింగ్ కాలనీలో సుమారు 6,500 చదరపు గజాల ఆట స్థలాన్ని హైడ్రా కాపాడింది. మళ్లీ ఆక్రమణకు గురయ్యే ప్రమాదం ఉందని స్థానికులు ఫిర్యాదు చేశారు. ఈ స్థలాన్ని కాపాడాలని హైకోర్టు ఆదేశాలు ఉన్నప్పటికీ, కొందరు జేసీబీతో చదును చేయడంతో పాటు బోర్‌వెల్ తవ్వేందుకు ప్రయత్నిస్తున్నారని తెలిపారు. వెంటనే స్థలాన్ని పరిశీలించి ఆట స్థలాన్ని ఆక్రమణల నుంచి కాపాడాలని కోరారు. శేరిలింగంపల్లి మండలం, హఫీజ్‌పేటలోని కొత్తకుంట చెరువును ఆక్రమించి భారీ వ్యాపార సముదాయాలు నిర్మిస్తున్నారని.. సర్వే 99ని చూపించి చెరువుఉన్న సర్వే నంబరు 100లో ఆక్రమణలకు పాల్పడుతున్నారని స్థానికులు ఫిర్యాదు చేశారు. కార్ల గ్యారేజీ నడుపుతూ పరిసరాలను పాడు చేస్తున్నారని వెంటనే హైడ్రా అధికారులు స్పందించి చెరువును కాపాడాలని కోరారు.

రాహుల్ గాంధీ పప్పు కాదు నిప్పు

ఎంపీ మల్లు రవి

హైదరాబాదు నవంబర్ 23 జన తెలంగాణ

నితిన్ నబీన్ వ్యాఖ్యలపై మల్లు రవి ఆగ్రహం రాహుల్ గాంధీ పప్పు కాదు నిప్పు అని పేర్కొన్నారు మా హయాంలో జరిగిన ూ×= పారదర్శకంగా జరిగిందిబీజేపీ నేతలు ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నారుబీజేపీకి వ్యతిరేకంగా ఉన్నవాళ్ల ఓట్లను తొలగిస్తున్నారు అని ధ్వజమెత్తారురాహుల్ పార్లమెంట్లో అడిగే ప్రశ్నలకు నితిన్, సంజయ్ సమాధానం చెప్పడం లేదుదేశ స్వాతంత్ర్యం కోసం కాంగ్రెస్ పోరాడిందిదేశ స్వాతంత్ర్య పోరాటంలో, దేశ నిర్మాణంలో కాంగ్రెస్ నేతల త్యాగాలు ఉన్నాయనీ గుర్తు చేశారుస్వాతంత్ర్య ఉద్యమంలో బీజేపీ ఎక్కడుంది?బీజేపీ నేతలకు చరిత్ర తెలియదు కాని రాహుల్ ప్రధాని కావాలని ప్రజలు కోరుకుంటున్నారురాహుల్ గాంధీకి మద్దతు పెరగడంతో బీజేపీ భయపడుతోంది అని రేవంత్ చెప్పింది ఎప్పుడూ తప్పు కాలేదుకోటి ఓట్లు, 90 సీట్లు తెచ్చుకుంటాం అని అన్నారు

RN NO. TELTEL/2014/61071
జన తెలంగాణ
తెలుగు దిన పత్రిక

కరీంనగర్ గడ్డపై "జై శ్రీరాం" గర్జన

'సర్' కు మద్దతుగా అక్షరాల లక్ష మందికిపైగా తరలి వచ్చిన జనం

కరీంనగర్ లో ఇప్పటి వరకు నిర్వహించిన పాదయాత్రల్లో ఇదే టాప్

మహా పాదయాత్ర దారి పొడవునా ఎటు చూసినా ప్రభం'జనమే'

జై శ్రీరాం, జై మోదీ నినాదాలతో దద్దరిల్లిన కరినగరం

పాదయాత్రలో నితిన్ నబిన్ పై ఆద్యంతం పూల వర్షం కురిపించిన కార్యకర్తలు

డప్పు చప్పుళ్లు, ఆట పాటలతో

కార్యకర్తల జోష్...ప్రజా స్పందనను చూసి నితిన్ నబిన్ ఖుషీ

మహా పాదయాత్రకు తరలివచ్చిన కార్యకర్తలు, ప్రజలందరికీ బండి సంజయ్ ధన్యవాదాలు

కరీంనగర్ నవంబర్ 23 జన తెలంగాణ

భారతీయ జనతా పార్టీ తెలంగాణ శాఖ నాయకత్వంలో కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ఆధ్వర్యంలో కరీంనగర్ లో నిర్వహించిన "మహా పాదయాత్ర" గ్రాండ్ సక్సెస్ అయ్యింది. మహా పాదయాత్ర షెడ్యూల్ 3 రోజుల ముందే ఫిక్స్ అయినప్పటికీ, తక్కువ టైంలో ఊహించని విధంగా జనం, కార్యకర్తలు తరలి రావడంతో బీజేపీ శ్రేణులు, పోలీస్, రాజకీయ వర్గాలు ఆశ్చర్యపోతున్నాయి. కరీంనగర్ గాంధీ చౌక్ నుండి వైశ్యా భవన్, రాజీవ్ చౌక్, టవర్ సర్కిల్, శాస్త్రీరోడ్ మీదుగా కమాన్ సెంటర్ దాకా జనం తండోపతండాలుగా తరలి వచ్చారు. ఇసుకేస్తే రాలనంతగా ఆ ప్రాంతమంతా జన సంద్రమైంది. జన ప్రభంజాన్ని చూసిన నితిన్ నిబిన్ వారితో కలిసి అడుగులో అడుగు వేస్తూ 1 గంట 45 నిమిషాల్లో దాదాపు 2 కి.మీల మేరకు మహా పాదయాత్ర చేశారు. కమాన్ చౌరస్తా వద్ద జాతీయ జెండాను ఎగరేసి మహా పాదయాత్ర గ్రాండ్ సక్సెస్ అయ్యిందంటూ ముగించారు.

దేశవ్యాప్తంగా 'సర్' కు మద్దతుగా 40 ప్రాంతాల్లో 'మహా



పాదయాత్ర'లు నిర్వహించాలని బీజేపీ జాతీయ నాయకత్వం నిర్ణయించిన సంగతి తెలిసిందే. అందులో భాగంగా హైదరాబాద్ సహా 13 చోట్ల మహా పాదయాత్రలు నిర్వహించింది. అయితే ఇప్పటి వరకు జరిగిన అన్ని మహా పాదయాత్రల్లోకెల్ల కరీంనగర్ లో నిర్వహించిన మహా పాదయాత్ర టాప్ లో నిలిచిందని బీజేపీ నాయకులు, పరిశీలకులు చెబుతున్నారు. మహా పాదయాత్రలో ప్రజా స్పందన, కార్యకర్తల జోష్ ను చూసిన నితిన్ నబిన్ సైతం ఆనందం వ్యక్తం చేస్తూ కేంద్ర మంత్రి బండి సంజయ్ ను ఆలింగనం చేసుకోవడం గమనార్హం.

ఇగ కరీంనగర్ గడ్డ కాషాయ అడ్డా అని కాషాయ సైన్యం మరోసారి నిరూపించింది. మహా పాదయాత్రకు స్వచ్ఛందంగా తండోపతండాలుగా కాషాయ సైనికులు తరలి వచ్చి జై శ్రీరాం... జై శ్రీరాం అంటూ గర్జించారు. జై మోదీ, జైజై నితిన్, జైజై బండి సంజయ్, జైజై రామచంద్రరావు అంటూ



నినాదాలతో హోరెత్తించారు. సాధారణ ప్రజలు సైతం సర్ కు మద్దతుగా తరలిరావడం విశేషం. ఇసుకేస్తే రాలనంతగా మహా పాదయాత్రకు తరలివచ్చిన జనం, కాషాయ కార్యకర్తలతో కరీంనగర్ జన సంద్రమైంది. కరీంనగర్ చరిత్రలో ఎన్నోసార్లు రాజకీయ పార్టీలు పాదయాత్ర చేసిన సందర్భాలున్నాయి. కానీ బండి సంజయ్ చేపట్టిన 'మహా పాదయాత్ర' హైలైట్ గా నిలిచింది. రికార్డ్ స్రుష్టించింది.

గాంధీ చౌక్ నుండి టవర్ సర్కిల్ వరకు జన సందోహం బారులు తీరడం కన్పించింది. వేలాది మంది ప్రజలు, కార్యకర్తలు నితిన్ నబిన్ వెంట నడుస్తూ జోష్ నింపారు. ఇక నితిన్ నబిన్ పాదయాత్ర చేస్తున్నంత సేపు కార్యకర్తలు, బీజేపీ అభిమానులు ఆయనపై పూల వర్షం కురిపించారు. ఇండ్లు, భవనాల, వ్యాపార సముదాయాలపైకి ఎక్కి నితిన్ నబిన్ పాదయాత్రను జనం వీక్షించడం గమనార్హం.

డప్పు చప్పుల్లు, అట పాటలతోనూ యువత మహా పాదయాత్రలో సర్ కు మద్దతుగా నినాదాలు చేశారు. జాతీయ జెండా చేత పట్టి కొందరు, కాషాయ జెండాలు పట్టుకుని మరి కొందరు జై మోదీ, జై సర్, జైజై సంజయ్ అంటూ నినాదాలు చేస్తూ ముందుకు సాగారు. మహా పాదయాత్రలో పాల్గొన్న మహిళల్లోనే పెద్ద ఎత్తున జోష్ కన్పించింది. పాదయాత్ర ఆద్యంతం డ్యాన్సులు వేస్తూ వడివడిగా అడుగులు వేస్తూ నితిన్ నబిన్ తో కలిసి పాదయాత్ర చేయడం కన్పించింది.

రైలు కార్యకలాపాల నిర్వహణలో భద్రతపై సమీక్ష

హైదరాబాదు నవంబర్ 23 జన తెలంగాణ

రైలు కార్యకలాపాల నిర్వహణలో భద్రతపై సమీక్ష నిర్వహించిన దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ శ్రీ సంజయ్ కుమార్ శ్రీవాస్తవ

దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ శ్రీ సంజయ్ కుమార్ శ్రీవాస్తవ గారు, వివిధ శాఖల ప్రధాన అధిపతులతో కలిసి, ఈరోజు అనగా 23 నవంబర్, 2026న సికింద్రాబాద్‌లోని రైల్ నిలయంలో జోన్ వ్యాప్తంగా రైలు కార్యకలాపాల భద్రతపై ఒక సవివరమైన సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో దక్షిణ మధ్య రైల్వే అదనపు జనరల్ మేనేజర్ రాజేష్ పి ఖాడేతో పాటు వివిధ శాఖల ప్రధాన అధిపతులు పాల్గొన్నారు. సికింద్రాబాద్ , హైదరాబాద్ మరియు నాందేడ్ మూడు డివిజన్ల డివిజనల్ రైల్వే మేనేజర్లు (డిఆర్ఎంలు) కూడా వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పాల్గొన్నారు.

ఈ సమావేశంలో దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్ కుమార్ శ్రీవాస్తవ గారు, ఆకతాయిలు సిగ్నల్ కేబుల్‌ను కత్తిరించిన ఘటనపై అధికారులు వేగంగా స్పందించిన తీరును అభినందించారు. భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ఉండేందుకు, జోన్ వ్యాప్తంగా రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ అప్రమత్తంగా ఉండాలని, నిఘాను పెంచాలని ఆయన సూచించారు. అదేవిధంగా, పశువులు రైళ్ల కిందపడిపోయే ప్రమాదాలను నివారించడానికి (క్యాటిల్ రన్ ఓవర్) గుర్తించిన ప్రమాదకర ప్రాంతాల్లో డివిజన్ల ద్వారా చేపట్టిన ముందస్తు నివారణ చర్యలను జనరల్ మేనేజర్ సమీక్షించారు. ఈ ప్రమాదాల వల్ల కలిగే ముప్పులపై గ్రామీణ ప్రజలకు అవగాహన కల్పించాలని, పశువుల రక్షణతో పాటు రైళ్ల సజావు రాకపోకలకు ఎలాంటి ఆటంకాలు కలగకుండా ఉండేందుకు మరింత అప్రమత్తంగా వ్యవహరించేలా గ్రామస్తులను చైతన్యపరచాలని సూపర్‌వైజర్లకు సూచించారు.

అంతేకాకుండా, జనరల్ మేనేజర్ సికింద్రాబాద్, హైదరాబాద్ మరియు నాందేడ్ డివిజన్లలో నిర్మిస్తున్న రోడ్ అండర్ బ్రిడ్జిలు (ఆర్యుబి ల) మరియు రోడ్ ఓవర్ బ్రిడ్జిల (ఆర్.ఓ.బి ల) పురోగతిపై సమగ్ర సమీక్ష నిర్వహించారు. పనులు సకాలంలో పూర్తయ్యేలా చూడటానికి,వాటిని వేగవంతం చేయాలని మరియు పురోగతిని నిశితంగా పర్యవేక్షించాలని ఆయన సంబంధిత అధికారులను ఆదేశించారు

సోమవారం ప్రజావాణి కార్యక్రమంలో ప్రజలతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్న జవీజ కమిషనర్ -- మొత్తం 53 ఫిర్యాదులు స్వీకరణ

సైబరాబాద్, నవంబర్ 23, జన తెలంగాణ

సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జవీజ) ప్రధాన కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జవీజ కమిషనర్ ప్రజలతో నేరుగా మాట్లాడి, వారి సమస్యలు మరియు ఫిర్యాదులను స్వయంగా విని, సంబంధిత శాఖల అధిపతులతో ఆయా సమస్యలపై సమీక్షించారు.



ఈ కార్యక్రమంలో మొత్తం 53 ఫిర్యాదులు అందాయి. శాఖల వారీగా ఫిర్యాదుల వివరాలు క్రింది విధంగా ఉన్నాయి.

- టౌన్ ప్లానింగ్: 34
- ఇంజినీరింగ్: 11
- భూసేకరణ (ల్యాండ్ అక్విజిషన్ & రిహాబిలిటేషన్): 2
- పారిశుద్ధ్య విభాగం: 2
- ఎలక్ట్రికల్ విభాగం: 1
- ఫైనాన్స్ & అకౌంట్స్ (ఫీ&ఆ): 1
- చెరువుల విభాగం: 1
- రెవెన్యూ (ఆస్తి పన్ను): 1

మొత్తం: 53 ఫిర్యాదులు

ప్రతి ఫిర్యాదుకు ప్రత్యేక గుర్తింపు సంఖ్య (ఖఅఅనబవ ×ణ) కేటాయించడం జరుగుతోంది. దీని ద్వారా పౌరులు తమ ఫిర్యాదుల పరిష్కార స్థితి మరియు పురోగతిని సంబంధిత గ్రీవెన్స్ ట్రాకింగ్ లింక్ ద్వారా తెలుసుకునే అవకాశం కల్పించారు.

ఈ సందర్భంగా కమిషనర్ సంబంధిత శాఖల అధిపతులు ప్రతి ఫిర్యాదుపై తక్షణమే అవసరమైన చర్యలు తీసుకుని, నిర్ణీత గడువులోగా సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు. ఫిర్యాదుల పురోగతిని నిరంతరం పర్యవేక్షిస్తూ, ప్రజల సమస్యలకు సకాలంలో పరిష్కారం చూపాలని అధికారులకు సూచించారు.

ప్రజావాణి ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ ద్వారా పారదర్శకమైన, జవాబుదారీతనంతో కూడిన మరియు ప్రజా కేంద్రిత పాలనను అందించేందుకు జవీజ కట్టుబడి ఉందని తెలియజేస్తోంది.

ప్రజా సమస్యల పరిష్కారానికి అత్యంత ప్రాధాన్యత:

రాష్ట్ర ప్లానింగ్ బోర్డ్ వైస్ చైర్మన్, సీఎం ప్రజావాణి ఇంచార్జ్ గద్వాల్ విజయలక్ష్మి

హైదరాబాదు నవంబర్ 23 జన తెలంగాణ

ప్రజల ఆశలు, నమ్మకాలకు అనుగుణంగా అందించే ఫిర్యాదులపై అధికారులు సత్వర చర్యలు చేపట్టాలి.

పెండింగ్ అర్జీలపై నిర్దిష్ట గడువులోగా చర్యలు తీసుకుని యాక్షన్ టేకెన్ రిపోర్టులు అందించాలి.

ప్రజావాణిలో టోకెన్ విధానం అమలు చేయాలి

ప్రజావాణి నిర్వహణపై జిల్లా కలెక్టర్ కు అభినందనలు.

ప్రజల సమస్యల పరిష్కారానికి అత్యంత ప్రాధాన్యతనిస్తూ, ప్రజావాణికి వచ్చే ప్రతి ఫిర్యాదుపై అధికారులు బాధ్యతాయుతంగా స్పందించి, సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్లానింగ్ బోర్డ్ వైస్ చైర్మన్, సీఎం ప్రజావాణి ఇంచార్జ్ గద్వాల్ విజయలక్ష్మి అధికారులకు సూచించారు.

సోమవారం హైదరాబాద్ జిల్లా కలెక్టరేట్ ప్రజావాణికి జిల్లా కలెక్టర్ డాక్టర్ ప్రియాంక అలా తో కలిసి ప్రజలతో నేరుగా మాట్లాడి వారి యొక్క వినతులను స్వీకరించారు.

ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ప్రజావాణికి వచ్చే ప్రజలు తమ సమస్యలు పరిష్కారమవుతాయనే ఆశతో, నమ్మకంతో వస్తారని, ఆ నమ్మకాన్ని నిలబెట్టే బాధ్యత అధికారులపై ఉందని పేర్కొన్నారు.

కేవలం అర్జీలను స్వీకరించి, ఆన్‌లైన్‌లో నమోదు చేసి సంబంధిత శాఖలకు పంపించడంతో బాధ్యత ముగిసినట్లు భావించరాదని, ప్రతి ఫిర్యాదుపై నిరంతరం పర్యవేక్షణ చేపట్టి, పరిష్కారం దిశగా చొరవ చూపాలని స్పష్టం చేశారు. ముఖ్యంగా ముఖ్యమంత్రి ప్రజావాణి ద్వారా అందిన ఫిర్యాదులపై సంబంధిత శాఖలు తప్పనిసరిగా చర్యలు తీసుకోవాలని, యాక్షన్ టేకెన్ రిపోర్టులు (ూూ=) తెప్పించుకుని వాటి పురోగతిని సమీక్షించాలని సూచించారు.

పెండింగ్ అర్జీల పరిష్కారానికి సమస్య తీవ్రత, ప్రాధాన్యత ఆధారంగా గడువులు నిర్ణయించుకోవాలని, తక్షణమే పరిష్కరించగలిగే సమస్యలను వెంటనే పరిష్కరించాలని, ఇతర



సమస్యలను వంటి నిర్దిష్ట కాలపరిమితిలో పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అనవసర జాప్యాన్ని ఎంతమాత్రం ఉపేక్షించరాదని ఆమె పేర్కొన్నారు. ముఖ్యంగా గృహ నిర్మాణం, విద్యుత్, గృహజ్యోతి, 2ఎష్ట్రఎ ఇండ్లు, వివిధ రకాల పింఛన్లు తదితర విభాగాల్లో పెండెన్సీపై ప్రత్యేక దృష్టి సారించి, వాటిని తగ్గించేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆమె సూచించారు.

అర్జీదారుల పట్ల అధికారులు సున్నితత్వం, సహనం, మానవీయ దృక్పథంతో వ్యవహరించాలని అన్నారు. సమస్యను చెప్పుకునేందుకు వచ్చే ప్రతి ఒక్కరికీ తగిన సమయం కేటాయించి, వారి వినతులను శ్రద్ధగా వినాలని సూచించారు. సంబంధిత అధికారులతో సమన్వయం చేసుకుని, తక్షణమే పరిష్కరించగలిగే సమస్యల విషయంలో అక్కడికక్కడే చర్యలు తీసుకునేలా చూడాలన్నారు.

ప్రజావాణికి పెద్ద సంఖ్యలో అర్జీదారులు వస్తున్న నేపథ్యంలో హైదరాబాద్ జిల్లా కలెక్టరేట్‌లో టోకెన్ విధానాన్ని ప్రవేశపెట్టి, క్రమబద్ధంగా అర్జీల స్వీకరణ చేపట్టాలని అన్నారు. ప్రజలందరికీ తమ సమస్యలు చెప్పుకునే అవకాశం కల్పించేలా తగిన ఏర్పాట్లు చేయాలన్నారు. రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి వచ్చే ప్రజల సౌకర్యార్థం ప్రజాభవన్‌లో ప్రతి మంగళవారం, శుక్రవారం నిర్వహించే ముఖ్యమంత్రి ప్రజావాణిని వినియోగించుకోవాలని అర్జీదారులకు విజ్ఞప్తి చేశారు.

ప్రజాభవన్‌లో ఉదయం 9 గంటల నుంచి టోకెన్లు జారీ చేస్తారని, రోజుకు 500 మంది వరకు అర్జీదారుల వినతులను స్వీకరించేలా విస్తృత ఏర్పాట్లు ఉన్నాయని తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు అన్ని శాఖలకు చెందిన నోడల్ అధికారులు అందుబాటులో ఉండి ప్రజల సమస్యలను వింటారని, ప్రతి ఒక్కరికీ తమ సమస్యను వివరించేందుకు అవకాశం కల్పిస్తారని పేర్కొన్నారు.

జిల్లా కలెక్టరేట్‌లో ప్రజావాణి నిర్వహణ, ప్రజలకు కల్పించిన సౌకర్యాలను జిల్లా కలెక్టర్ డాక్టర్ ప్రియాంక అలాను అభినందిస్తూ ప్రశంసించారు.

అనంతరం జిల్లా కలెక్టర్ డాక్టర్ ప్రియాంక అలా ప్రజావాణి నిర్వహణను మరింత మెరుగుపరిచేందుకు చేసిన సూచనలను అమలు చేస్తానని అన్నారు.

ఈ రోజు ప్రజావాణిలో మొత్తం 333 అర్జీలు స్వీకరించగా, వాటిలో గృహ నిర్మాణం/2బీహెచ్‌కేకు సంబంధించి 282, ఇతర శాఖలకు సంబంధించి 26, రెవెన్యూ శాఖకు సంబంధించి 25 అర్జీలు అందాయని తెలిపారు.

అర్కాసుల పరిష్కారానికి సత్వరమే పరిశీలన చేసి పరిష్కరించాలని జిల్లా అధికారులను కలెక్టర్ ఈ సందర్భంగా ఆదేశించారు.

ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) జితేందర్ రెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారి డాక్టర్ నారాయణ, ప్రాజెక్ట్ డైరెక్టర్ (హౌసింగ్) అశోక్ చక్రవర్తి, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ వెంకటరామిరెడ్డి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు, చీఫ్ ప్లానింగ్ ఆఫీసర్ డాక్టర్ సురేందర్, జిల్లా బీసీ సంక్షేమ అధికారి అశన్న, ఎస్సీ సంక్షేమ అధికారి ప్రవీణ్, ఎస్టీ సంక్షేమ అధికారి సదానందం, మైనారిటీ సంక్షేమ అధికారి ఇలియాస్, మహిళా శిశు సంక్షేమ, దివ్యాంగులు, వయోవృద్ధులు, ట్రాన్స్‌జెండర్ల సంక్షేమ అధికారి రాజేందర్, జిల్లా విద్యాశాఖ అధికారి యాదయ్య, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ శ్రీనివాస్, జిల్లా పౌరసరఫరాల అధికారి శ్రీనివాస్, కలెక్టరేట్ సెక్షన్ సూపరింటెండెంట్లు, తదితరులు పాల్గొన్నారు.

ఇన్ముులనర్వ లేఅవుట్ ఈ-వేలం ద్వారా రూ.6.67 కోట్ల ఆదాయం -- విశేష స్పందన



హైదరాబాద్ నవంబర్ 23 జన తెలంగాణ

హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ (నవీణూా) ఆధ్వర్యంలో నవంబర్ 23, 2026న ఇన్ముులనర్వ లేఅవుట్‌లోని 45 నివాస ప్లాట్లకు నిర్వహించిన ఈ-వేలానికి కొనుగోలుదారులు, పెట్టుబడిదారుల నుంచి విశేష స్పందన లభించింది.

ఈ వేలంలో మొత్తం 45 ప్లాట్లు విజయవంతంగా వేలం వేయబడగా, సుమారు రూ.6.67 కోట్ల ఆదాయం సమకూరింది. చదరపు గజానికి గరిష్ఠంగా రూ.19,000 ధర పలకగా, చదరపు గజానికి సగటు వెయిటెడ్ ధర రూ.16,345గా నమోదైంది.

ఇన్ముులనర్వ లేఅవుట్‌కు పెరుగుతున్న డిమాండ్‌తో పాటు పెట్టుబడులకు ఉన్న అవకాశాలను ఈ వేలం ఫలితాలు స్పష్టం చేస్తున్నాయి.

టూరిజం కార్పొరేషన్‌లో కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ పనిచేస్తున్న ఉద్యోగులను క్రమబద్ధీకరించాలి



23 ఏళ్లుగా చాలీచాలని వేతనాలతో పనిచేస్తున్న కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ సిబ్బంది ఆవేదన.. ప్రభుత్వానికి ఏఐటీయూసీ వినతి

హైదరాబాద్ నవంబర్ 2 3 జన తెలంగాణ

: తెలంగాణ పర్యాటక అభివృద్ధి సంస్థలో రెండు దశాబ్దాలకు పైగా కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ పద్ధతిలో పనిచేస్తున్న ఉద్యోగులను తక్షణమే క్రమబద్ధీకరించాలని ఏఐటీయూసీ అనుబంధ తెలంగాణ పర్యాటక అభివృద్ధి సంస్థ కాంట్రాక్టు అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల సంఘం ప్రభుత్వాన్ని కోరింది. రెగ్యులర్ ఉద్యోగులతో సమానంగా విధులు నిర్వహిస్తున్నప్పటికీ చాలీచాలని వేతకాలతో కాలం వెళ్లదీస్తున్నామని ఆవేదన వ్యక్తం చేసింది. ఈ మేరకు పర్యాటక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వాణీప్రసాద్ గారిని సంఘం నాయకులు కలిసి వినతిపత్రం సమర్పించారు!

కార్పొరేషన్‌లో పనిచేస్తున్న కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులకు కూడా రెగ్యులర్ ఉద్యోగుల మాదిరిగా పదవీ విరమణ వయోపరిమితిని 61 ఏళ్లకు పెంచాలని విజ్ఞప్తి చేశారు. టూరిజం ప్లాజా ఉద్యోగులు, ఏజెన్సీ సిబ్బంది, రోజువారీ వేతన ప్రాతిపదికన పనిచేసే ఉద్యోగులకు వేతనాలు పెంచాలని కోరారు. గతంలో ఉద్యోగులకు కల్పించిన బస్సు పాస్ సౌకర్యాన్ని, తెలంగాణ ఇంక్రిమెంట్లను తిరిగి పునరుద్ధరించాలని డిమాండ్ చేశారూ

ఉద్యోగుల విషయంలో సంఘం గౌరవ అధ్యక్షుడు చాడ వెంకటరెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సబ్బు రాజమౌళి. తెలంగాణ ప్రజానాట్యమండలి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పల్లె నరసింహ మరియు ఉడత రమేష్ పి శ్రీనివాస్ రెడ్డి, సిహెచ్ రాజయ్య,తదితరులు వినతిపత్రం అందజేసిన వారిలో ఉన్నారు.

RNI NO. TELTEL/2014/61071
జన తెలంగాణ
తెలుగు దిన పత్రిక
మంగళవారం నవంబర్ 24, 2026

జనజీవన స్రవంతిలోకి వచ్చిన మావోయిస్టులకు ప్రభుత్వం భరోసా, పునరావాసం...

214 మందికి రూ.5.59 కోట్ల ఆర్థిక సాయం పంపిణీ

824 మంది లొంగుబాటు.. ఇప్పటివరకు రూ.17.68 కోట్ల రివార్డులు, పునరావాస సాయం

చత్తీస్‌గఢ్‌కు చెందిన 754 మంది.. తెలంగాణకు చెందినవారు 59 మంది

ఆరోగ్య కార్డులు, ఇళ్లు, ఉపాధి శిక్షణతో అండగా ప్రభుత్వం

మిగిలిన ముగ్గురు మావోయిస్టులూ లొంగిపోవాలి: డీజీపీ సీవీ ఆనంద్

హైదరాబాద్, నవంబరు 23: జన తెలంగాణ

జనజీవన స్రవంతిలో కలిసిన మావోయిస్టులకు పునరావాసం కల్పించడంలో తెలంగాణ ప్రభుత్వం ప్రత్యేక చొరవ చూపుతోంది. లొంగిపోయిన వారికి ఆర్థిక సాయం, ఆరోగ్య భద్రత, నివాస వసతి, ఉపాధి అవకాశాలు కల్పిస్తూ సాధారణ జీవితం గడిపేందుకు అండగా నిలుస్తుందన్నారు డిజిపి సివి ఆనంద్. డిజిపి కార్యాలయంలో సోమవారం లొంగిపోయిన మావోయిస్టులకు పునరావాసం, తాత్కాలిక ఆర్థిక సహాయానికి సంబంధించిన కార్యక్రమాన్ని ఆయన నిర్వహించారు. ఇందులో భాగంగా 214 మందికి రూ.5 కోట్ల 59 లక్షల 50 వేల నగదు రివార్డులు, పునరావాస ఆర్థిక సాయాన్ని డిజిపి చేతుల మీదుగా పంపిణీ చేశారు.

మీడియా సమావేశంలో డిజిపి మాట్లాడుతూ .....కేంద్ర ప్రభుత్వం నిర్దేశించిన మార్చి 31 లక్ష్యానికి అనుగుణంగా ఆపరేషన్ కగార్ నేపథ్యంలో వివిధ రాష్ట్రాల్లో భద్రతా బలగాలు చేపట్టిన చర్యలతో పెద్ద సంఖ్యలో మావోయిస్టులు లొంగిపోయారు. జార్ఖండ్, ఒడిశా, మహారాష్ట్ర, తెలంగాణ, ఛత్తీస్‌గఢ్ తదితర రాష్ట్రాల్లో ఈ పరిణామం చోటుచేసుకుంది. తెలంగాణలో ఇప్పటివరకు మొత్తం 824 మంది మావోయిస్టులు లొంగిపోయారు. వీరిలో తెలంగాణకు చెందినవారు 59 మంది, ఛత్తీస్‌గఢ్‌కు చెందినవారు 754 మంది, ఆంధ్రప్రదేశ్‌కు చెందినవారు తొమ్మిది మంది, మహారాష్ట్ర, ఒడిశా రాష్ట్రాలకు చెందినవారు ఒక్కొక్కరు ఉన్నట్లుగా వివరించారు.

ఇప్పటివరకు రూ.17.68 కోట్ల పంపిణీ

లొంగిపోయిన మావోయిస్టులకు తక్షణ అవసరాల నిమిత్తం ఒక్కొక్కరికి రూ.25 వేల చొప్పున తాత్కాలిక ఆర్థిక సాయం అందించామని డిజిపి తెలిపారు. వారి ప్రభుత్వ రివార్డులకు అనుగుణంగా మిగిలిన ఆర్థిక సాయాన్ని దశలవారీగా అందిస్తున్నామన్నారు. ఇప్పటివరకు 755 మందికి రూ.22,31,85,000 నగదు రివార్డులు మంజూరు చేయగా, వివిధ దశల్లో అందించిన సాయంతో కలిపి ఇప్పటివరకు



జనజీవన స్రవంతిలోకి వచ్చిన మావోయిస్టులకు మొత్తం రూ.17 కోట్ల 68 లక్షల 35 వేల నగదు పంపిణీ చేసినట్లు వివరించారు.

ఆధార్ కార్డులు లేకపోవడంతో పలువురికి బ్యాంకు ఖాతాలు తెరవడం ఇబ్బందిగా మారిందని, ఈ సమస్యను పరిష్కరించేందుకు తెలంగాణ ఎస్ఐబీ అధికారులు ఛత్తీస్‌గఢ్ పోలీసులతో సమన్వయం చేసుకుని బ్యాంకు ఖాతాల ఏర్పాటుకు కృషి చేశారని తెలిపారు.

ఆరోగ్య భద్రత.. నివాస వసతి

లొంగిపోయిన వారికి ఆరోగ్య భద్రత కల్పించేందుకు 59 ఆరోగ్య రక్షణ కార్డులు అందించామని డిజిపి పేర్కొన్నారు. ఉచిత వైద్య చికిత్స అందించడంతోపాటు నిమ్స్, వారి వారి ప్రాంతాల్లో ఉన్న ఆసుపత్రుల్లో అవసరమైన వైద్య సదుపాయాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. నివాస వసతి కింద తెలంగాణకు చెందిన పది మందికి ఇళ్లు మంజూరు పూర్తికాగా, మరో 49 మందికి ఇళ్లు కల్పించనున్నట్లు చెప్పారు. కొంతమంది లొంగిపోయిన మావోయిస్టులు మారుమూల ప్రాంతాల్లో ఉండటం వల్ల పునరావాస సాయం అందించడంలో జాప్యం జరిగిందన్నారు. ఎస్ఐబీ అధికారులు నేరుగా వారి వద్దకు వెళ్లి వివరాలు సేకరిస్తున్నారని తెలిపారు. గత ఆగస్టులో వరంగల్ పర్యటన సందర్భంగా కూడా లొంగిపోయిన మావోయిస్టు కేడర్‌తో మాట్లాడి వారి అవసరాలు, ఆశయాలు తెలుసుకున్నానని వెల్లడించారు.

ఉపాధి అవకాశాలకు ప్రాధాన్యం

అడవుల్లో జీవించిన వారికి సాధారణ జనజీవనంపై అవగాహన కల్పించడంతోపాటు వారి అభిరుచులకు అనుగుణంగా ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని డిజిపి చెప్పారు. కార్పెంటర్, ప్లంబర్, ఎలక్ట్రీషియన్ వంటి వృత్తుల్లో నైపుణ్య శిక్షణ అందిస్తామని తెలిపారు. భవిష్యత్తులో ఆటోలు, ట్రాక్టర్లు నడిపేందుకు డ్రైవింగ్ శిక్షణ కూడా కల్పిస్తామన్నారు. జిల్లాల ఎస్పీలు, పోలీసు కమిషనర్లు వ్యక్తిగతంగా లొంగిపోయిన వారితో సంప్రదింపులు జరుపుతూ, వారు తిరిగి తప్పుడు మార్గంలో వెళ్లకుండా ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారని వివరించారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో రాజ్యాంగం కల్పించిన హక్కులు, పరిమితులకు లోబడి రాజకీయ, ప్రజా కార్యకలాపాల్లో పాల్గొనవచ్చని స్పష్టం చేశారు. అయితే మావోయిస్టు సిద్ధాంతాల ప్రచారాన్ని ప్రభుత్వం సహించబోదని తెలిపారు.

భారీగా ఆయుధాలు, మందుగుండు సామగ్రి స్వాధీనం

మావోయిస్టుల నుంచి పెద్ద సంఖ్యలో ఆయుధాలు, పేలుడు పదార్థాలను స్వాధీనం చేసుకున్నట్లు డిజిపి వెల్లడించారు. 2026 నాటికి తెలంగాణ –ఛత్తీస్గడ్ సరిహద్దులోని కర్రగుట్ట ప్రాంతంలో మొత్తం తొమ్మిది ఆయుధాల డంపులు గుర్తించగా, వాటిలో 252 తుపాకులు, 359 బీజీఎల్ సెల్స్, నాలుగు ఎల్ఎంజీలు, 48 ఏకే–47 తుపాకులు లభించాయని తెలిపారు. కర్రెగుట్ట ప్రాంతంలో భారీగా పేలుడు పదార్థాలు, ల్యాండ్‌మైన్‌లు ఉన్నాయని, సీఆర్‌పీఎఫ్, ఛత్తీస్‌గఢ్ డీఆర్‌జీ బలగాల సమన్వయంతో ల్యాండ్‌మైన్‌లను జాగ్రత్తగా వెలికితీసి నిర్వీర్యం చేసే చర్యలు కొనసాగుతున్నాయన్నారు. భద్రతా కారణాల దృష్ట్యా ప్రస్తుతం పర్యాటకులకు ఆ ప్రాంతంలో అనుమతి ఇవ్వడం లేదని, ల్యాండ్‌మైన్‌ల తొలగింపు పూర్తయిన తర్వాతే దీనిపై నిర్ణయం తీసుకుంటామని స్పష్టం చేశారు.

మిగిలిన ముగ్గురూ లొంగిపోవాలి

ఇంకా ముగ్గురు మావోయిస్టు కీలక నేతలు లొంగిపోవాల్సి ఉందని డిజిపి తెలిపారు. కేంద్ర కమిటీ సభ్యుడు ముప్పాళ్ల లక్ష్మణరావు అలియాస్ గణపతితోపాటు మరో ఇద్దరు లొంగిపోయి సాధారణ జీవితం గడపాలని కోరారు.

లొంగిపోయిన వారు తిరిగి మావోయిస్టు కార్యకలాపాల వైపు వెళ్లకుండా నిరంతర నిఘా, సంప్రదింపులు, పర్యవేక్షణ కొనసాగిస్తామన్నారు. గతంలో ఈ ప్రాంతాల్లో ప్రాంతాల్లో పాఠశాలలు, ఆసుపత్రుల గురించి కూడా తెలియని పరిస్థితులు ఉండేవని, ఇప్పుడు అభివృద్ధి కార్యక్రమాల ద్వారా ఆ ప్రాంతాల్లో మార్పు వస్తోందని పేర్కొన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పది రాష్ట్రాల్లో ప్రత్యేక అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నాయని వివరించారు. గ్రేహౌండ్స్‌లోని సిబ్బందిని అవసరాలకు అనుగుణంగా పునర్వ్యవస్థీకరించి, కొంతమందిని టీ–మార్స్, పార్కింగ్, ట్రాఫిక్ నిర్వహణ వంటి విభాగాలకు కేటాయించిన విషయాన్ని డిజిపి గుర్తుచేశారు. తెలంగాణ ప్రభుత్వం, ముఖ్యమంత్రి అందిస్తున్న ఆర్థిక సాయం, పునరావాస సదుపాయాలను సద్వినియోగం చేసుకుని లొంగిపోయిన వారంతా చట్టబద్ధమైన జీవితం గడపాలని డిజిపి ఆకాంక్షించారు. జనజీవన స్రవంతిలో కలిసిన వారికి గౌరవప్రదమైన జీవితం కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు.

పార్టీ బలోపేతమే లక్ష్యంగా నేతలంతా సమిష్టిగా పనిచేయాలి

ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

పార్టీ కోసం కష్టపడే నాయకులు, కార్యకర్తలకు తగిన గుర్తింపు ఉంటుంది: జూపల్లి

హైదరాబాద్ నవంబర్ 23 జన తెలంగాణ

కాంగ్రెస్ పార్టీ బలోపేతమే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలందరూ సమన్వయంతో, సమిష్టిగా పనిచేయాలని ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులకు ఇంచార్జ్ మంత్రి జూపల్లి కృష్ణారావు పిలుపునిచ్చారు. పార్టీ బలోపేతం, ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లడంతో పాటు, పార్టీ శ్రేణుల మధ్య ఐక్యత, పరస్పర సహకారం పెంపొందించుకోవాలని సూచించారు.

బేగంపేటలోని టూరిజం ప్లాజాలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులతో మంత్రి జూపల్లి కృష్ణారావు సమావేశమయ్యారు. నియోజకవర్గాల వారీగా నాయకులతో సమావేశమై పార్టీ సంస్థాగత బలోపేతం, ప్రజల్లో పార్టీ పట్ల విశ్వాసాన్ని మరింత పెంపొందించడం, నాయకులు–కార్యకర్తల సమన్వయం వంటి అంశాలపై చర్చించి దిశానిర్దేశం చేశారు.



నామినేటెడ్ పదవుల భర్తీ విషయంలోనూ నాయకులందరూ సమన్వయంతో వ్యవహరించాలని మంత్రి సూచించారు. పదవులు ఆశిస్తున్న నాయకుల పేర్లతో జాబితాను నేతలందరూ ఏకాభిప్రాయంతో సిద్ధం చేయాలని స్పష్టం చేశారు. పార్టీ కోసం పనిచేసిన నాయకులకు అవకాశాలు కల్పించే విషయంలో సమిష్టి నిర్ణయంతో ముందుకు సాగాలని పేర్కొన్నారు.

ప్రజలతో మమేకమై పార్టీ లక్ష్యాల సాధనకు కృషి చేయాలి

పార్టీ నాయకులందరూ ఐక్యతతో ముందుకు సాగుతూ ప్రజల సమస్యలను తెలుసుకోవాలని, ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించాలని మంత్రి సూచించారు. పార్టీ, ప్రభుత్వం మధ్య సమన్వయంతో ప్రజలకు మరింత చేరువ కావాలని, క్షేత్రస్థాయిలో పార్టీని బలోపేతం చేసేందుకు ప్రతి నాయకుడు తన వంతు బాధ్యతను నిర్వర్తించాలని అన్నారు.

వ్యక్తిగత అంశాలకు ప్రాధాన్యం ఇవ్వకుండా పార్టీ ప్రయోజనాలు, ప్రజా సంక్షేమం, పార్టీ లక్ష్యాల సాధనకు పెద్దపీట వేయాలని, నాయకులందరూ పరస్పర సహకారంతో ముందుకు సాగాలని పేర్కొన్నారు.

పార్టీ కోసం పనిచేసే వారి సేవలకు గుర్తింపు

పార్టీ కోసం నిబద్ధతతో పనిచేస్తూ, ప్రజల్లో పార్టీని బలోపేతం చేసేందుకు కృషి చేసే నాయకులు, కార్యకర్తల సేవలను పార్టీ అధిష్ఠానం గుర్తిస్తుందని మంత్రి అన్నారు. ఓర్పు, సహనం, అంకితభావంతో పార్టీ కోసం పనిచేసే వారికి తగిన సమయంలో అవకాశాలు, గుర్తింపు లభిస్తాయని పేర్కొన్నారు. నాయకులు, కార్యకర్తలు నిరంతరం ప్రజల్లో ఉంటూ పార్టీ పటిష్టతకు కృషి చేయాలని సూచించారు.

ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు వెడ్మ బొజ్జు, నరేష్ జాదవ్, ఆత్రం సుగుణ, దండే విఠల్, నారాయణరావు పాటిల్, విఠల్ రెడ్డి, సోయం బాపురావు, ఆత్రం సక్కు, విశ్వప్రసాద్, శ్రీహరి రావు, శ్యామ్ నాయక్, కంది శ్రీనివాస్ రెడ్డి, ఆడే గజేందర్, తదితరులు పాల్గొన్నారు.

25.11.2026న హుడా హైట్స్‌లో ప్రీమియం ప్లాట్ల ఈ-వేలానికి విస్తృత ప్రచారం కల్పించవలసిందిగా విజ్ఞప్తి

హుడా హైట్స్ -- పెట్టుబడిదారులు, డెవలపర్లు మరియు పారిశ్రామికవేత్తలకు ఆశాజనక గమ్యస్థానం

హైదరాబాద్ నవంబర్ 23 జన తెలంగాణ

హైదరాబాద్ జిల్లా, శేక్‌పేట మండలం, హకీంపేట గ్రామ పరిధిలోని సర్వే నం. 102/1, టి.ఎస్. నం. 5 & 14, బ్లాక్ జీ, వార్డు నం. 12లో (ఎమ్మెల్యే కాలనీ , బంజారా హిల్స్ సమీపంలో) ఉన్న హుడా హైట్స్‌లో ప్రీమియం ప్లాట్లకు 25 నవంబర్ 2026న నిర్వహించనున్న ఈ–వేలం పెట్టుబడిదారులు, రియల్ ఎస్టేట్ డెవలపర్లు, పారిశ్రామికవేత్తలు మరియు వ్యాపార సంస్థలకు అత్యంత ప్రాధాన్యత కలిగిన, వ్యూహాత్మకంగా అనుకూలమైన ప్రాంతంలో విలువైన స్థిరాస్తులను సొంతం చేసుకునేందుకు చక్కటి అవకాశాన్ని కల్పిస్తోంది.

హుడా హైట్స్ భవిష్యత్తులో అపారమైన అభివృద్ధి అవకాశాలు కలిగిన ఆకర్షణీయమైన గమ్యస్థానంగా అభివృద్ధి చెందుతోంది. ఈ ప్రాంతానికి ఉన్న ప్రముఖ స్థానం, వాణిజ్యపరమైన అవకాశాలు మరియు భవిష్యత్తులో భూముల విలువ పెరిగే అవకాశాలు దీర్ఘకాలిక పెట్టుబడులు పెట్టాలనుకునే వ్యక్తులు, సంస్థలకు ఈ ప్లాట్లను ఆకర్షణీయమైన పెట్టుబడి అవకాశంగా నిలుపుతున్నాయి.

పారదర్శకమైన ఈ–వేలం ప్రక్రియ ద్వారా ప్లాట్లను అందుబాటులోకి తీసుకురావడం వల్ల ఆసక్తి కలిగిన బిడ్డర్లు ఈ వేలంలో పాల్గొని, పెట్టుబడులు, అభివృద్ధి కార్యక్రమాలు మరియు వ్యాపార కార్యకలాపాల కోసం విలువైన భూములను సొంతం చేసుకునే అవకాశం కలుగుతుంది. ఈ వేలానికి రియల్ ఎస్టేట్ పెట్టుబడిదారులు, బిల్డర్లు, డెవలపర్లు, వ్యాపార సంస్థలు మరియు పారిశ్రామికవేత్తల నుంచి విశేష స్పందన లభిస్తుందని ఆశిస్తున్నారు.

ఈ ఈ–వేలం ప్రాధాన్యతను, హుడా హైట్స్‌లో ఉన్న గణనీయమైన పెట్టుబడి అవకాశాలను దృష్టిలో ఉంచుకుని, భావి పెట్టుబడిదారులు, డెవలపర్లు మరియు సాధారణ ప్రజలకు గరిష్ఠ స్థాయిలో అవగాహన కల్పించేలా ఈ సమాచారాన్ని ప్రముఖంగా ప్రచురించి, అన్ని ప్రముఖ దినపత్రికలు మరియు మీడియా సంస్థలు విస్తృత ప్రచారం కల్పించవలసిందిగా కోరడమైనది.

ఈ సమాచారాన్ని విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లడం ద్వారా వేలంలో అధిక సంఖ్యలో బిడ్డర్లు పాల్గొనేందుకు, వారి మధ్య ఆరోగ్యకరమైన పోటీ నెలకొనేందుకు మరియు ఈ విలువైన పెట్టుబడి అవకాశాన్ని ఆసక్తి కలిగిన అన్ని వర్గాలకు చేరవేసేందుకు దోహదపడుతుంది.

భావి పెట్టుబడిదారులు, డెవలపర్లు మరియు పారిశ్రామికవేత్తలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని, 25.11.2026న నిర్వహించనున్న ఈ–వేలంలో పాల్గొనవలసిందిగా ప్రోత్సహించడమైనది.

ప్లాట్ల వివరాలు, అర్హతలు, నిబంధనలు మరియు షరతులు, ఈ–వేలంలో పాల్గొనే విధానం తదితర పూర్తి వివరాల కోసం ఆసక్తి కలిగిన వారు అధికారిక వేలం నోటిఫికేషన్‌ను పరిశీలించవచ్చు.

10 లక్షల టన్నుల బొగ్గు రవాణా మైలురాయి దాటిన నైనీ బొగ్గు గని

అభినందనలు తెలిపిన యాజమాన్యం

హైదరాబాద్ నవంబర్ 23, జన తెలంగాణ

ఒడిశా రాష్ట్రంలో సింగరేణి ప్రారంభించిన నైనీ బొగ్గు గని ఆదివారం నాటికి తొలిసారిగా 10 లక్షల టన్నుల బొగ్గు రవాణా మైలురాయిని దాటింది. రాష్ట్ర ప్రభుత్వం మరీ ముఖ్యంగా రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి ఇంధన శాఖ మంత్రి భట్టి విక్రమార్క ప్రత్యేక చొరవతో, కృషితో ఈ గనికి అన్ని అనుమతులు లభించి బొగ్గు ఉత్పత్తి ప్రారంభించడం జరిగింది. ఈ ఏడాది ఏప్రిల్ నెల నుంచి ఈ గని నుంచి బొగ్గు రవాణా ప్రారంభమైంది. కాగా రాష్ట్ర ఇంధన అవసరాలకు యాదాద్రి థర్మల్ విద్యుత్ కేంద్రానికి నైనీ బొగ్గును రైలు మార్గం ద్వారా రవాణా జరుపుతున్నారు, అలాగే ఇతర రాష్ట్రాలకు కూడా నైనీ బొగ్గుని సరఫరా చేయటం జరుగుతుంది.

గనిలో బొగ్గు ఉత్పత్తి ప్రారంభమైన తరువాత తొలిసారిగా 10 లక్షల టన్నుల మైలురాయిని దాటిన నైనీ బొగ్గు గని అధికారులు, ఉద్యోగులు, సిబ్బందికి సింగరేణి యాజమాన్యం తన అభినందనలు తెలిపింది. ఇదే విధంగా ఇకపై కూడా అనేక మైలురాళ్లు దాటాలని, జాతి సేవకు అంకితమై పని చేయాలని సంస్థ ఛైర్మన్ మరియు ఎండీ డాక్టర్ బుద్ధప్రకాష్ జ్యోతి తన శుభాకాంక్షల సందేశంలో పేర్కొన్నారు.

వచ్చే ఆర్థిక సంవత్సరం నుంచి ఈ గనిలో ఏడాదికి 60 లక్షల టన్నుల బొగ్గును (6 మిలియన్ టన్నులు) ఉత్పత్తి చేయబోతున్నారు. ఈ నేపథ్యంలో తెలంగాణ రాష్ట్రానికి సరఫరా చేయగా మిగిలిన బొగ్గును స్థానిక పరిశ్రమలతో పాటు ఎన్టీపీసీ(చ్యూజ) కి చెందిన స్థానిక థర్మల్ విద్యుత్ కేంద్రాలకు సరఫరా చేయడానికి సింగరేణి ముందుకు వచ్చింది. నైనీ గనిలో లభించే గ్రేడ్–11 (+–11) బొగ్గుకు మంచి డిమాండ్ ఉంది, నైనీ గని నుండి సమీపంలోని రైల్వే సైడింగ్ వరకు ప్రస్తుతం రోడ్డు మార్గం ద్వారా బొగ్గు రవాణా చేస్తున్నారు. త్వరలోనే ఇక్కడ ఇతర బొగ్గు ఉత్పత్తి కంపెనీల వారితో కలిసి ఉమ్మడి భాగస్వామ్యంతో ఒక రైల్వే కారిడార్ నిర్మాణానికి కూడా ప్రయత్నాలు సాగుతున్నాయి. మొత్తం మీద నైనీ బొగ్గు గనికి ఉజ్వలమైన భవిష్యత్తు ఉంటుందని భావిస్తున్నారు.

తెలంగాణ కోసం త్యాగం చేసిన వాళ్లం,తెలంగాణ ఇచ్చిన వాళ్లం,తెలంగాణ నీటి హక్కుల విషయంలో ఎలాంటి రాజీ పడే ప్రసక్తే లేదు

గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయంలోనే రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్,పల్నాడు డ్రింకింగ్ వాటర్ ప్రాజెక్టులకు ఏపీ టెండర్లు పిలిచింది

గత ప్రభుత్వం తెలంగాణకు చేసిన అన్యాయాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టంగా రాష్ట్ర ప్రజలకు తెలియజేశారు

బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్,అమిత్ షా,జేపీ నడ్డా, తెలంగాణకు ఏం ఒరుగపెట్టారని,ఏం మోహం పెట్టుకోని వస్తున్నారు

కేంద్రంలో ఉన్న బీజేపీ తెలంగాణకు ఏం చేసిందో కిషన్ రెడ్డి, బండి సంజయ్ ప్రజలకు చెప్పాలి

వచ్చే ఎన్నికల్లో రాష్ట్రంలో వంద సీట్లకు పైగా గెలుస్తాం..

బీఎం సందీప్ మార్గదర్శకత్వంలో రాష్ట్రంలో మళ్ళీ అధికారంలోకి రాబోతున్నాము

రాహుల్ గాంధీని ప్రధాని చేయడమే మా లక్ష్యం

పార్టీ కోసం కష్టపడ్డ ప్రతి కార్యకర్తకు గుర్తింపు లభిస్తుంది

-మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి



హైదరాబాద్ నవంబర్ 23 జన తెలంగాణ

వచ్చే ఎన్నికల్లో మళ్ళీ అధికారంలోకి రావడం ఖాయం

వచ్చే ఎన్నికల్లో 90 సీట్లతో అధికారంలోకి రావడం ఖాయమని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి అన్నారు. సోమవారం గాంధీ భవన్ లో రాష్ట్ర వ్యవహారాల ఇంచార్జీ బీఎం సందీప్ తో ముఖాముఖీ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ.. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీపై ఎటువంటి వ్యతిరేకతలేదు. వచ్చే ఎన్నికల్లో 90 సీట్లలో గెలుస్తామని ధీమా వ్యక్తం చేశారు. తన స్టాటజీ ప్రకారం వేళ్తే ఖచ్చితంగా వందకు పైగా సీట్లలో గెలుస్తామన్నారు. ఇంచార్జ్ సందీప్ మార్గదర్శకత్వంలో మళ్ళీ అధికారంలోకి రాబోతున్నామని తెలిపారు. కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తుందని రాహుల్ గాంధీ ప్రధాని కావడమే తమ లక్ష్యమన్నారు. ప్రస్తుతం గ్రాడ్యుయేట్ ఎన్నికలు గెలిపించుకోవడమే తమ ముందున్న తక్షణ కర్తవ్యమని పేర్కొన్నారు.

బీఎం సందీప్ నిబద్ధత కలిగిన నాయకుడు

రాష్ట్ర కాంగ్రెస్ నూతన ఇన్‌ఛార్జ్ బీఎం సందీప్‌ను కలవడం చాలా సంతోషంగా ఉంది. ఆయన నిబద్ధత కలిగిన, సౌమ్యుడు స్వభావం కలిగిన మంచి కాంగ్రెస్ నాయకుడు. సందీప్ మార్గదర్శకత్వంలో కాంగ్రెస్ పార్టీ ఇంకా ఉధృతంగా రాష్ట్రంలో ప్రజా సంక్షేమం కోసం పనిచేస్తుంది.

కష్టపడ్డ ప్రతి కార్యకర్తకు గుర్తింపు..

గాంధీభవన్ లో రాష్ట్ర వ్యవహారాల ఇంచార్జ్ సందీప్ తో ముఖాముఖి సమావేశంలో ఎమ్మెల్సీ ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలు, రాష్ట్రంలో పార్టీ బలోపేతానికి తీసుకోవాల్సిన చర్యలు, ప్రస్తుత రాజకీయ పరిస్థితులపై సలహాలు, సూచనలు అందించామని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడానికి కృషి చేసిన ప్రతి కార్యకర్తకు గుర్తింపు లభించేలా నామినేటేడ్ పదవులు వారికి కేటాయించాలని ఇంచార్జీతో చర్చించామని తెలిపారు.

కష్టపడ్డ ప్రతి కార్యకర్తకు గుర్తించి పదవులు ఇస్తుందని పేర్కొన్నారు. అందుకు తానే నిదర్శనమని తెలియజేశారు. గత 40 సంవత్సరాలుగా పార్టీ కోసం పనిచేస్తున్న సీనియర్ నాయకుడిగా, కాంగ్రెస్ పార్టీలో పనిచేస్తున్నాను. పార్టీ ఇచ్చిన గుర్తింపుతోనే ఐదుసార్లు ఎమ్మెల్యేగా, రెండుసార్లు మంత్రిగా, ఒకసారి ఎంపీగా పనిచేసే అవకాశం కాంగ్రెస్ పార్టీ కల్పించిందని పేర్కొన్నారు.

ఏం ఒరుగపెట్టారని తెలంగాణకు వస్తున్నారు.

కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం తెలంగాణకు ఏం ఒరుగపెట్టిందని బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్, అమిత్ షా, జేపీ నడ్డా ఏం ముఖం పెట్టుకోని వస్తున్నారని విమర్శించారు. తెలంగాణకు ఏం చేసిందో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, బండి సంజయ్ లు తెలంగాణ ప్రజలకు చెప్పాలన్నారు. 2016లో రీజినల్ రింగ్ రోడ్డు ప్రకటిస్తే గత బీఆర్ఎస్ ప్రభుత్వం భూ సేకరణ చేయకుండ నిర్లక్ష్యం చేసిందని, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే నేను మంత్రిగా 96 శాతం భూసేకరణ పూర్తి చేస్తే ఇప్పటివరకు క్యాబినేట్ లో పెట్టకుండా టెండర్లు పిలిచి వాయిదాలపైన వాయిదాలు వేస్తున్నారు. హైదరాబాద్–విజయవాడ– మచిలీపట్నం గ్రీన్ ఫీల్డ్ హైవేల క్యాబినేట్ అనుమతులు రాకపోవడంపై తెలంగాణ కేంద్ర మంత్రులు సమాధానం చెప్పాలన్నారు.

తెలంగాణ హక్కుల విషయంలో రాజీపడే ప్రసక్తే లేదు..

తెలంగాణ ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ నీళ్లు, నిధులు, నియామకాలు, ఆత్మగౌరవం కోసం పోరాడి సాధించుకున్న తెలంగాణను కాపాడుకోవడం మనందరి బాధ్యతని తెలిపారు. తెలంగాణ నీటి హక్కుల విషయంలో ఎలాంటి రాజీ ఉండదని, మనకు రావాల్సిన నీటి వాటాను వదులుకునే ప్రసక్తే లేదని పేర్కొన్నారు. ఈ విషయంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఈ అంశంపై ప్రత్యేకంగా దృష్టి సారించారని తెలిపారు. రాష్ట్రం అంతా తిరిగి అబద్దాలు ప్రచారం చేస్తున్న కేటీఆర్.. 10 ఏండ్లు అధికారంలో ఉండి తెలంగాణకు నీటి మళ్లింపు విషయంలో అన్యాయం జరుగుతుంటే బీఆర్ఎస్ అనుకూల పత్రికలు, టీవీ చానెళ్లు ఎందుకు ప్రచురించలేదు. 2022లోనే రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్‌తో పాటు, పల్నాడు డ్రింకింగ్ వాటర్ ప్రాజెక్టులకు టెండర్లు పిలిచారని, తెలంగాణకు అన్యాయం జరుగుతున్న అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం నిమ్మకునిరేత్తినట్లు వ్యవహరించిన తీరును కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బట్టబయలు చేశారని తెలిపారు. తెలంగాణకు అన్యాయం జరిగే నీటి ప్రాజెక్టులను ప్రజా ప్రభుత్వం వ్యతిరేకిస్తుందని ఈ ప్రాజెక్టులను నిలిపి వేసే దిశగా చర్యలు తీసుకుంటుందని తెలిపారు. మన ప్రాంతంలో నీటి కొరత ఉన్నప్పుడు, మన వాటా నీటిని వేరే ప్రాంతాలకు తరలిస్తుంటే ఎవరూ చూస్తూ ఊరుకోరు. మేము తెలంగాణ ఉద్యమంలో పనిచేసిన వాళ్లం. రాష్ట్ర ప్రయోజనాల విషయంలో వెనక్కి తగ్గే ప్రసక్తే లేదు. ప్రభుత్వానికి సమాచారం ఇవ్వని అధికారులపై ఇప్పటికే చర్యలు తీసుకోవాలని నీటిపారుదల శాఖ మంత్రి అదేశాలు జారీ చేశారని స్పష్టం చేశారు. ప్రతిపక్షాలు తెలంగాణ సంక్షేమానికి, హక్కులకు సలహాలు, సూచనలు ఇస్తే తాము స్వీకరిస్తామని, ఫామ్ హౌస్ లో ఉన్న కేసీఆర్ బయటికి వచ్చి సలహాలు, సూచనలు ఇచ్చిన సరే వాటిని కూడ స్వీకరిస్తామని తెలిపారు.

RN NO. TELTEL/2014/61071
జన తెలంగాణ
తెలుగు దిన పత్రిక
మంగళవారం నవంబర్ 24, 2026

ఎన్కతలలో కళ్యాణ మండపానికి ఘనంగా భూమిపూజ

శనైశ్చర స్వామి ఆలయ నూతన పాలకవర్గ సభ్యుల ప్రమాణ స్వీకారం

ఎన్కతలకు నెలలో 2 కోట్లు - స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ హామీ

వికారాబాద్ నియోజకవర్గం మోమిన్‌పేట్ మండలంలోని ఎన్కతల గ్రామంలో శ్రీ.శ్రీ.శ్రీ శంకర్ భారతి మహారాజ్ ఆశ్రమంలోని శనైశ్చర స్వామి ఆలయం నూతన పాలకవర్గ ప్రమాణ స్వీకార మహోత్సవం, కళ్యాణ మండపం భూమిపూజ మహోత్సవం అత్యంత ఘనంగా నిర్వహించారు.

ఈ కార్యక్రమాలకు తెలంగాణ శాసన సభాపతి, వికారాబాద్ శాసనసభ్యులు గౌరవ శ్రీ గడ్డం ప్రసాద్ కుమార్ గారు హాజరయ్యారు.

దేవాలయానికి హాజరైన స్పీకర్ గారికి పండితులు, ఆలయ పూజారులు పూర్ణకుంభంతో ఘనస్వాగతం పలికారు. ఆ తర్వాత శనైశ్చర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఆ తర్వాత గుడి ప్రాంగణంలో ఉన్న అన్ని దేవతామూర్తులను దర్శనం చేసుకున్నారు.

ఆ తర్వాత కళ్యాణ మండపం నిర్మాణం కోసం స్పీకర్ గారు వేదమంత్రాల మధ్య భూమిపూజ చేశారు.

శనైశ్చర స్వామి ఆలయ నూతన పాలకవర్గ సభ్యుల ప్రమాణ స్వీకారం

అనంతరం శనైశ్చర స్వామి ఆలయ నూతన పాలకవర్గ ప్రమాణ స్వీకార మహోత్సవం స్పీకర్ గారి ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా చైర్మన్‌గా బొడ్డు శ్రీనివాస్ రెడ్డి ప్రమాణస్వీకారం చేశారు. నూతన పాలకవర్గ సభ్యులు కూడా ప్రమాణ స్వీకారం చేసి, ఆలయ అభివృద్ధికి కృషి



చేస్తామని ప్రతిజ్ఞ చేశారు.

ఈ ప్రమాణ స్వీకార కార్యక్రమం మోమిన్‌పేట్ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు శంకర్ యాదవ్, గ్రామ సర్పంచ్ పి. శ్రీకాంత్ గౌడ్ గార్ల ఆధ్వర్యంలో జరిగింది.

అనంతరం నూతనంగా ప్రమాణ స్వీకారం చేసిన సభ్యులందరూ స్పీకర్ గారిని ఘనంగా సన్మానించారు.

ఎన్కతలకు నెలలో 2 కోట్లు - స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ హామీ

ఈ సందర్భంగా స్పీకర్ గారు మాట్లాడుతూ...



హైదరాబాద్ నవంబర్ 23 జన తెలంగాణ

నియోజకవర్గంలోని అనంత పద్మనాభ స్వామి ఆలయం తర్వాత ఈ శనైశ్చర స్వామి ఆలయం అత్యంత ప్రసిద్ధి చెందింది, ప్రాముఖ్యత పొందింది. ఎన్కతల గ్రామంలోని శనైశ్చర స్వామి ఆలయం ఎంతో మహిమాన్వితమైనది."

"కళ్యాణ మండపం గ్రామస్తుల ఎన్నో ఏళ్ల కల. ఈ రోజు దానికి భూమిపూజ చేయడం చాలా సంతోషంగా ఉంది. ఆలయ అభివృద్ధి కోసం, కళ్యాణ మండపం నిర్మాణానికి నా వంతుగా తప్పకుండా సహాయం చేస్తాను."

"ఎన్కతల గ్రామం హెచ్ఎండీఏ పరిధిలోకి వస్తుంది. తప్పకుండా గ్రామ అభివృద్ధికి కృషి చేస్తాను. నెల రోజుల్లో రెండు కోట్ల రూపాయల నిధులు వచ్చేలా సంబంధిత అధికారులతో మాట్లాడి కృషి చేస్తాను. ఈ రెండు కోట్ల నిధులతో గ్రామ అభివృద్ధికి కావలసిన రోడ్లు, ఇతర అన్ని రకాల మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేసేలా కృషి చేస్తాము."

"ఈ నిర్మాణాల కోసం ఎన్కతల గ్రామస్తులందరూ ఐక్యంగా ఉండి, గ్రామ అభివృద్ధికి సహకరించాలి. నూతన పాలకవర్గం ఆలయ అభివృద్ధికి, భక్తుల సేవకు అంకితభావంతో పనిచేయాలని కోరుకుంటున్నాను."

ఈ కార్యక్రమాల్లో మోమిన్‌పేట్ మండల సర్పంచుల సంఘం అధ్యక్షుడు సురేందర్, డీసీసీ జనరల్ సెక్రటరీ సిరాజుద్దీన్, మర్పల్లి ఏఎంసి చైర్మన్ మహేందర్ రెడ్డి, మోమిన్‌పేట్ పీఏసీఎస్ చైర్మన్ నరోత్తం రెడ్డి, కొట్‌పల్లి మండల అధ్యక్షుడు రామచంద్రారెడ్డి, మోమిన్‌పేట్ మండలంలోని వివిధ గ్రామాల సర్పంచులు, ఆశ్రమ నిర్వాహకులు, మండలానికి చెందిన సీనియర్ నాయకులు, భక్తులు, నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా పేద కుటుంబానికి అండగా నిలిచిన ఎమ్మెల్యే శ్రీగణేష్



సికింద్రాబాద్ నవంబర్ 23 జన తెలంగాణ

సికింద్రాబాద్ కంటోన్మెంట్ నియోజకవర్గానికి చెందిన వెస్ట్ మారేడ్‌పల్లిలో నివసిస్తున్న మొహమ్మద్ జిలానీ గారి భార్య రయీసా సుల్తానా గారి వైద్య చికిత్స నిమిత్తం ముఖ్యమంత్రి సహాయ నిధి (జవీ=ళీ) ద్వారా రూ.2,50,000/- (రెండు లక్షల యాభై వేల రూపాయలు) మంజూరుకు సంబంధించిన లెటర్ ఆఫ్ క్రెడిట్ (ఞూజ) జారీ అయింది.

అత్యవసర ట్రాకియోస్టమీ, వైద్య పరీక్షలు, వెంటిలేటర్ సపోర్ట్, ఐసీయూ చికిత్స మరియు వైద్య నిర్వహణ కోసం నిజాం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (చీ×మీ), పంజాగుట్ట ఆసుపత్రికి ఈ నిధులను మంజూరు చేస్తూ ముఖ్యమంత్రి కార్యాలయం ఉత్తర్వులు జారీ చేసింది.

ఈ సందర్భంగా బాధిత కుటుంబానికి అండగా నిలిచి, వారి వైద్య చికిత్సకు ఆర్థిక సహాయం అందేలా కృషి చేసిన గౌరవ ముఖ్యమంత్రి శ్రీ ఎనుముల రేవంత్ రెడ్డి గారికి, ఎమ్మెల్యే శ్రీ గణేష్ గారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.

మెప్మా ఆర్పీలపై వేధింపులు ఆపాలి. 6 నెలల పెండింగ్ గౌరవ వేతనం వెంటనే చెల్లించాలి

- **రాష్ట్ర అధ్యక్షురాలు మానుకోట సునీత డిమాండ్**

కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లాలో మెప్మా (వీఙ్ఞూహీూ) రిసోర్స్ పర్సన్ల (ఆర్పీ) పట్ల స్థానిక అధికారులు అనుసరిస్తున్న వేధింపుల ధోరణిని తక్షణమే నిలిపివేయాలని, పెండింగ్‌లో ఉన్న ఆరు నెలల గౌరవ వేతనాన్ని వెంటనే చెల్లించాలని మెప్మా ఆర్పీల రాష్ట్ర అధ్యక్షురాలు సునీత డిమాండ్ చేశారు.

సోమవారం కాగజ్‌నగర్ పట్టణంలోని అంబేద్కర్ భవనంలో నిర్వహించిన జిల్లా స్థాయి మెప్మా ఆర్పీల సమావేశానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన ఆర్పీల సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

అధికారుల తీరుపై రాష్ట్ర అధ్యక్షురాలి ఆగ్రహం

అనంతరం మీడియాతో సునీత మాట్లాడుతూ, జిల్లాలోని ఉన్నతాధికారులు ఆర్పీలపై తీవ్ర ఒత్తిడి తీసుకొస్తూ మానసిక ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. గతంలో పనిచేసిన కాలానికి సంబంధించి మెప్మా నుంచి 6 నెలల గౌరవ వేతనానికి సంబంధించిన నిధులు విడుదలైనప్పటికీ, ఆర్పీలకు చెల్లించకుండా జాప్యం చేయడం సరికాదన్నారు.

స్థానిక పీడీ రూరల్ విభాగానికి ఇన్‌చార్జిగా ఉండటంతో పర్యవేక్షణ లోపాలు ఏర్పడ్డాయని, ఇదే పరిస్థితిని ఆసరాగా చేసుకుని టీఎంసీ ఇన్‌చార్జి ఆర్పీల పట్ల వేధింపులకు పాల్పడుతున్నారని ఆమె ఆరోపించారు.

జిల్లాలోనే ప్రత్యేక నిబంధనలు ఎందుకు?

తెలంగాణ రాష్ట్రంలోని ఇతర జిల్లాల్లో లేని విధంగా



కొమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలో మాత్రమే ఆర్పీల గౌరవ వేతనాన్ని ఎస్ఎల్ఎఫ్ ఖాతాల్లో జమ చేసిన తర్వాత కూడా సీఓ సంతకం ఉంటేనే నగదు తీసుకోవాలనే నిబంధన విధించడం ఏమిటని సునీత ప్రశ్నించారు.

పనితీరు సరిగా లేదనే కారణాలు చూపుతూ ఎస్ఆర్ఐ పనుల విషయంలో కొందరు ఆర్పీలను పక్కన పెట్టారని, తిరిగి విధుల్లోకి తీసుకున్న తర్వాత కూడా వారికి గౌరవ వేతనం చెల్లించకుండా ఇబ్బందులకు గురిచేయడం అన్యాయమని పేర్కొన్నారు. ఈ విధానాన్ని రాష్ట్ర కమిటీ తరఫున తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు.

రాష్ట్ర కమిటీ ప్రధాన డిమాండ్లు

ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో మెప్మా ఆర్పీలు కీలక పాత్ర పోషిస్తున్నారని సునీత స్పష్టం చేశారు. ఆర్పీల సేవలు లేకుండా మెప్మా కార్యక్రమాల అమలు కష్టమని పేర్కొన్నారు.

జిల్లాలోని ఆర్పీలకు రాష్ట్ర కమిటీ పూర్తి అండగా ఉంటుందని, సంబంధిత కమిషనర్, పీడీలను కలిసి పెండింగ్‌లో ఉన్న ఆరు నెలల గౌరవ వేతనాన్ని విడుదల చేయించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

రాష్ట్ర కమిటీ తీర్మానం మేరకు ప్రభుత్వం తక్షణమే స్పందించి కింది డిమాండ్లను పరిష్కరించాలని కోరారు.

తెలంగాణ వ్యాప్తంగా పనిచేస్తున్న మెప్మా ఆర్పీల గౌరవ వేతనాన్ని నెలకు రూ.26,000కు పెంచాలి.

ఆర్పీలకు పూర్తిస్థాయి ఉద్యోగ భద్రత కల్పించి, ఇష్టానుసారంగా విధుల నుంచి తొలగించే విధానాన్ని నిలిపివేయాలి.

రాష్ట్రవ్యాప్తంగా ఆర్పీలందరికీ ఒకే విధమైన డ్రెస్ కోడ్ అమలు చేయాలి.

ఆర్పీలకు ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలి.

కొమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలో పెండింగ్‌లో ఉన్న ఆరు నెలల గౌరవ వేతనాన్ని తక్షణమే చెల్లించాలి.

ఈ కార్యక్రమంలో ఉమ్మడి అదిలాబాద్ జిల్లా అధ్యక్షురాలు అరుణ, కొమురం భీం జిల్లా అధ్యక్షురాలు పొన్న స్రవంతి, కార్యదర్శి కచ్చ కాయల శైలోజ, కోశాధికారి ఫాతిమా, ఉపాధ్యక్షురాలు స్వర్ణలత, సహాయ కార్యదర్శి కవిత ఆర్పీలు పాల్గొన్నారు.

దూల్‌పేట్ లో1.23 కేజీల గంజాయి పట్టివేత.



హైదరాబాదు నవంబర్ 23 జన తెలంగాణ

దూల్‌పేట్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని శివలాల్ నగర్ ప్రాంతంలో హత్గడే కరణ్ (34) అనే వ్యక్తి గంజాయి అమ్మకాలు జరుపుతుండగా దూల్‌పేట్ ఎక్సైజ్ సీఐలు ప్రవీణ్ కుమార్, విప్లవ రెడ్డి,ఎస్ఐలు వెంకటేశ్వర రెడ్డి, మొగల్ అప్ప సిబ్బంది కలిసి పట్టుకున్నారు.

నిందితుడు హత్గడే కరణ్ అనే వ్యక్తి ఆటోలో గంజాయి అమ్మకాలు జరుపుతుండగా ఎక్సైజ్ సిబ్బంది పట్టుకున్నారు.

గంజాయితోపాటు ఆటోను సీజ్ చేసి కోర్టులో హాజరు పరిచారు.

నిందితుడితోపాటు అతని కుటుంబ సభ్యులపై కూడా కేసు నమోదు చేసినట్లు సీఐ ప్రవీణ్ కుమార్ తెలిపారు.

బీసీఏలో ఇతర కులాలను చేర్చొద్దు.. 58 కులాలకు అన్యాయం చేయొద్దు

- **బీసీఏలోని 58 కులాల హక్కులను కాపాడాలి**
- **ముదిరాజుల చేరికపై బీసీఏ కులాల ఆందోళన**
- **బీసీఏ సబ్ కమిటీని వెంటనే రద్దు చేయాలి**
- **ముదిరాజులను బీసీఏలో చేర్చితే సహించేది లేదు:సురేష్ బాబు**

బీసీఏ కులాల్లో ఇతర కులాలను చేర్చడం వల్ల అత్యంత వెనుకబడిన జంగమ కులంతో పాటు బీసీఏలోని 58 కులాల పిల్లల భవిష్యత్తుకు అన్యాయం జరుగుతుందని జంగమ సమాజం హనుమకొండ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కోకిలవాయ సురేష్ బాబు ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం హనుమకొండ ప్రెస్ క్లబ్‌లో బీసీఏ కులాల నాయకులు, విద్యార్థులు, మేధావులతో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీసీఏలోని 58 కులాలు సంచార జీవనం, సంప్రదాయ వృత్తులపై ఆధారపడి జీవిస్తూ



ఆర్థికంగా, సామాజికంగా వెనుకబడి ఉన్నాయని తెలిపారు. జంగమ కులానికి చెందిన అధిక శాతం మంది పురోహిత, పూజా కార్యక్రమాలు, చిరు వ్యాపారాల ద్వారా జీవనం సాగిస్తూ అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో ముదిరాజులను బీసీఏలో చేర్చేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తే ఇప్పటికే వెనుకబడిన 58 కులాలకు విద్య, వైద్య, రాజకీయ రంగాల్లో తీవ్ర నష్టం కలుగుతుందని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ముదిరాజులను బీసీఏలో చేర్చే అంశంపై ఏర్పాటు చేసిన సబ్ కమిటీని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ అంశంపై రాష్ట్ర మంత్రులతో ప్రత్యేకంగా సమావేశం నిర్వహించి ముదిరాజులను బీసీఏలో చేర్చకుండా చర్యలు



తీసుకోవాలని కోరారు. బీసీఏలోని 58 కులాల హక్కులు, భవిష్యత్తును కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. తమ డిమాండ్లను ప్రభుత్వం పట్టించుకోకపోతే రాష్ట్రంలోని 33 జిల్లాల బీసీఏ కులాల ప్రజలను సమీకరించి హక్కుల సాధన కోసం ఎంతవరకైనా పోరాటం చేస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో జేఏసీ రాష్ట్ర కన్వీనర్ శ్రీ వెంకట్, గైనేని రవీందర్, తులసి కళ్యాణ్, మారేపల్లి క్రాంత్ కుమార్, మాకుల గణేష్, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ బీసీఏ కులాల అధ్యక్షుడు విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కూకట్‌పల్లిలో బూత్ లెవల్ ఏజెంట్లకు కీలక బాధ్యతలు అప్పగింత -- బండి రమేష్

కూకట్పల్లి నవంబర్ 23 జన తెలంగాణ



శ్రీ హేమ దుర్గాభవన్‌లోని కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో సోమవారం రోజున టీపీసీసీ వైస్ ప్రెసిడెంట్ కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ బండి రమేష్ గారి ఆధ్వర్యంలో ముఖ్యమైన సమావేశం నిర్వహించడం జరిగింది.



పీసీసీ అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గారి ఆదేశాల మేరకు రాష్ట్రవ్యాప్తంగా పనిచేస్తున్న బూత్ లెవల్ ఏజెంట్లకు (దీూాలకు) వారి సంబంధిత పోలింగ్ బూతుల వారీగా బాధ్యతలు కేటాయిస్తూ అధికారిక ఉత్తర్వులు జారీ చేయడం జరిగింది.

ఈ సందర్భంగా బండి రమేష్ మాట్లాడుతూ, ప్రతి బూత్ లెవల్ ఏజెంట్ పార్టీ నిర్దేశించిన విధివిధానాలు, మార్గదర్శకాలకు అనుగుణంగా తమకు కేటాయించిన పోలింగ్ బూతుల పరిధిలో ఓటు హక్కు పరిరక్షణకు బాధ్యతాయుతంగా పనిచేయాలని సూచించారు. ఓటర్ల హక్కులను కాపాడటంలో బూత్ లెవల్ ఏజెంట్ల పాత్ర ఎంతో కీలకమని, ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉంటూ ప్రజాస్వామ్య పరిరక్షణలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

అనంతరం పీసీసీ అదేశాల మేరకు నియమితులైన కోఆర్డినేటర్ శ్రీ నర్సిరెడ్డి మాట్లాడుతూ, బూత్ లెవల్ ఏజెంట్లు తమకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించాలని, పార్టీ నాయకత్వం సూచించిన మార్గదర్శకాలను పాటిస్తూ ఓటు హక్కు పరిరక్షణ కోసం సమన్వయంతో పనిచేయాలని వివరించారు.

ఈ సమావేశంలో అన్ని డివిజన్ల అధ్యక్షులు, మాజీ డివిజన్ అధ్యక్షులు, మహిళా అధ్యక్షురాళ్లు, సీనియర్ కాంగ్రెస్ నాయకులు, బూత్ లెవల్ ఏజెంట్లు తదితరులు పాల్గొన్నారు.

మామిళ్ళ ఈశ్వరయ్య విజయం తథ్యం..

- **-సర్పంచ్ అభ్యర్థి మామిళ్ళ ఈశ్వరయ్యకు ఓటర్ల నుంచి అపూర్వ స్పందన**

ఒంటిమిట్ట గ్రామ వీధుల్లో తెలుగుదేశం పార్టీ మద్దతుతో సర్పంచ్ గా పోటీ చేస్తున్న మామిళ్ళ ఈశ్వరయ్యకు గ్రామ ఓటర్ల నుంచి అపూర్వస్పందన కనిపిస్తోంది. గతంలో రెండు పర్యాయములు ఒంటిమిట్ట సర్పంచిగా, పనిచేసిన మండల టిడిపి సీనియర్ నాయకుడు రాష్ట్ర మాజీ డైరెక్టర్ కొమరా వెంకట నరసయ్య సీనియర్ నాయకుడు పామూరు సుబ్రమణ్యం, సర్పంచ్ అభ్యర్థి ఈశ్వరయ్య విజయం కోసం అహర్నిశలు కృషి చేస్తున్నారు. సోమవారం గ్రామంలోని ప్రధాన వీధుల్లో బస్టాండ్ మరియు చెరువు తట్ట వీధుల్లో, అలాగే ఒంటిమిట్ట హరిజనవాడ, అరుంధతి వార్డులలో



ఓటర్లు స్వచ్ఛందంగా స్పందించి గతంలో జరిగిన అభివృద్ధి గురించి స్వయంగా ఓటర్లు తెలపడం విశేషం. పెద్ద ఎత్తున ఈశ్వరయ్య కు మద్దతుగా కార్యకర్తలు మహిళలు పాల్గొన్నారు. విశేష స్పందన కనిపించిన ఈ ప్రచారంలో గ్రామం కు చెందిన పలువురు ముఖ్య నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా టిడిపి సీనియర్ నాయకులు కొమరా వెంకట నరసయ్య మాట్లాడుతూ మామిళ్ల ఈశ్వరయ్యకు విశేష ప్రజాదరణ లభిస్తోందని, అన్నారు. గతంలో రెండు పర్యాయములు తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో సర్పంచ్ గా తాము గెలిచామని, పదేళ్ల పదవి కాలంలో గ్రామంలోని సుమారు 90 శాతం.సిసి రోడ్లను తాము నిర్మించడం జరిగిందని, కళ్ళకు కనిపిస్తున్న ఈ అభివృద్ధి ఈశ్వరయ్య విజయానికి ఉపయోగపడుతుందని అన్నారు. ఈశ్వరయ్య విజయం తద్యమని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఈశ్వరయ్యకు లభిస్తున్న ప్రజాదరణ ఇప్పటికే పంచాయతీ వ్యాప్తంగా ప్రజల్లోకి విస్తరించిందని అన్నారు. ఈ ఈ కార్యక్రమంలో పాల్గొన్నఅందరికీ మామిళ్ళ ఈశ్వరయ్య పామూరు సుబ్రమణ్యం మామిళ్ళ రామకృష్ణయ్య కృతజ్ఞతలు తెలిపారు.

RN NO. TELTEL/2014/61071
జన తెలంగాణ
తెలుగు దిన పత్రిక

ఎస్.సి., ఎస్.టి.ల సంక్షేమం, సమస్యల పరిష్కారంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి,

●జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



జిల్లాలో షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగల ప్రజలపై జరిగే అఘాయిత్యాలను అరికట్టడంతో పాటు వారి సమస్యలను గుర్తించి సత్వరమే పరిష్కరించేలా అధికారులు సమన్వయంతో పని చేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. సోమవారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలోషెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి చాతరాజుల దుర్గాప్రసాద్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఎస్.సి., ఎస్.టి. అఘాయిత్యాల నిరోధక జిల్లా స్థాయి విజిలెన్స్ & మానిటరింగ్ కమిటీ సమావేశానికి డి.సి.పి. ఎ.భాస్కర్, జిల్లా అటవీ అధికారి రాహుల్ కిషన్ జాదవ్, జిల్లా అదనపు కలెక్టర్లు పి.చంద్రయ్య, వి.రాములు, బెల్లంపల్లి సబ్ కలెక్టర్ మనోజ్, జిల్లా రెవెన్యూ అధికారి మోతిరామ్, మంచిర్యాల రాజస్వ మండల అధికారి శ్రీనివాస్ రావు, ఎ.సి.పి.లు, జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి నీరటి రాజేశ్వరి, జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి, కమిటీ సభ్యులతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ కుమార్ దీపక్, మాట్లాడుతూ ఎస్.సి., ఎస్.టి. లపై అఘాయిత్యాల నిరోధక చట్టం-1989, సవరణ చట్టం-2015 నిబంధనలను పకడ్బందీగా అమలు చేయాలని తెలిపారు. అఘాయిత్యాలకు సంబంధించిన ఫిర్యాదులపై వెంటనే స్పందించి కేసులు నమోదు చేయాలని, విచారణను వేగవంతం చేసి బాధితులకు సత్వర న్యాయం అందేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. నమోదైన కేసులలో బాధితులకు ప్రభుత్వ నిబంధనల ప్రకారం పరిహారం మంజూరు చేయాలని, పరిహారం చెల్లింపులో జాప్యం జరగకుండా చూడాలని తెలిపారు. బాధిత కుటుంబాలకు అవసరమైన న్యాయ సహాయం, వైద్య సహాయం, భద్రత, పునరావాస సదుపాయాలు కల్పించాలని సంబంధిత శాఖల అధికారులకు సూచించారు. ఎస్.సి., ఎస్.టి. వర్గాలకు చెందిన ప్రభుత్వ ఉద్యోగుల సమస్యల పరిష్కారంలో ప్రతి శాఖలో నియమితులైన లైజనింగ్ అధికారులు కీలక బాధ్యత నిర్వహించాలని తెలిపారు. ఆయా శాఖలలో పని చేస్తున్న ఎస్.సి., ఎస్.టి. ఉద్యోగుల సర్వీస్ సంబంధిత సమస్యలు, పదోన్నతులు, సీనియారిటీ, బదిలీలు, ఖాళీల భర్తీ, రిజర్వేషన్ల అమలు తదితర అంశాలను ఎప్పటికప్పుడు పరిశీలించాలని సూచించారు. ఉద్యోగులకు ఎదురయ్యే సమస్యలను గుర్తించి సంబంధిత శాఖాధికారుల దృష్టికి తీసుకెళ్లి, నిబంధనల ప్రకారం పరిష్కారమయ్యేలా నిరంతరం పర్యవేక్షించాలని తెలిపారు. ప్రతి శాఖలో ఎస్.సి., ఎస్.టి. రిజర్వేషన్ల అమలు తీరును సమీక్షిస్తూ, ఉద్యోగుల నుంచి వచ్చే ఫిర్యాదులపై నిర్లక్ష్యం చేయకుండా తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. పరిష్కరించిన సమస్యలు, పెండింగ్‌లో ఉన్న అంశాల వివరాలను ఎప్పటికప్పుడు జిల్లా అధికారులకు నివేదించాలని లైజనింగ్ అధికారులను ఆదేశించారు.

ఎస్.సి., ఎస్.టి. లకు సంబంధించిన భూ సమస్యలను క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించాలని రెవెన్యూ అధికారులకు సూచించారు. భూముల హక్కులు, భూ రికార్డులు, ఆక్రమణలు తదితర అంశాలపై సమగ్ర విచారణ జరిపి అర్హులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఎస్.సి., ఎస్.టి. కాలనీలు, ఆవాస ప్రాంతాలలో రహదారుల పరిస్థితిని క్షేత్రస్థాయిలో పరిశీలించాలని, అవసరమైన చోట సి.సి. రోడ్లు నిర్మించాలని, ఇప్పటికే ఉన్న రహదారులకు మరమ్మతులు చేపట్టాలని తెలిపారు. కాలనీలలో మురుగునీటి సమస్యలు తలెత్తకుండా డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరచాలని, పెండింగ్‌లో ఉన్న డ్రైనేజీ పనులను గుర్తించి త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత పంచాయతీరాజ్, మున్సిపల్ అధికారులను ఆదేశించారు.

ఎస్.సి., ఎస్.టి. సంక్షేమ వసతి గృహాలలో విద్యార్థులకు నాణ్యమైన వసతులు కల్పించాలని, త్రాగునీరు, పారిశుద్ధ్యం, మరుగుదొడ్లు, విద్యుత్, భోజనం, పడకలు తదితర సౌకర్యాలను అధికారులు ఎప్పటికప్పుడు పరిశీలించాలని ఆదేశించారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన మౌలిక సదుపాయాలను కల్పించడంతో పాటు వసతి గృహాల నిర్వహణపై నిరంతర పర్యవేక్షణ ఉండాలని తెలిపారు. వసతి గృహాల పరిసరాలలో విద్యార్థుల ఆరోగ్యం, భద్రతకు భంగం కలిగించే విధంగా వైన్ షాపులు, పాన్ డబ్బాలు ఏర్పాటు కాకుండా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇప్పటికే ఉన్న దుకాణాల విషయంలో నిబంధనల ప్రకారం పరిశీలించి తగిన చర్యలు చేపట్టాలని, వసతి గృహాల పరిసరాలను పరిశుభ్రంగా, సురక్షితంగా ఉంచాలని తెలిపారు. ఎస్.సి., ఎస్.టి. వర్గాల ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు, విద్య, ఉపాధి, ఆర్థిక అభివృద్ధి కార్యక్రమాలు సక్రమంగా అందేలా అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని తెలిపారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాలలో కుల వివక్ష, అంటరానితనం, సామాజిక అసమానతలను రూపుమాపేందుకు ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు. సంబంధిత శాఖల అధికారులు తమ పరిధిలోని సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారానికి తీసుకున్న చర్యలపై సమగ్ర నివేదికలు సమర్పించాలని తెలిపారు. ఎస్.సి., ఎస్.టి. వర్గాల సంక్షేమం, అభివృద్ధి, హక్కుల పరిరక్షణకు అన్ని శాఖలు సమన్వయంతో పని చేయాలని తెలిపారు.

ఈ కార్యక్రమంలో ఎస్.సి., ఎస్.టి. విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు దమ్మ నారాయణ, చిలుక రాజనర్సు, బెక్కం రాజారావు, దుర్గం ఎల్లయ్య, పెద్ది రాజన్న, పోలీసు, రెవెన్యూ, సాంఘిక సంక్షేమ, గిరిజన సంక్షేమ, పంచాయతీరాజ్, రహదారులు & భవనాల శాఖల అధికారులు, వివిధ శాఖల లైజనింగ్ అధికారులు, జిల్లా స్థాయి విజిలెన్స్ & మానిటరింగ్ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో సత్యసాయి బాబా 101వ జయంతి వేడుకలు

●సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో ఘనంగా జన్మదిన వేడుకలు.. పాల్గొన్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్





రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ పట్టణంలోని పరిగి రోడ్డులో సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో భగవాన్ శ్రీ సత్యసాయి బాబా 101వ జయంతి వేడుకలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ వేడుకలకు షాద్‌నగర్ ఎమ్మెల్యే, ప్రభుత్వ రంగ సంస్థల కమిటీ చైర్మన్ వీర్లపల్లి శంకర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

ఈ సందర్భంగా సత్యసాయి బాబా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం నిర్వహించిన ప్రత్యేక ప్రార్థనలు, భజన కార్యక్రమాల్లో పాల్గొన్నారు. సత్యసాయి బాబా బోధించిన ప్రేమ, సేవ, శాంతి, సత్యం, ధర్మం అనే ఐదు విలువలు ప్రతి ఒక్కరి జీవితంలో ఆచరించదగినవని పేర్కొన్నారు. సమాజంలో సేవాభావం, మానవత్వం, ఆధ్యాత్మిక చింతన పెంపొందించడంలో సత్యసాయి సేవా సమితి చేస్తున్న సేవలు అభినందనీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ బసవేశ్వర్, కౌన్సిలర్ నడికుడ శ్రావణి,సి పెంటయ్య, చందు లాల్, కత్తి చంద్రశేఖరప్ప, చంద్రశేఖర్, కె కె కృష్ణ, సత్యనారాయణ రెడ్డి, మంగ అశోక్, తంగడపల్లి శంకర్, సేవా సమితి కన్వీనర్ శ్రీనివాసరెడ్డి, మణికొండ వెంకటయ్య గౌడ్, సుధాకర్ రెడ్డి, మాధవలు యాదవ్ మేకల వెంకటేష్, చటాన్పల్లి శేఖర్ తదితరులు పాల్గొన్నారు

ఆమనగల్లు లో వైభవంగా భగవాన్ శ్రీ సత్యసాయిబాబా 101వ జన్మదిన వేడుకలు

భక్తి పారవశ్యంలో సత్యసాయి సేవా సమితి మందిరం
నారాయణ సేవ, అన్నదానంతో సేవా సందేశం చాటిన భక్తులు

భగవాన్ శ్రీ సత్యసాయిబాబా వారి 101వ జన్మదిన మహోత్సవాన్ని పురస్కరించుకొని ఆమనగల్లు పట్టణంలోని శ్రీ సత్యసాయి సేవా సమితి మందిరంలో జన్మదిన వేడుకలను భక్తిశ్రద్ధలతో, అత్యంత వైభవంగా నిర్వహించారు. స్వామివారి నామస్మరణలు, భజనలు, ఆధ్యాత్మిక కార్యక్రమాలతో మందిర ప్రాంగణం భక్తిమయంగా మారింది.

ఉదయం 5.30 గంటలకు నగర సంకీర్తనతో వేడుకలు ప్రారంభమయ్యాయి. అనంతరం ఉదయం 11 గంటలకు సత్యసాయి వ్రతాన్ని భక్తిపూర్వకంగా నిర్వహించారు. అనంతరం నారాయణ సేవలో భాగంగా అన్నప్రసాద వితరణ చేపట్టి భక్తులకు భోజన వసతి కల్పించారు. సాయంత్రం స్వామివారి డోలోత్సవం, జన్మదిన కేక్ కటింగ్, మహా మంగళహారతి నిర్వహించి భక్తులకు ప్రసాద వితరణతో కార్యక్రమాలను ముగించారు.



ఈ వేడుకలకు ముఖ్య అతిథులుగా ఆమనగల్లు మున్సిపల్ చైర్మన్ డాక్టర్ ఎన్. పత్యా నాయక్, కౌన్సిలర్ ఎర్రవోలు మహేష్ హాజరై స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఈ సందర్భంగా భగవాన్ శ్రీ సత్యసాయిబాబా వారి అమూల్యమైన బోధనలను భక్తులు స్మరించుకున్నారు. "సత్యం, ధర్మం, శాంతి, ప్రేమ, అహింస" అనే పంచమూల్యాలు మానవ జీవితానికి మార్గదర్శకాలని, ప్రతి ఒక్కరూ ప్రేమభావంతో జీవించాలని స్వామివారు బోధించారని పేర్కొన్నారు. "అందరినీ ప్రేమించండి.. అందరికీ సేవ చేయండి" అనే స్వామివారి సందేశం ప్రతి ఒక్కరికీ ఆదర్శమని తెలిపారు.

విద్య, వైద్యం, మంచినీరు వంటి మౌలిక అవసరాలను పేదలకు అందించడం నిజమైన మానవ సేవ అని స్వామివారు ఆచరణలో చూపించారని గుర్తుచేశారు. మానవ సేవే మాధవ సేవ అనే స్ఫూర్తితో సమాజంలోని నిరుపేదలకు సేవ చేయడమే స్వామివారికి అందించే నిజమైన నివాళి అని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమం సమితి కన్వీనర్ దొంతు శ్రీనివాస్ ఆధ్వర్యంలో జరిగింది. ఈ వేడుకల్లో అప్పం అలివేలమ్మ, తిరుపతయ్య, అప్పం భరత్, శ్రీనివాస్, పోలిశెట్టి శ్రీనివాస్, గోల్డ్ రాము, రామాచారి, నాగిళ్ల లింగం, గుర్రం సురేష్, మూర్తి, శంకర్, అల్లాజి, శ్రీశైలం, గాజుల శ్రీనివాస్, డాక్టర్ దొంతు పుల్లయ్య, దాస శ్రీనివాస్, బ్రహ్మం, దొంతు విజయలక్ష్మి, దొంతు సంధ్య, సింధు, సునీత, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

భక్తి, సేవ, ఆధ్యాత్మికతల సమ్మేళనంగా సాగిన ఈ వేడుకలు భక్తుల్లో ఆనందోత్సాహాలను నింపాయి.

కార్తీక శుద్ధ త్రయోదశి ఆదివారం భక్తి శ్రద్ధలతోగోదావరి హారతి

భద్రాద్రి పురోహితుల సంఘం అధ్యక్షులు రామవజ్జల రవికుమార్





భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ చొరవతో భద్రాద్రి దివ్య క్షేత్రంలో ప్రతి ఆదివారం నిర్వహిస్తున్న గోదావరి హారతి భక్తుల ఆదరణతో అంగరంగ వైభవంగా జరుగుతున్నదని భద్రాద్రి పురోహితుల సంఘం అధ్యక్షులు రామవజ్జల రవికుమార్ అన్నారు.

ఆదివారం నాడు గోదావరి స్నాన ఘట్టాల వద్ద నిర్వహించిన గోదావరి హారతిలోముందుగా గణపతి పూజ శ్రీ సీతారామచంద్రస్వామి వారి కి గోదావరి మాతకు అష్టోత్తర శతనామార్చనలు నిర్వహించి అనంతరం శ్రీ సీతారామచంద్రస్వామి వారికి, గోదావరి మాతకు దివ్య హారతులు సమర్పించడం జరిగిందని ఆయన అన్నారు.

లోక కళ్యాణార్థం, ఉభయ తెలుగు రాష్ట్రాల ప్రజలు అన్ని రంగాలలో అభివృద్ధి చెందాలని శ్రీ సీతారామచంద్రస్వామి వారిని, గోదావరి మాతను ప్రార్థిస్తూ ప్రత్యేక పూజలు నిర్వహించడం జరిగిందని అన్నారు.

గోదావరి మాతకు శ్రీ సీతారామచంద్ర స్వామి వారికి హారతులు సమర్పించిన పురోహితులు రాయప్రోలు సత్యప్రసాద్ శర్మ, బుక్కపట్నం, రామాచార్యులు, చంద్రశేఖర శర్మ, తేజ శర్మ, శివ,వి హెచ్చి తిరుపతిరావు, సత్యనారాయణ రెడ్డి హారతులు సమర్పించగా, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

అనంతరం రవికుమార్ లక్ష్మీదంపతులు, రామాచార్యులు, పిఎస్ఎన్ రెడ్డి దంపతులు సమర్పించిన ప్రసాదాన్ని భక్తులకు పంపిణీ చేసి శాంతి మంత్ర పఠనంతో గోదావరి హారతి కార్యక్రమం ముగించడం జరిగిందని ఆయన అన్నారు.

చేనేత సంఘం ఆస్తికి ఎసరు

--స్థలాన్ని కాపాడాలంటూ ఫిర్యాదు!
--20 ఏళ్ల పాటు లీజుకు ఇచ్చే వ్యవహారంపై అభ్యంతరం
--సమగ్ర విచారణ జరిపి స్థలాన్ని పరిరక్షించాలని అధికారులకు వినతి

ఆమనగల్లు పట్టణంలోని చేనేత సహకార సంఘానికి చెందిన విలువైన స్థలాన్ని పరిరక్షించాలని కోరుతూ సంఘం ప్రతినిధులు అధికారులను ఆశ్రయించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ కిరణ్మయి, హ్యాండ్లూమ్ కార్పొరేషన్ చైర్మన్ వెంకటరమణ, ఏ.డి. చౌదేశ్వరి కలిసి వినతిపత్రం అందజేశారు.



ఆమనగల్లు పట్టణంలోని ఏడో వార్డు వెంకటేశ్వర కాలనీలో సినిమా టాకీస్ సమీపంలో ఉన్న సర్వే నంబర్ 667, ప్లాట్ నంబర్ 12లోని 334 చదరపు గజాల చేనేత సహకార సంఘం స్థలాన్ని 20 సంవత్సరాల పాటు లీజుకు ఇచ్చే వ్యవహారంపై వారు అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ చేపట్టి స్థలానికి సంబంధించిన వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని కోరారు. చేనేత సహకార సంఘానికి చెందిన ఆస్తిని కాపాడేందుకు తక్షణ చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. చేనేత కార్మికుల సంక్షేమానికి, భవిష్యత్తు అవసరాలకు ఉపయోగపడాల్సిన సంఘం స్థలం ఇతరుల చేతుల్లోకి వెళ్లకుండా చూడాలని అధికారులకు వినతిపత్రం అందచేశారు. వినతి పత్రం అందచేసిన వారిలో పద్మశాలి కులస్తులు కోట కృష్ణయ్య, దోర్నాల ఈశ్వరయ్య, గంజి పురుషోత్తం, ఎంగలి యాదగిరి, అంకం సత్యం, మస్నా మురళీధర్, గుద్దేటి మహేష్, బావండ్ల వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు

వరి కొయ్యలను కాల్చవద్దు:-.ఎంపీఓ రెహానా

రామలచ్చక్కపేటకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు -- కృషి చేసిన నర్సింగరావు గారికి కృతజ్ఞతలు

వరి అవశేషాలను కాల్చడం వల్ల వాయు కాలుష్యం పెరుగుతుందని నల్లగొండ జిల్లా గుండ్లపల్లి డిండి మండల వ్యవసాయ అధికారి రెహానా సోమవారం ప్రకటన ద్వారా రైతులకు గుర్తు చేశారు.నేలలోని సేంద్రీయ కార్బన్ మరియు ముఖ్యమైన పోషకాలు నష్టపోతాయని, మిత్ర సూక్ష్మజీవులు దెబ్బతింటాయని తెలిపారు.దీర్ఘకాలంలో భూసారం నేల ఆరోగ్యం తగ్గే అవకాశం ఉందని పేర్కొన్నారు. వరి కొయ్యలను ఎట్టి పరిస్థితుల్లో కాల్చవద్దని,నేలలో కలియ దున్నాలని, పంట అవశేషాలు నేలలో కలిసినప్పుడు సేంద్రీయ పదార్థం నేలలో తేమ సూక్ష్మజీవుల కార్యకలాపాలు మెరుగుపడతాయని ఆమె అన్నారు.అవశేషాల్లోని పోషకాలు తిరిగి నేలకు చేరి భూసారాన్ని నేల ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో సహాయపడతాయని రైతులకు సూచించారు.



ఈరోజు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు ప్రక్రియలో భాగంగా రామలచ్చక్కపేట గ్రామానికి లి4 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు కావడంలి గ్రామ ప్రజల్లో ఆనందాన్ని నింపింది.



ఈ ఇళ్ల మంజూరుకు సహకరించి, కృషి చేసిన లిజువ్వాడి నర్సింగరావు గారికిలి గ్రామ ప్రజల తరఫున హృదయపూర్వక ధన్యవాదాలు, కృతజ్ఞతలు తెలియజేస్తున్నాము.

పేద, నిరుపేద కుటుంబాలకు సొంతింటి కల నెరవేరే దిశగా ఈ మంజూరు ఒక ముందడుగు కావాలని ఆకాంక్షిస్తున్నాము.

RN NO. TELTEL/2014/61071
జన తెలంగాణ
తెలుగు దిన పత్రిక

‘ఆలోచన’ చిత్రం నిజంగానే మంచి ఆలోచన.. ఈ సినిమా మంచి విజయం సాధించాలని కోరుకుంటున్నాను..ట్రైలర్ లాంచ్ అనంతరం మెగాస్టార్ చిరంజీవి ప్రశంసలు

జన తెలంగాణ సినిమా

పీఎస్‌జే ఫిల్మ్స్ కో బ్యానర్ మీద ప్రదీప్ కుమార్, గుండబోయిన శ్రీనివాస్ నిర్మాణంలో సురేందర్ చాచా తెరకెక్కించిన చిత్రం ‘ఆలోచన’. ఈ మూవీలో +.ఎ.నారాయణ రావు, ప్రసాద్ బాబు, నరసింహరాజు, మహర్షి రాఘవ, జయలలిత, రజన్ హరి, బెన్నీ సుధాకర్ వంటి వారు కీలక పాత్రలో, సుజనా,అనుపమ స్వాతి, మాధవి, అద్వైక జెస్సీ, హసిత, జెన్నీ,ప్రసాద్ రామ్, నరేంద్ర, ముఖ్య పాత్రల్లో నటించారు. నవంబర్ 27న ‘ఆలోచన’ మూవీని గ్రాండ్‌గా రిలీజ్ చేయబోతోన్నారు. ఈ క్రమంలో మెగాస్టార్ చిరంజీవి ఈ మూవీ ట్రైలర్‌ను విడుదల చేశారు.

‘స్నేహం కోసమే అన్నీ.. స్నేహంతోనే అన్నీ.. ఆశ, మోహం, అసూయ, స్వార్థం అన్నీ చచ్చి.. నీలోని మనిషి.. ప్రతీ మనిషిని ప్రేమిస్తే చాలు.. ప్రతీ ఒక్కరూ నిన్ను ప్రేమిస్తారు.. ఆ ప్రేమలో ప్రతీ క్షణం ఆనందంగా జీవిస్తావు.. నువ్వు తృప్తిగా మరణించడానికి మార్గం మానవత్వం.. అదే దైవం, అదే మోక్షం’, ‘ప్రాణ స్నేహితులు చచ్చిపోతే.. వాడితో పాటు చచ్చిపోయే స్నేహితుడు చరిత్రలో ఉన్నాడా?’, ‘అద్భుతాలను అనుభవించాలి.. ప్రశ్నించకూడదు.. సమాధానం దొరకదు.. ఉండదు’.. అనే అద్భుతమైన డైలాగ్స్, గుండెని తాకే ఎమోషన్స్‌తో, మనసుని కదిలించే సన్నివేశాలతో ట్రైలర్ అందరిలోనూ ‘ఆలోచన’ను రేకెత్తించేలా సాగింది. ట్రైలర్ రిలీజ్ చేసిన అనంతరం..

మెగాస్టార్ చిరంజీవి మాట్లాడుతూ.. “మంచు పల్లకి’ స్ఫూర్తితో ‘ఆలోచన’ చేశామని అన్నారు. ఈ ‘ఆలోచన’ చిత్రం నిజంగానే మంచి ఆలోచన. వృద్ధాప్యంలోనూ తల్లిదండ్రులు తమ బిడ్డల గురించే ఆలోచిస్తుంటారు. కానీ బిడ్డలకు మాత్రం వేరే వేరే ప్రపంచాలుంటాయి. వృద్ధాప్యంలో తమ తమ స్నేహితులతో కలిసి ఉండటం, ఆలోచనలు పంచుకోవడం, సమయాన్ని గడపడంతో మళ్లీ ఏజ్ రివర్స్ అయినట్టుగా వారికి అనిపిస్తుంది. అలాంటి ఆలోచనను రేకెత్తించేలా ఈ ‘ఆలోచన’ ఉంది. మంచి చిత్రాలను ప్రేక్షకులు



ఎప్పుడూ ఆదరిస్తూనే ఉంటారు. అలానే ఈ సినిమాని ఆదరించాలని, ‘ఆలోచన’ చిత్రం మంచి విజయం సాధించాలని కోరుకుంటున్నాను’ అని అన్నారు.

నటీనటులు : +.ఎ నారాయణ రావు, ప్రసాద్ బాబు, నరసింహరాజు, మహర్షి రాఘవ, జయలలిత, రజన్ హరి, బెన్నీ సుధాకర్ తదితరులు

టెక్నికల్ టీం

బ్యానర్ :పీఎస్‌జే ఫిల్మ్స్ కంపెనీ

నిర్మాత : ప్రదీప్ కుమార్, శ్రీనివాస్ గుండబోయిన

దర్శకుడు : సురేందర్ చాచా

కెమెరామెన్ : టి. సురేంద్ర రెడ్డి

సంగీత దర్శకుడు : వియాన్

ఎడిటర్ : ఆర్.ఎల్. వర్మ

ఆర్ట్ డైరెక్టర్ : గిరీష్ దేవాంగ్

రిలీజ్ : ఎస్. కె. పిక్చర్స్

పదేళ్లుగా వైవిధ్యమైన కథలతో అలరిస్తూ.. ఇప్పుడు సంగీత రంగంలోకి అడుగు పెట్టిన నిహారిక కొణిదెల.. ‘పాకెట్ రాకెట్స్’తో పింక్ ఎలిఫెంట్ మ్యూజిక్ ప్రారంభం



జన తెలంగాణ సినిమా

జాతీయ అవార్డ్ అందుకున్న నిర్మాణ సంస్థ పింక్ ఎలిఫెంట్ తన క్రియేటివ్ ప్రయాణాన్ని మరింతగా విస్తరిస్తూ ప్రత్యేకంగా మ్యూజిక్ ఛానల్‌ను ప్రారంభించారు. ఇందులో భాగంగా వార్నర్ మ్యూజిక్ గ్రూప్‌కు చెందిన డివో మ్యూజిక్‌తో కలిసి గ్యాని సంగీతం అందించిన పాటలను విడుదల చేయనున్నారు.

డిజిటల్ స్టోరీటెల్లింగ్‌కు మంచి భవిష్యత్తు ఉంటుందని చాలామందికి గుర్తించకముందే ఆ దిశగా అడుగులు వేసిన నిహారిక కొణిదెల.. పింక్ ఎలిఫెంట్ పిక్చర్స్‌ను ప్రత్యేకమైన గుర్తింపు ఉన్న నిర్మాణ సంస్థగా తీర్చిదిద్దారు. ఇప్పటివరకు సినిమాలు, వెబ్ కంటెంట్‌తో ప్రేక్షకులను అలరిస్తూ వచ్చిన ఈ సంస్థ.. ఇప్పుడు మరో కొత్త రంగంలోకి అడుగుపెడుతోంది. ఇందులో భాగంగా ‘పింక్ ఎలిఫెంట్ మ్యూజిక్’ పేరుతో ప్రత్యేక మ్యూజిక్ ఛానల్‌ను ప్రారంభించారు. ఈ కొత్త ప్రయాణానికి నిహారిక నిర్మిస్తోన్న రాబోయే తెలుగు సినిమా ‘పాకెట్ రాకెట్స్’ ఆల్బమ్‌తో శ్రీకారం చుట్టనున్నారు. గ్యాని సంగీతం అందించిన ఈ సినిమా ఆల్బమ్ హై ఎనర్జీతో ఆకట్టుకోనుంది. పింక్ ఎలిఫెంట్ మ్యూజిక్ నుంచి ప్రేక్షకుల ముందుకు రాబోతున్న తొలి మ్యూజికల్ ప్రాజెక్ట్ ఇదే.

2015లో ప్రారంభమైన పింక్ ఎలిఫెంట్ పిక్చర్స్.. మొదట డిజిటల్ రంగంలో తన ప్రయాణాన్ని మొదలుపెట్టింది. తెలుగులో తొలి వెబ్ సిరీస్‌గా గుర్తింపు తెచ్చుకున్న ‘ముద్దపప్పు ఆవకాయ్’తో ఈ సంస్థ ప్రేక్షకులకు పరిచయమైంది. ఆ తర్వాత ‘నాన్న కూచి’, ‘మ్యాడ్ హౌస్’, ‘ఒక చిన్న ఫ్యామిలీ స్టోరీ’, ‘హలో వరల్డ్’, ‘బెంచ్ లైఫ్’ వంటి పలు వెబ్ సిరీస్‌లు, డిజిటల్ ప్రాజెక్టులను నిర్మించి మంచి గుర్తింపు సంపాదించుకుంది. ఆ తర్వాత సినిమా నిర్మాణ రంగంలోకి అడుగుపెట్టిన పింక్ ఎలిఫెంట్ పిక్చర్స్‌కు ‘కమిటీ కుర్రోళ్లు’ మంచి విజయాన్ని అందించింది. కొత్త దర్శకుడు యదు వంశీ తెరకెక్కించిన ఈ సినిమా.. 72వ జాతీయ చలనచిత్ర అవార్డుల్లో ఉత్తమ తెలుగు చిత్రంగా నిలిచి జాతీయ స్థాయిలో గుర్తింపు తెచ్చుకుంది.నిర్మాతగా నిహారిక కొణిదెల ప్రతిభకు కూడా పలు అవార్డులు దక్కాయి. ూ××హీూ 2025, ూహీూ 2025 వేడుకల్లో ఉత్తమ తొలి చిత్ర నిర్మాతగా ఆమె అవార్డులు అందుకున్నారు. ఇక ‘రాకాస’ సినిమాతో తన నిర్మాణ ప్రయాణాన్ని మరింత విస్తరించారు. కొత్త కథలను ప్రేక్షకులకు పరిచయం చేస్తూనే, వారి అభిరుచులకు తగ్గట్టుగా సినిమాలు అందించడమే లక్ష్యంగా పింక్ ఎలిఫెంట్ పిక్చర్స్ ముందుకు సాగుతోంది.

పింక్ ఎలిఫెంట్ మ్యూజిక్‌ను ప్రారంభించటం.. నిహారిక కొణిదెల ప్రయాణంలో మరో కీలక అడుగుగా చెప్పుకోవచ్చు. ఇప్పటివరకు సినిమా నిర్మాణానికే పరిమితమైన ఈ సంస్థ.. ఇకపై తన సినిమాల్లోని పాటలు, సంగీతానికి కూడా ప్రత్యేక వేదికను ఏర్పాటు చేస్తోంది. ఈ కొత్త మ్యూజిక్ ఛానల్ నుంచి మొదటి ఆల్బమ్‌గా ‘పాకెట్ రాకెట్స్’ పాటలు విడుదల కానున్నాయి. గ్యాని సంగీతం అందించిన ఈ ఆల్బమ్‌ను వార్నర్ మ్యూజిక్ గ్రూప్‌కు చెందిన డివో మ్యూజిక్ భాగస్వామ్యంతో ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నారు. ఇలా నిర్మాణ సంస్థ, సంగీత దర్శకుడు, ప్రముఖ మ్యూజిక్ సంస్థ కలిసి ఈ కొత్త ప్రయాణానికి శ్రీకారం చుడుతున్నారు. దీంతో పింక్ ఎలిఫెంట్ పిక్చర్స్ వినోద రంగంలో మరో కొత్త ప్రయాణాన్ని ప్రారంభించినట్లయ్యింది.

రుద్ర ఆత్రి రచించి దర్శకత్వం వహిస్తోన్న ‘పాకెట్ రాకెట్స్’ ఓ అర్బన్ డ్రామాగా తెరకెక్కుతోంది. అంజి, యేసు అనే ఇద్దరు యువకుల చుట్టూ ఈ సినిమా కథ తిరుగుతుంది. జీవితంలో తమ పరిస్థితులను మార్చుకోవాలనే ఆశతో, తమ కలలను నిజం చేసుకునే ప్రయత్నంలో వీరిద్దరూ జూద ప్రపంచంలోకి అడుగుపెడతారు. ఈ క్రమంలో ఎలాంటి పరిణామాలు ఎదురయ్యాయన్నదే సినిమా కథాంశం. ఈ చిత్రంలో త్రినాధ్ వర్మ, నిర్మల్, శ్రియ కొంతం, జేడీ చక్రవర్తి కీలక పాత్రల్లో నటిస్తున్నారు. పింక్ ఎలిఫెంట్ పిక్చర్స్‌పై నిహారిక కొణిదెల సమర్పణలో, మాగ్జిమం సిటీ స్టూడియోస్‌తో కలిసి ఈ సినిమా రూపొందుతోంది. పద్మజ కొణిదెల, రాహుల్ రాఘవేంద్ర, రాహుల్ నిమ్మకూరి నిర్మాతలుగా వ్యవహరిస్తుండగా.. రమేష్ మన్యం ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్‌గా పనిచేస్తున్నారు. ఎదురోలు రాజు సినిమాటోగ్రఫీ అందిస్తుండగా, అన్వర్ అలీ ఎడిటింగ్ బాధ్యతలు నిర్వహిస్తున్నారు.

పింక్ ఎలిఫెంట్ మ్యూజిక్ ప్రారంభంతో నిహారిక కొణిదెల తన నిర్మాణ సంస్థను మరో కొత్త దిశగా తీసుకెళ్తున్నారు. ఇప్పటివరకు సినిమాల ద్వారా కథలను ప్రేక్షకులకు చేరువ చేసిన ఈ సంస్థ.. ఇకపై సంగీతం ద్వారా కూడా తన క్రియేటివిటీని మరింత మందికి పరిచయం చేయాలని చూస్తోంది. ఈ కొత్త ప్రయాణంలో ‘పాకెట్ రాకెట్స్’ తొలి అడుగుగా మారింది. ఇక ఈ సినిమా డిసెంబర్ 11న థియేటర్లలో ప్రేక్షకుల ముందుకు రానుంది.

‘ఫ్యామిలీ ప్యాక్’ ఫన్ ప్యాక్డ్ సినిమా. సంక్రాంతికి ఫ్యామిలీతో కలిసి ప్యాక్డ్ థియేటర్స్‌లో చూడండి. అన్‌లిమిటెడ్ ఫన్ ఉంటుంది: టీజర్ లాంచ్ ఈవెంట్‌లో కింగ్ ఆఫ్ ఎంటర్‌టైన్‌మెంట్ శ్రీ విష్ణు

శ్రీ విష్ణు, రామ్ అబ్బరాజు, మైత్రీ మూవీ మేకర్స్ ‘ఫ్యామిలీ ప్యాక్’ ఫుల్ ఫన్ రైడ్ టీజర్ రిలీజ్

జన తెలంగాణ సినిమా

కింగ్ ఆఫ్ ఎంటర్‌టైన్‌మెంట్ శ్రీ విష్ణు ‘ఫ్యామిలీ ప్యాక్’ తో మరోసారి ప్రేక్షకులను నవ్వించడానికి సిద్ధమవుతున్నారు. రామ్ అబ్బరాజు దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ ఎంటర్‌టైనర్ 2027 సంక్రాంతికి గ్రాండ్‌గా రిలీజ్ కానుంది. మైత్రీ మూవీ మేకర్స్ బ్యానర్‌పై నవీన్ యెర్నేని, వై. రవిశంకర్ ఈ సినిమాను నిర్మిస్తున్నారు. ఇప్పటికే రిలీజ్ చేసిన ఫస్ట్ లుక్ పోస్టర్ మంచి ఇంప్రెషన్ క్రియేట్ చేసింది. తాజాగా మేకర్స్ సినిమా టీజర్‌ను రిలీజ్ చేశారు. విచిత్రమైన క్యారెక్టర్లు, ఆసక్తికరమైన పరిస్థితులు, నవ్వులు పూయించే సన్నివేశాలతో ఈ సినిమా ప్రేక్షకులకు పెద్ద ఫన్ రైడ్ ఇవ్వబోతున్నట్లు టీజర్ హామీ ఇస్తోంది.

ఈ సినిమాలో శ్రీ విష్ణు ఒక పోలీస్ ఆఫీసర్‌గా కనిపిస్తున్నారు. అయితే ఆయన వ్యక్తిత్వం చాలా డిఫరెంట్‌గా ఉంటుంది. బాధ్యతగా ఉండే ఫ్యామిలీ మెన్‌లా కాకుండా, తన కుటుంబం గురించి కూడా పెద్దగా పట్టించుకోని స్వార్థపరుడిగా కనిపిస్తారు. ఆయన ఇంట్లోని వ్యక్తుల లైఫ్ స్టయిల్ లో ఉన్న తేడాలను టీజర్ ఫన్నీగా చూపించింది. ఒకవైపు బోరబండ, మరోవైపు బంజారాహిల్స్ అంటూ రెండు ప్రాంతాల లైఫ్ స్టయిల్ ని పోలుస్తూ కామెడీని పండించారు.

ఇలాంటి వ్యక్తి జీవితంలోకి తన పై అధికారి కూతుర రావడంతో కథ ఆసక్తికరమైన మలుపు తిరుగుతుంది. ఈ విచిత్రమైన పరిస్థితి నుంచి ఎలాంటి కామెడీ పుడుతుంది? ఎలాంటి గందరగోళం చోటు చేసుకుంటుంది? అనేది టీజర్‌లో చూపించిన హ్యూమర్ ద్వారా అర్థమవుతోంది.

ఇప్పటికే తన ఎంటర్‌టైనింగ్ కథనాలతో మంచి గుర్తింపు తెచ్చుకున్న దర్శకుడు రామ్ అబ్బరాజు మరోసారి కామెడీ ప్రధానంగా ఈ సినిమాను తెరకెక్కించారు.

శ్రీ విష్ణు తన డిఫరెంట్ యాటిట్యూడ్, బ్యాడీ లాంగ్వేజ్ తో మరోసారి తన కామెడీ టైమింగ్ తో అదరగొట్టారు. తన సహజమైన నటన, ఎంటర్‌టైనింగ్ స్క్రీన్ ప్రెజెన్స్‌తో మరోసారి ‘కింగ్ ఆఫ్ ఎంటర్‌టైన్‌మెంట్’ అనిపించుకున్నారు. కామెడీ కోసం ప్రత్యేకంగా ప్రయత్నించినట్లు కాకుండా, సన్నివేశాల నుంచే సహజంగా నవ్వులు పుట్టేలా టీజర్ సాగింది. మొత్తంగా టీజర్ చాలా ఫ్రెష్‌గా, సరదాగా ఆకట్టుకుంటోంది.

హీరోయిన్‌గా సాక్షి మధోల్కర్ అందంగా కనిపించారు. శ్రీ విష్ణు, నరేష్ వీకే కాంబినేషన్ మరోసారి నవ్వులు పంచేలా ఉంది. శ్రీ విష్ణు తల్లిగా అభిరామి, తమ్ముడిగా బుల్లిరాజు, సాక్షి తండ్రిగా మురళీ శర్మ పాత్రలు ఆకట్టుకున్నాయి. వీరితో పాటు ఇతర పాత్రలు కూడా సినిమాలో మరింత ఎంటర్‌టైన్‌మెంట్ అందించనున్నాయి.

జె. యువరాజ్ కలర్‌ఫుల్ సినిమాటోగ్రఫీ టీజర్‌కు మంచి విజువల్ అప్పీల్ తీసుకొచ్చింది. చైతన్ భరద్వాజ్ అందించిన ఎనర్జిటిక్ మ్యూజిక్ సినిమా మూడ్‌కు చక్కగా సరిపోయింది. టీజర్‌లో ఆద్యంతం సంక్రాంతి పండగ వాతావరణం కనిపిస్తోంది. మైత్రీ మూవీ మేకర్స్ ఈ సినిమాను గ్రాండ్ స్కేల్‌లో నిర్మిస్తున్నారు. అనిల్ పసల ఎడిటర్‌గా, బ్రహ్మ కడలి ఆర్ట్ డైరెక్టర్‌గా పనిచేస్తున్నారు.

గతంలో రామ్ అబ్బరాజుతో కలిసి పనిచేసిన భాను భోగవరపు, నందు సావిరిగాన ఈ సినిమాకు కథ, స్క్రీన్‌ప్లే, డైలాగ్స్ అందిస్తున్నారు. వీరి రచన కూడా ఈ ఎంటర్‌టైనర్‌కు ప్రధాన బలాల్లో ఒకటిగా నిలవనుంది. ‘ఫ్యామిలీ ప్యాక్’ టీజర్ సినిమాపై మంచి అంచనాలు పెంచుతోంది. 2027 సంక్రాంతికి థియేటర్లలోకి రానున్న ఈ సినిమా ప్రేక్షకులకు ఫుల్ ఫన్ ట్రీట్ ఇవ్వడానికి సిద్ధమవుతోంది.

టీజర్ లాంచ్ ఈవెంట్‌లో హీరో శ్రీ విష్ణు మాట్లాడుతూ.. అందరికీ నమస్కారం. నవీన్ గారికి, రవి గారికి థాంక్యూ. అలాగే ఆదిత్య గారు, అనిల్ గారు మాకు ఎంతో సపోర్ట్ చేశారు. డైరెక్టర్ రామ్ అబ్బరాజు గారు, బ్రహ్మ కడలి గారు, డీఓపీ యువరాజ్ గారు.. ఇలా అందరూ అద్భుతమైన వర్క్ ఇచ్చారు. మంచి టీమ్ వర్క్‌తో ఈ సినిమా చేశాం. ఫుల్ ఫన్ చాలా బాగా వచ్చింది. డైలాగ్స్ కూడా అదిరిపోయాయి. ‘సామజవరగమన’ విజయవంతమైన తర్వాత రామ్ అబ్బరాజుతో మరో సినిమా చేయాలనుకున్నాం. ఒక మంచి కథ దొరికితే కలిసి పనిచేద్దామని అనుకున్నాం. అలాంటి సమయంలో ఈ కథ వచ్చింది. ఇది ఒక మంచి ఫ్యామిలీ ఎంటర్‌టైనర్. ఇందులో ఒక కొత్త యాంగిల్ ఉంటుంది. అది టీజర్‌లో, ట్రైలర్‌లో ఉండదు. మీరు థియేటర్‌లోనే ఎంజాయ్ చేస్తారు. సాక్షి చాలా అద్భుతంగా పెర్ఫార్మ్ చేసింది. సుదర్శన్‌తో నేను చేసిన సినిమాలన్నీ హిట్టే. ఇది కూడా హిట్ అవుతుందని నమ్ముతున్నాను. సత్య కామెడీ అదిరిపోతుంది. వెన్నెల కిషోర్ గారి ట్రాక్ చాలా డిఫరెంట్‌గా ఉంటుంది. నరేష్ గారిది కూడా చాలా మంచి క్యారెక్టర్. బుల్లిరాజు నాతో పాటు సినిమా అంతా ఉంటాడు. ఇరగదీశాడు. అందరికీ పేరుపేరునా ధన్యవాదాలు. సినిమాను చాలా మంచి ఫన్ ప్యాక్‌తో సిద్ధం చేశాం. ఫ్యామిలీతో కలిసి ఫ్యాక్డ్ థియేటర్‌లో చూడండి. థాంక్ యూ.

డైరెక్టర్ రామ్ అబ్బరాజు మాట్లాడుతూ.. అందరికీ నమస్కారం. టీజర్ మీ అందరికీ నచ్చినందుకు చాలా ఆనందంగా ఉంది. టీజర్ కంటే ట్రైలర్ ఇంకా అద్భుతంగా ఉంటుంది. సినిమా అంతకంటే అద్భుతంగా ఉంటుంది. భాను, నందుతో నా కొలాబరేషన్ ఇలాగే కంటిన్యూ అవుతూ ఉంటుంది. ఈ సినిమాలో ఫన్ అద్భుతంగా వర్కౌట్ అయింది. నవీన్ గారు, రవి గారు ఎప్పుడూ మాకు అందుబాటులో ఉంటూ అన్ని విధాలుగా సపోర్ట్ చేశారు. శ్రీ విష్ణు గారితో నాకు ఇది రెండో సినిమా. ఆయన నాకు ఒక ఫ్యామిలీ మెంబర్ లాంటివారు. సంక్రాంతి రోజున ఈ సినిమా మీ అందరికీ ఫుల్ ఎంటర్‌టైన్‌మెంట్ ఇస్తుంది. హ్యాపీగా ఎంజాయ్ చేసేలా ఉంటుంది. సంక్రాంతికి థియేటర్లన్నీ ఫ్యామిలీలతో ప్యాక్ అయితే, అది చూడటానికి చాలా హ్యాపీగా ఉంటుంది. అందరూ థియేటర్లలోనే సినిమా చూడాలని కోరుకుంటున్నాను.

హీరోయిన్ సాక్షి మధోల్కర్ మాట్లాడుతూ.. ఈ సినిమా గురించి చాలా హ్యాపీగా, ఎక్సైటెడ్‌గా ఉన్నాను. సంక్రాంతి అనేది మనందరికీ పెద్ద పండుగ. అలాంటి పండుగకు మా సినిమా రావడం చాలా ఆనందంగా ఉంది. శ్రీ విష్ణు గారు కింగ్ ఆఫ్ ఎంటర్‌టైన్‌మెంట్. సంక్రాంతికి ‘ఫ్యామిలీ ప్యాక్’తో కలుద్దాం.

సుదర్శన్ మాట్లాడుతూ.. ఇప్పుడు మీరు టీజర్‌లో చూసింది చిన్న శాంపిల్ మాత్రమే. సినిమా అంతా ఫుల్ ఫన్‌గా ఉంటుంది. సామజ చూసి థియేటర్లలో ఎలా నవ్వుకున్నారో, దానికి రెండింతలు ఫన్ ‘ఫ్యామిలీ ప్యాక్’లో ఉంటుంది. 100 శాతం ఈ సినిమా మీ అందరికీ బాగా నచ్చుతుంది.

డీఓపీ యువరాజ్ మాట్లాడుతూ..‘ఫ్యామిలీ ప్యాక్’ కంప్లీట్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్. ఇందులో అన్‌లిమిటెడ్ ఫన్ ఉంది. అందరూ సినిమాకు వచ్చి సంక్రాంతి పండుగను ఎంజాయ్ చేస్తారని అనుకుంటున్నాను. శ్రీ విష్ణు గారితో కలిసి పనిచేయడం చాలా హ్యాపీగా అనిపించింది. డైరెక్టర్ గారితో మరిన్ని సినిమాలు చేయాలని కోరుకుంటున్నాను. ఈ సినిమా చేస్తున్నప్పుడు మేమంతా ఒక ఫ్యామిలీలా అయిపోయాం.

ప్రొడక్షన్ డిజైనర్ బ్రహ్మ కడలి మాట్లాడుతూ.. మైత్రీ మూవీ మేకర్స్‌లో నాకు ఇది మొదటి సినిమా. మా మీద నమ్మకంతో ఈ సినిమాను ఎక్కడా రాజీపడకుండా నిర్మించారు. వారి నమ్మకాన్ని మేము నిలబెట్టుకుంటాం. షూటింగ్ స్పాట్‌లో ఎప్పుడైతే అందరూ నవ్వుకుంటారో, ఆ సినిమా చాలా పెద్ద విజయం సాధిస్తుందని నేను నమ్ముతాను. ఈ సినిమా షూటింగ్‌లో మేమంతా ఎప్పుడూ నవ్వుతూనే ఉండేవాళ్లం. ఆ నవ్వులు థియేటర్లలో ప్రేక్షకులకు కూడా వస్తాయి. శ్రీ విష్ణు గారితో మరిన్ని సినిమాలు చేయాలని కోరుకుంటున్నాను.

నటీనటులు: శ్రీ విష్ణు, సాక్షి మధోల్కర్, నరేష్ వీకే, అభిరామి, మురళీ శర్మ, అన్నపూర్ణమ్మ, వెన్నెల కిషోర్, సుదర్శన్, సత్య, రోహిణి, గెటప్ శ్రీను, మురళీధర్ గౌడ్, గోపరాజు విజయ్, బుల్లిరాజు (రేవంత్), శ్రీ ముక్త, రఘుబాబు, మాణిక్ రెడ్డి, హరి ప్రసాద్, ఇమ్మాన్యుయేల్, మధుమణి, గీతా సింగ్

టెక్నికల్ టీమ్:

దర్శకత్వం: రామ్ అబ్బరాజు

నిర్మాతలు: నవీన్ యెర్నేని, వై. రవిశంకర్

బ్యానర్: మైత్రీ మూవీ మేకర్స్

కో-ప్రొడ్యూసర్: అనిల్ యెర్నేని

సీఈఓ: చెర్రీ

కథ, స్క్రీన్‌ప్లే, డైలాగ్స్: భాను భోగవరపు, నందు సావిరిగాన

సినిమాటోగ్రఫీ: జె. యువరాజ్

మ్యూజిక్ డైరెక్టర్: చైతన్ భరద్వాజ్

ఎడిటర్: అనిల్ పసల

ఆర్ట్ డైరెక్టర్: బ్రహ్మ కడలి

ఫైట్ మాస్టర్: పృథ్వీ

లిరిసిస్ట్: రామజోగయ్య శాస్త్రి

ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: చెంబోలు సాయి ఆదిత్య

కాస్ట్యూమ్స్: రాజేష్ కమార్సు, విభా రెడ్డి

పీఆర్వో: వంశీ శేఖర్

పబ్లిసిటీ డిజైనర్: వియాకి

ప్రభుదేవాతో మంచు విష్ణు పాన్‌ఇండియా సినిమా!

ప్రముఖ నృత్య దర్శకుడు ప్రభుదేవా డైరెక్టర్‌గానూ విజయాలు అందుకున్న సంగతి తెలిసిందే. తెలుగుతో పాటు తమిళం, హిందీల్లో ఆయన పలు చిత్రాలు తెరకెక్కించారు. 2021లో సల్మాన్ ఖాన్ నటించిన ‘రాధే’కు దర్శకత్వం వహించిన తరువాత మరో చిత్రం ఆయన నుంచి రాలేదు. ఇన్నేళ్ల విరామం తరువాత ఇప్పుడు మంచు విష్ణుతో తదుపరి చిత్రాన్ని తెరకెక్కించేందుకు సిద్ధమయ్యారు.



డింపుల్ హయాతికి క్షమాపణలు చెప్పిన దర్శకుడు సంపత్ నంది

సోమవారం (నవంబరు 23) మంచు విష్ణు పుట్టినరోజు సందర్భంగా సామాజిక మాధ్యమాల్లో శుభాకాంక్షలు తెలియజేస్తూ ఈ ప్రాజెక్టు గురించి వెల్లడించారు ప్రభుదేవా. “నా హీరో, తమ్ముడు మంచు విష్ణుకు హ్యాపీ బర్త్‌డే. ‘వీఎం 24’ (వర్కింగ్ టైటిల్)తో ఈ సంబరాలు మరింత ప్రత్యేకంగా మారాయి” అని ప్రభుదేవా పోస్టు చేశారు. దీంతోపాటు విష్ణుతో కలిసి పోజిచ్చిన ఫొటోను పంచుకున్నారు. యాక్షన్ థ్రిల్లర్ కథతో పాన్‌ఇండియా స్థాయిలో ఈ సినిమాను రూపొందించబోతున్నట్లు సమాచారం. ఈ సినిమా కోసం విష్ణు కొత్తగా కనిపించడానికి శారీరకంగా తనను తాను తీర్చిదిద్దుకున్నట్లు తెలుస్తోంది. ఈ సినిమాలో నటించే ఇతర తారాగణం వివరాలు తెలియాల్సి ఉంది.

Published at H.NO. 1-107/3, PALAKURTHIVILLAGE, RAMAGUNDAM DIST, KARIMNAGAR TELANGANA Editor: R. CHAITANYA, RNI NO. TELTEL/2014/61071 Cell: 9701676775